మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



యూన్ తొలగింపుపై సత్వర నిర్ణయం అవసరం

హిజాబ్ ధరించలేదని... ఇరాన్‌లో యుట్యూబ్ సింగర్ అరెస్టు

దోషులను శిక్షించాలి

లోపలి పేజీల్లో



సంపుటి 27, సంచిక: 179 | సోమవారం | 16-12-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | ఖమ్మం : 12+8 | కరీంనగర్ : 12+8 | మహబూబ్‌నగర్ : 12 | వెల రూ. 5.00


### జమిలి ఎన్నికల బిల్లుపై

## వెనక్కి తగ్గిన కేంద్రం

లోక్‌సభ బిజినెస్ జాబితా నుంచి రెండు బిల్లులు తొలగింపు



**న్యూఢిల్లీ :** జమిలి ఎన్నికల బిల్లులపై కేంద్రం పునరాలోచనలో పడినట్లు కనిపిస్తోంది. తాజాగా లోక్‌సభ బిజినెస్ జాబితా నుంచి రెండు బిల్లులను తొలగించారు. తొలుత ఈ నెల 16న లోక్‌సభ ముందుకు బిల్లులు తీసుకురావడానికి కేంద్రం సిద్ధమైంది. ఆమేరకు లోక్‌సభ బిజినెస్ జాబితాలో తరువాయి 2లో

## బహిరంగ క్షమాపణ చెప్పిన మోహన్‌బాబు

బాధిత జర్నలిస్టుకు పరామర్శ

ప్రజాపక్షం/హైదరాబాద్

జర్నలిస్టుల ఆందోళనలపై ప్రముఖ సినీ నటుడు మోహన్ బాబు స్పందించారు. ఆయన దాడిలో గాయాలపాలై యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తరువాయి 2లో



మరో కొత్త పథకం

### 28న నిరుపేదల ఖాతాల్లోకి

# రూ.12వేలు



రెండు విడతల్లో పేదల ఖాతాల్లో జమ

సంక్రాంతి నుంచి రైతు భరోసా

ప్రజాప్రభుత్వం ఏర్పాటు తర్వాత రైతుల కోసం రూ.50,953 కోట్లు ఖర్చు

రాష్ట్రంలో కొత్తగా నాలుగు విమానాశ్రయాలు ఏర్పాటు

అప్పులపై బిఆర్‌ఎస్‌వి అబద్ధాలు

మీడియా సమావేశంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క

ప్రజాపక్షం/ఖమ్మం

భూమి లేని నిరుపేద కుటుంబాలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డిసెంబర్ 28న రూ. 12వేలు అందజేస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని ఇందులో భాగంగా అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిన డిసెంబర్ 28న ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఆదివారం ఖమ్మం కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొదటి విడతగా ఆరువేల రూపాయలను మరో దఫాలో ఆరువేల రూపాయలను చెల్లిస్తామన్నారు. సంక్రాంతి నుంచి రైతులకు రైతు భరోసా అందజేస్తామని తెలిపిన భట్టి విక్రమార్క దేశంలో ఏ రాష్ట్రం చేయని రీతిలో రెండు లక్షల రుణాలు ఉన్న రైతులందరికీ 15 రోజుల్లో వారి వారి ఖాతాల్లో నేరుగా రూ.21వేల కోట్లను జమ చేసి దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో నాలుగు కొత్త విమానాశ్రయాలను ఏర్పాటు చేయనున్నామని భట్టి విక్రమార్క తెలిపారు. పరిశ్రమలను విస్తరించడంతో పాటు రవాణా సౌకర్యాలను మెరుగుపరిచే ప్రక్రియలో భాగంగా కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్, వరంగల్ ప్రాంతాల్లో విమానాశ్రయాలను ఏర్పాటు చేయనున్నామన్నారు. హైదరాబాద్ నగరంలో ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేస్తున్నామని అంతర్జాతీయ ప్రమాణాలతో స్పోర్ట్స్, స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో 55 కిలో మీటర్ల మేర ప్రవహిస్తున్న మూసీనది ప్రక్షాళన చేసి పునరుజ్జీవానికి కృషి చేస్తామన్నారు. అన్ని జిల్లాలను కలుపుతూ రీజినల్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేస్తామని ఔటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగు రోడ్డుకు మధ్యన పరిశ్రమలు, గృహ నిర్మాణాలకు సంబంధించి క్లస్టర్‌లను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. రైతుల కోసం ఏర్పడిన ప్రజా ప్రభుత్వం ఇది అని అందుకే రైతుల కోసం రూ.50,953 కోట్లు ఖర్చు చేసిందని ఆయన తెలిపారు. వ్యవసాయానికి రైతులకు ఈ మొత్తాన్ని నేరుగా ఖర్చు చేశామని రైతుభరోసాకు రూ. 7,625 కోట్లు, రుణమాఫీకి రూ.21వేల కోట్లు, తరువాయి 2లో




## నేటి నుంచి అసెంబ్లీ పునః ప్రారంభం

సభల ముందుకు యంగ్ ఇండియా, స్పోర్ట్స్ యూనివర్సిటీ తదితర బిల్లులు

ప్రజాపక్షం/హైదరాబాద్

శాసనసభ,శాసన మండలి సమావేశాలు సోమవారం నుంచి పునః ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశంలో యంగ్ ఇండియా, ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ యూనివర్సిటీ బిల్లు2024, 'ది తెలంగాణ యూనివర్సిటీ సవరణ బిల్లు 2024' రెండు బిల్లులను ఉభయ సభలలో ప్రవేశపెట్టనున్నారు. అనంతరం 'తెలంగాణ స్టేట్ టూరిజం పాలసీ'పై లఘు చర్చ జరగనుంది. అంతకు ముందు ప్రశ్నోత్తరాల సమయం, ఆ తర్వాత సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారు. అనంతరం బిల్లులపైన చర్చ ఆ తర్వాత టూరిజం పాలసీపైన లఘు చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ నెల 9న శాసనసభ, మండలి ఉభయ సభల సమావేశాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి ప్రకటన అనంతరం సభ వాయిదా పడిన విషయం తెలిసిందే.

## రైతులపై కేంద్ర ప్రభుత్వం దమనకాండను సహించబోం

సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతులపై కేంద్ర ప్రభుత్వ దమనకాండను సహించబోమని సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ హెచ్చరించింది. ఢిల్లీ సరిహద్దులోని శంభు వద్ద రైతులపై భద్రతా సిబ్బంది భాష్ప వాయుగోళాలు, నీటి ఫిరంగులను ప్రయోగించడాన్ని సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. రైతులు తమ న్యాయమైన తరువాయి 2లో

## గత పదేళ్లలో వెనుకబడిన రాష్ట్రం

● బిఆర్‌ఎస్ అరాచకాన్ని ప్రజలెప్పటికీ మరిచిపోరు ● డ్రామా ఆర్టిస్టుల్లా వ్యవహరిస్తున్న కెటిఆర్, కవిత, హరీశ్‌రావు ● అవినీతి కుంభకోణాలపై మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించడమే ● టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ విమర్శ ● బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావుకు బహిరంగలేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం వెనుకబాటుకు గురైందని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. బిఆర్‌ఎస్ చేసిన ఆరాచకాన్ని ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరని చెప్పారు. కెటిఆర్, కవిత, హరీశ్‌రావు డ్రామా ఆర్టిస్టుల్లా వ్యవహరిస్తూ, అవినీతి, కుంభకోణాలపై మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉన్నదని ఎద్దేవా చేశారు. పెత్తందారు ప్రభుత్వంతో విసిగిపోయిన ప్రజలు బిఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడినప్పటికీ, కెసిఆర్, ఆయన కుటుంబ సభ్యుల్లో, బిఆర్‌ఎస్ నాయకుల్లో ఎటువంటి మార్పు రాలేదని అన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవమున్నట్టు చెప్పుకునే కెసిఆర్ కేవలం ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని దుయ్యబట్టారు. ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి వచ్చి, రాష్ట్ర అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇస్తే బాగుంటుందని ఆయన సూచించారు. ఈ మేరకు బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావుకు మహేష్‌కుమార్‌గౌడ్ ఆదివారం బహిరంగ లేఖ రాశారు. బిఆర్‌ఎస్ దశాబ్ద పాలనలో అక్షరాలు, విగ్రహాలు,ఆట, పాట, గేయం ఇలా అన్నింటా రాష్ట్ర అస్తిత్వానికి ప్రమాదం కలిగించిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అధికారాన్ని కట్టబెడితే ఓర్వలేక కెసిఆర్, ఆయన కుటుంబ సభ్యులు, బిఆర్‌ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇదే పంథాలో తరువాయి 2లో




## హింసను వీడండి

జనజీవన స్రవంతిలో చేరండి

మావోయిస్టులకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పిలుపు

2026 మార్చిలోపు నక్సలిజాన్ని అంతమొందిస్తామని పునరుద్ఘాటన

**రాయ్‌పూర్ :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో 2026 మార్చి 31లోపు నక్సలిజాన్ని నిర్మూలించేందుకు కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నాయని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అన్నారు. ఛత్తీస్‌గఢ్ నక్సలిజం నుండి విముక్తి పొందినప్పుడు దేశం మొత్తం ముప్పు నుండి విముక్తి పొందుతుందని ఆయన ఆదివారం నాడు రాయ్‌పూర్‌లోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన 'ప్రెసిడెంట్స్ పోలీస్ కలర్ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమం'లో ప్రసంగించారు.అమిత్‌షా మాట్లాడుతూ గత ఏడాదికాలంలో నక్సలిజానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులు గణనీయమైన విజయం సాధించారని పేర్కొన్నారు. నక్సలైట్లు హింసను వీడి జనజీవన స్రవంతిలో చేరాలని హోం మంత్రి అమిత్‌షా విజ్ఞప్తి చేశారు. నక్సలైట్ల కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం రూపొందించిన పునరావాస విధానాన్ని అమిత్‌షా ప్రశంసించారు. 'రాష్ట్ర నాయకత్వం, తరువాయి 2లో

## సుప్రీం కొలీజియం ముందుకు జస్టిస్ శేఖర్‌కుమార్

అలహాబాద్ హైకోర్టులో జరిగిన కార్యక్రమంలో చేసిన వాఖ్యలపై వివరణ ఇచ్చే అవకాశం



**న్యూఢిల్లీ :** విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) కార్యక్రమంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ త్వరలోనే సుప్రీంకోర్టు కొలీజియం ముందు హాజరుకానున్నారు. ఈ వివాదంపై ఆయన తన వైఖరిపై వివరణ ఇచ్చే అవకాశం ఉంది. అత్యున్నత న్యాయస్థానం డిసెంబరు 10న వార్తా పత్రికలలో వచ్చిన ఆయన వ్యాఖ్యలకు సంబంధించిన నివేదికలను పరిగణనలోకి తీసుకుంది. మొత్తం సమస్యపై అలహాబాద్ హైకోర్టు నుండి నివేదికను కోరింది.'అలహాబాద్‌లోని హైకోర్టు ఆఫ్ జ్యుడికేచర్ తరువాయి 12లో



భారత్‌లో దిస నాయకే తొలి పర్యటన 05

## తొలిరోజు గ్రూప్ –2 పరీక్ష ప్రశాంతం

పేపర్1లో 46.75, పేపర్ 2లో 46.30 శాతం అభ్యర్థుల హాజరు



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ కమిషన్ (టిజిపిఎస్‌సి) ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రూప్ –2 పరీక్షలు రాష్ట్ర వ్యాప్తంగా మొదటి రోజు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 5,51,855 మంది అభ్యర్థులకు గాను పేపర్ 1లో 2,57,981(46.75 శాతం ) మంది అభ్యర్థులు, పేపర్ 2లో 2,55,490 మంది(46.30 శాతం) తరువాయి 2లో

### పాతనగరం మెట్రోకు

# భూసేకరణ షురూ

రోడ్డు విస్తరణ ప్రక్రియను ముమ్మరం చేసిన యంత్రాంగం

నెలాఖరులోగా ప్రభావిత ఆస్తులకు అవార్డులు

తదనంతరం పరిహారం చెల్లింపు

ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఎన్‌విఎస్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్

పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు సిఎంకు నివేదిస్తున్న అధికారులు



ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ పాతనగరంలో మెట్రోరైల్ నిర్మాణానికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటి వరకు నిరాదరణకు గురైన పాతబస్తీ మెట్రో రైల్ రాకతో ఆకర్షణీయ ప్రాంతంగా రూపాంతరం చెందనుంది. ఉపాధి అవకాశాలు మెరుగు కావడమే కాకుండా, కాలుష్య రహితంగా మారనుంది. మెట్రో పరుగులతో పాత బస్తీ సరికొత్త అభివృద్ధి వైపు అడుగులు వేయనుంది. పాతబస్తీని ఓల్డ్ సిటీ కాదు ఒరిజినల్ సిటీ అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మెట్రోరైల్‌ను త్వరితగతిన పనులు పూర్తి చేసి తరువాయి 2లో

## జోరుగా 'జీరో' కాటన్ దందా

పల్లెల్లో విచ్చలవిడిగా పత్తి కొనుగోళ్లు

లైసెన్స్ లేకుండా వ్యాపారం..తూకంలో మోసం..

తనిఖీలు లేవు.. కేసు కూడా లేదు

గ్రామాల్లో కాంటాలతో ప్రభుత్వ ఆదాయానికి గండి

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పత్తి జీరో దందా జోరందుకుంది. పల్లెల్లో చిల్లర కాంటాల వ్యాపారం విచ్చలవిడిగా కొనసాగుతోంది. దీంతో మార్కెట్ ఆదాయానికి గండిపడుతుండటంతో పాటు రైతులు కూడా నష్టపోతున్నారు. ఎటువంటి లైసెన్స్ లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా సరుకులు కొనుగోలు చేస్తూ వ్యాపారులు రూ.లక్షల్లో గడిస్తున్నారు. పలువురు దళారులు పత్తి పంట కొనుగోలు నిబంధనలకు విరుద్ధంగా కొనుగోళ్లు చేపడుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లోనే కల్లాలను నిర్వహిస్తున్నారు. ఎలక్ట్రానిక్ కాంటాలు కాకుండా చిల్లర కాంటలను వినియోగిస్తూ రైతులను మోసం చేస్తున్నారు. అలాగే ట్రాక్టర్ లేదా ఆటో, డీసీఎం వాహనంలో రైతులు తెచ్చిన పత్తిని సీసీఐ కేంద్రాల్లో సిబ్బంది తేమ పరీక్ష చేసి తిరస్కరించడంతో ఖర్చు భారంగా భావిస్తున్న రైతులు వేరే చోటకు తరువాయి 12లో



# దోషులను శిక్షించాలి







**అవిగ్నాన్:** సుమారు రెండు దశాబ్దాలపాటు భర్త, మరికొందరు వ్యక్తుల చేతిలో అత్యాచారాలకు గురైన గిసెలె పెలికాట్‌కు మద్దతుగా ఫ్రాన్స్‌లోని అవిగ్నాన్‌లో భారీ ప్రదర్శన జరిగింది. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది వీధుల్లోకి వచ్చారు. 'నువ్వు దోషివి అని మాకు తెలుసు.. నువ్వు రేపిస్టువని మేము నమ్ముతున్నాం' అని రాసి ప్లకార్డులతో, గిసెలె మాజీ భర్య డామినిక్ పెలికాట్‌ను ఉద్దేశిస్తూ నిరస ప్రదర్శనలు నిర్వహించారు.72 ఏళ్ల డామినిక్‌పై 71 ఏళ్ల గిసెలె అత్యాచారం కేసు పెట్టడం ఫ్రాన్స్‌లో సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. డామినిక్‌తో తన వైవాహిక జీవితం సక్రమంగా సాగలేదని, అతను తన ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా పదేపదే అత్యాచారం జరిపాడని గిసెలె తన ఫిర్యాదులో పేర్కొంది. తనను శారీరకంగానేగాక, మానసికంగా కూడా చిత్రవధ చేశాడని ఆరోపించింది. అతనితో పాటు ఎంతో మంది తనపై అత్యాచారం చేశారని తెలిపింది. మొత్తం 51 మందిపై పోలీసులు కేసు పెట్టారు. ఈనెల 20వ తేదీ, శుక్రవారం ఈ కేసులో తీర్పు వెలువడే అవకాశం ఉన్నందున, గిసెలెకు మద్దతుగా వేలాది మంది గళం విప్పుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో మౌనంగా ఉన్నప్పటికీ, తనకు జరిగిన అన్యాయం దేశంలో మరెవరికీ జరగకూడదన్న ఉద్దేశంతో ఆమె కోర్టు మెట్లు ఎక్కడాన్ని ప్రశంసిస్తున్నారు. వైవాహిక జీవితం ముసుగులో జరుగుతున్న అత్యాచారాలను ఖండిస్తున్నారు. ఫ్రాన్స్‌లోనేగాక, ప్రపంచ వ్యాప్తంగా ఆసక్తి రేపుతున్న ఈ కేసులో తీర్పు ఎలా ఉంటుందోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

# యూన్ తొలగింపుపై సత్వర నిర్ణయం అవసరం

## రాజ్యాంగ కోర్టుకు దక్షిణ కొరియా ప్రతిపక్ష నేత లీ వినతి



**సియోల్ :** పార్లమెంటు అభిశంసన తీర్మానం ద్వారా అధ్యక్షుడు యూన్ సుక్ ఇయోల్‌ను తొలగించింది కాబట్టి, ఆ తీర్మానంపై సత్వర నిర్ణయం తీసుకోవాలని రాజ్యాంగ కోర్టుకు దక్షిణ కొరియా ప్రతిపక్ష నేత లీ జయె మ్యుంగ్ విజ్ఞప్తి చేశారు. సుమారు రెండు వారాలు కొనసాగిన హైడ్రామాకు శనివారం తెరపడిన విషయం తెలిసిందే. దక్షిణ కొరియా జాతీయ పార్లమెంటులో గత శనివారం అభిసంశన తీర్మానంపై ఓటింగ్లో పాలకవర్గ సభ్యులు పాల్గొనకపోవడం వల్ల పదవీగండం నుంచి యూన్ తాత్కాలికంగా తప్పించుకున్నారు. కానీ, 14వ తేదీన రెండోసారి ప్రవేశ పెట్టిన అభిశంసన తీర్మానానికి అనుకూలంగా 204 మంది ఓటు వేశారు. కేవలం 85 మంది మాత్రమే వ్యతిరేకించారు. ఫలితంగా అతను పదవీచ్యుతుడయ్యారు. రాజ్యాంగ కోర్టు తుది నిర్ణయం తీసుకొని, తదుపరి చర్యలకు ఉత్తర్వులు జారీ చేస్తుంది. 180 రోజుల్లోగా రాజ్యాంగ కోర్టు ఈ నిర్ణయంపై తీర్పును ఇవ్వచ్చు. అభిశంసనకు అనుకూలంగా కోర్టు తీర్పు వెల్లడిస్తే, అది వెలువడిన 60 రోజుల్లోగా అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. అప్పటి వరకూ ప్రధాని హన్ డాక్ సూ అధ్యక్ష బాధ్యతలు కూడా నిర్వహిస్తారు. ఇలావుంటే, తీర్పును సాధ్యమైనంత త్వరగా వెల్లడించడం ద్వారా, రాజకీయ అస్థిరతకు తెరదించాలని కోర్టును లీ కోరారు. మార్షల్ లా విధించడం ద్వారా ఉత్పన్నమైన వ్యతిరేకత తీవ్రరూపం దాల్చి, చివరికి యూన్ ఉద్వాసనకు దారి తీసిన వైనాన్ని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానికి అన్ని విధాలా సహకరిస్తామని చెప్పారు. ప్రభుత్వాన్ని కూలదోసే ఆలోచన లేదని, ప్రధానికి తోడ్పాటును అందిస్తామని తెలిపారు. దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కోర్టు త్వరలోనే తీర్పునిస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రపంచం

# ఘర్షణ లేని రాజకీయ పరివర్తన



సిరియాలో మార్పుపై పలుదేశాల ఆశాభావం

## బలగాలను ఉపసంహరించుకోవాలని ఇజ్రాయెల్‌కు డిమాండ్

**అమ్మాన్ (జోర్డాన్):** సిరియాలో రాజకీయ పరివర్తన లేదా అధికార మార్పిడి ఎలాంటి ఘర్షణలు లేకుండా, శాంతియుతంగా పూర్తవుతుందని పలు దేశాలు ఆశాభావం వ్యక్తం చేశాయి. సిరియా నుంచి బలగాలను ఉపసంహరించుకోవాలని ఇజ్రాయెల్‌ను డిమాండ్ చేశాయి. సిరియాలో బషర్ అసద్ ప్రభుత్వాన్ని హయాత్ తహరీర్ అల్‌షామ్ (హెచ్‌టిఎస్) తిరుగుబాటు దళాలు కుప్పకూల్చిన విషయం తెలిసిందే. అధ్యక్షుడిగా తిరుగులేని అధికారాన్ని చెలాయించిన అసద్ గుర్తుతెలియని ప్రాంతానికి పరారయ్యాడు. అతను రష్యాకు వెళ్లి ఉండవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. అయితే, అధికారికంగా ఎలాంటి ధ్రువీకరణ లేదు. కాగా, సిరియా పరిణామాల నేపథ్యంలో అమెరికా, తుర్కియే, యూరోపియన్ యూనియన్, అరబ్ దేశాలు ఇక్కడ సమావేశమై, పరిస్థితులను చర్చించాయి. సిరియాలో పరిస్థితులు చక్కబడతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశాయి. సిరియాలోకి చొచ్చుకుపోయిన ఇజ్రాయెల్ దళాలు వెంటనే వెనక్కు వెళ్లిపోవాలని ఈ దేశాలు డిమాండ్ చేశాయి. సమావేశమైన దేశాలు విడుదల చేసిన సంయుక్త ప్రకటనను అనుసరించి, హెచ్‌టిఎస్ నాయకత్వంతో అమెరికా తదితర దేశాలు సంప్రదింపులు జరుగుతుంది. అధికార మార్పిడిలో ఘర్షణలు తలెత్తకుండా చూడడమే లక్ష్యం చర్చలు కొనసాగిస్తుంది. సిరియా ప్రాదేశిక సమగ్రతకు ఈ దేశాలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. ఇలావుంటే, అరబ్ దేశాల విదేశాంగ మంత్రులు ప్రత్యేకంగా విడుదల చేసిన ఒక ప్రకటనలో, సిరియన్లు ఆమోదించిన కొత్త రాజ్యాంగం ఆధారంగా, ఐక్యరాజ్య సమితి పర్యవేక్షణలో ఎన్నికలు జరగాలని సూచించారు. సిరియా బఫర్ జోన్‌తోపాటు పరిసర ప్రాంతాల్లోకి కూడా ఇజ్రాయెల్ దళాలు చొచ్చుకురావడాన్ని వారు ఖండించారు. జనావాసాలపైన కూడా దాడులు చేయడం దారుణమని వ్యాఖ్యానించారు. సిరియా భవిష్యత్తుపై తాము చేసిన అరబ్ లీగ్, తుర్కియేసహా పలు దేశాలు మద్దతు తెలిపాయని, ఐక్యరాజ్య సమితి కూడా సానుకూలత వ్యక్తం చేసిందని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ అన్నారు. సిరియాలో చోటు చేసుకున్న పరిణామాల వల్ల, పొరుగు దేశాలకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉంటుందని అన్నారు. ఉగ్రవాద దాడుల ప్రమాదాలను ఆయన ప్రస్తావించారు. పరిస్థితులు దిగజారక ముందే, తిరుగుబాటుదారులు నిర్దిష్టమైన ప్రణాళికలను సిద్ధం చేసుకుంటారని ఆశిస్తున్నట్టు చెప్పారు.

### దాడులు ఆగలేదు..

సిరియాపై దాడులు తక్షణమే నిలిపివేయాలని, ఆ దేశ భూభాగాల నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని అమెరికా, తుర్కియేసహా పలు దేశాలు చేసిన డిమాండ్‌ను ఇజ్రాయెల్ పట్టించుకోలేదు. సిరియా రాజధాని డమాస్కస్ శివారు ప్రాంతాలపై దాడులను ఉధృతం చేసింది. ఆ ప్రాంతాల్లో క్షిపణి బంగర్లు ఉన్నాయని సిరియా సైనిక వర్గాలు వెల్లడించాయి. పర్వయతాల దిగువన ఉన్న బంకర్లలోని రాకెట్లు, ఆయుధ సామాగ్రి ఇజ్రాయెల్ సైన్యం (ఐడిఎఫ్) దాడుల్లో ధ్వసమైనట్టు బ్రిటన్ కేంద్రంగా పని చేస్తున్న సిరియన్ అబ్జర్వేటర్ ఫర్ హ్యూమన్ రైట్స్ (ఎస్‌ఓహెచ్‌ఆర్) వెల్లడించింది. అక్కడి పర్వత సొరంగాలను, ఆయుధ డిపోలను, బాలిస్టిక్ క్షిపణి లాంచర్లను కూడా దెబ్బతీసినట్టు పేర్కొంది. ఇజ్రాయెల్ దళాలు ఇప్పటికే ఇరు దేశాల మధ్య ఉన్న బఫర్ జోన్‌ను ఆక్రమించడమేగాక, డమాస్కస్‌కు సమీపంలోకి వెళ్లినట్టు సమాచారం.

# హిజాబ్ ధరించలేదని...

## ఇరాన్‌లో యుట్యూబ్ సింగర్ అరెస్టు



**సరీ సిటీ (ఇరాన్):** కేవలం హిజాబ్ ధరించలేదన్న కారణంగా ఒక యుట్యూబ్ సింగర్‌ను ఇరాన్ అధికారులు అరెస్టు చేశారు. యుట్యూబ్‌లో పాడుతూ పలు వీడియోలు చేసిన 27 ఏళ్ల పరాస్తూ అహ్మదీని ఐజందారన్ నార్తన్ ప్రావీన్స్‌లో పోలీసులు అరెస్టు చేశారని ఆమె తరపు లాయర్ మిలాద్ పనాహిపౌర్ పేర్కొన్నార. వీడియోలో ఆమె నల్లని స్లీవ్‌లెస్ డ్రెస్సుతో కనిపించింది. హిజాబ్ ధరించలేదు. నలుగురు పురుష గాయకులతో కలిసి పాడింది. ఈ చర్యలు ఇస్లామిక్ మత విశ్వాసాలకు విరుద్ధమంటూ అధికారులు అమెపై కేసు పెట్టి అరెస్టు చేశారు. అరెస్టుకు ముందు పరాస్తూ తన వీడియో సందేశంలో పాటలు పాడడం తన హక్కుగా పేర్కొంది. 'నన్ను అభిమానించే ప్రజల కోసం నేను పాడతాను. అది నా హక్కు. నా దేశం కోసం నేను గొంతెత్తి పాడతాను' అని వ్యాఖ్యానించింది. కాగా, పరాస్తూ అరెస్టును ధ్రువీకరించిన ఆమె తరపు లాయర్, ఏఏ అభియోగాలు మోపారో తమకు ఇంకా సమాచారం అందలేదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలు అందిన తర్వాత కౌంటర్ దాఖలు చేస్తామని అన్నారు. ఇలావుంటే, ఆమె వీడియోను ఇప్పటికే 1.6 మిలియన్ల మంది వీక్షించారు. ఈ కేసు తర్వాత మరింత మంది వీడియోను చూసే అవకాశం ఉంది.



## వెనక్కి తగ్గిన కేంద్రం (మొదటి పేజీ తరువాయి)

కూడా పొందుపరిచారు. కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ బిల్లు పెడతారని కేంద్రం పేర్కొంది. కానీ.. తాజాగా సవరణ చేసిన లోక్‌సభ బిజినెస్‌లో జమిలి ఎన్నికల బిల్లులు లేవు. ఈ నెల 20తో పార్లమెంటు సమావేశాలు ముగియనున్నాయి. తాజా పరిణామాలు నేపథ్యంలో.. శుక్రవారంతో ముగిసే శీతాకాల సమావేశాల్లో బిల్లులు పెట్టడంపై సందిగ్ధత నెలకొంది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు జమిలి ఎన్నికల అమలు కోసం రాజ్యాంగంలో కొత్తగా ఆర్టికల్ 82ఎ ను చేర్చాల్సి ఉంటుంది. పార్లమెంటు పదవీ కాలంలో మార్పు కోసం..ఆర్టికల్ 83ని, అసెంబ్లీల పదవీ కాలం సవరణకు.. ఆర్టికల్ 172ని, ఎన్నికల నిబంధనల రూపకల్పన కోసం పార్లమెంటుకు అధికారం కల్పించే.. ఆర్టికల్ 327ని సవరించాల్సి ఉంటుంది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పాటే స్థానిక సంస్థల ఎన్నికలనూ నిర్వహించాలని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలోని కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల విషయాన్ని ప్రస్తుతానికి పక్కనబెట్టిన కేంద్ర మంత్రిమండలి.. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల కోసం రూపొందించిన రెండు బిల్లులకు ఈ నెల 12న ఆమోదం తెలిపింది.

## బహిరంగ క్షమాపణ చెప్పిన మోహన్‌బాబు (మొదటి పేజీ తరువాయి)

జర్నలిస్ట్ రంజిత్‌ను ఆదివారం మోహన్ బాబు పరామర్శించారు. ఈ సందర్భంగా రంజిత్తో పాటు ఆయన కుటుంబసభ్యులకు మోహన్ బాబు బహిరంగ క్షమాపణ చెప్పారు. ఇదిలా ఉండగా.. మోహన్ బాబు, మంచు మనోజ్‌కు మధ్య జరిగిన వివాదం ఎంతటి దుమారం రేపిందో అందరికీ తెలిసిందే. మంచు ఫ్యామిలీ గొడవలను కవర్ చేసేందుకు డిసెంబర్ 10న మీడియా ప్రతినిధులు జల్‌పల్లిలోని మోహన్ బాబు నివాసం వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో మీడియా ప్రతినిధులపై మోహన్ బాబు దాడి చేశారు. దీంతో రజింత్ తీవ్రంగా గాయపడ్డాడు. అలాగే పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి మోహన్‌బాబుపై హత్యాయత్నం కేసు నమోదు అయ్యింది. అలాగే మోహన్ బాబు దాడి దృశ్యాలు కూడా సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మరోపక్క మోహన్‌బాబుపై నమోదైన హత్యాయత్నం కేసును పహాడీషరీఫ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రూ.12వేలు (మొదటి పేజీ తరువాయి)

రైతు బీమా ప్రీమియం చెల్లింపుకు రూ.1514 కోట్లు, ఉత్పత్తుల పెరుగుదలకు రూ.40 కోట్లు, విత్తన సరఫరాకు రూ. 36 కోట్లు, వ్యవసాయ పంపుసెట్ల సబ్సిడీకి రూ.11270 కోట్లు మొత్తం రూ.50953 కోట్లు ఖర్చు చేసి రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతను చాటిందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తామని సన్న బియ్యానికి రూ. 500 బోనస్ చెల్లిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రతి ఎకరాకు బోనస్ ద్వారా అదనంగా రూ.10 వేల నుంచి రూ. 15వేల రైతుకు లభిస్తుందన్నారు. కాళేశ్వరంతో సంబంధం లేకుండానే రికార్డు స్థాయి ఉత్పత్తులను చేపట్టామన్నారు. రాష్ట్రప్రభుత్వంపైన, ముఖ్యమంత్రిపైన బిఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం చేస్తుందని పదేళ్ల కాలంలో 711911 కోట్ల రూపాయల అప్పులను చేసిందన్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం వద్ద స్పష్టమైన సమాచారం ఉందని కాని బిఆర్‌ఎస్ ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తుందన్నారు. బిఆర్‌ఎస్ చేసిన అప్పుల్లో ఎక్కువ భాగం వారు తినడానికే చేశారని వారు చేసిన అప్పుకు కాంగ్రెస్ పార్టీ వడ్డీ కడుతుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.54118 కోట్లు అప్పులు చేయగా బిఆర్‌ఎస్ చేసిన అప్పులకు రూ.66782 కోట్లు చెల్లించామని భట్టి విక్రమార్క తెలిపారు. అసెంబ్లీలో దీనిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వం నేరుగా తీసుకున్న అప్పులు 2014లో రూ. 72658 కోట్లు ఉండగా 2024 నాటికి రూ. 389673 కోట్లకు పెరిగిందని ఆయన తెలిపారు. ఇవి కాకుండా ఇరిగేషన్, ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్, ఆసుపత్రులు, ఉద్యోగుల జిపిఎఫ్ తదితర వాటికి రూ.40154 కోట్లు అప్పు చేశారని మొత్తం కలిపితే పెద్ద మొత్తంలో తయారైందని అయినా ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు హరీష్, కేటిఆర్‌లు ప్రయత్నిస్తున్నారని భట్టి ఆరోపించారు. మీడయా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎంఎల్‌సి పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు దొబ్బల సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

## తొలిరోజు గ్రూప్ –2 పరీక్ష ప్రశాంతం (మొదటి పేజీ తరువాయి)





హాజరయ్యారు. ఆదివారం ఉదయం 10 నుంచి 12.30 గంటల వరకు పేపర్ –1 జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్, మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు పేపర్–2 హిస్టరీ, పోలిటి, సోసైటీ సబ్జెక్ట్‌లకు సంబంధించిన పరీక్షలు జరిగాయి. తెలుగు –ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాలతో కూడిన ప్రత్యేక ఓఎంఆర్ షీట్లను అభ్యర్థులకు అందజేశారు. నిమిషం ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి పోలీసులు అనుమతిని నిరాకరించారు. మొత్తం 783 పోస్టులకు భర్తీకి సంబంధించి జరుగుతున్న ఈ పరీక్షలకు దాదాపు 5,51,847 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, టిజిపిఎస్‌సి33 జిల్లాల్లోని 1,368 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసింది. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష కేంద్రాల్లో అన్ని సదుపాయాలను కల్పించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలీసులు అభ్యర్థులను తనిఖీ చేసి లోపలికి పంపించారు. పరీక్షా కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. అలాగే 144 సెక్షన్‌ను అమలు చేశారు. పరోక్షంగా 75 వేల మంది వివిధ స్థాయి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తమ సేవలను అందించారు.

**పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన టిజిపిఎస్‌సి ఛైర్మన్ బుర్రా వెంకటేశం :** రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు గ్రూప్ 2 పరీక్ష కేంద్రాలను ఎక్కడికక్కడ పరిశీలించారు. టిజిపిఎస్‌సి ఛైర్మన్ బుర్రా వెంకటేశం బేగంపేట్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గ్రూప్ 2 పరీక్ష కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పరీక్ష కేంద్రాలతో పాటు ఆక్కడి ఏర్పాట్లను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా బుర్రా వెంకటేశం మాట్లాడుతూ అభ్యర్థులు ఏలాంటి ఆందోళనలకు గురి కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ఫలితాలు త్వరలోనే ప్రకటిస్తామని వెల్లడించారు. గ్రూప్ 3 కంటే ఎక్కువ మంది అభ్యర్థులు గ్రూప్ 2కు హాజరయ్యారని వివరించారు.

**హైదరాబాద్‌లో మొదటి పేపర్‌కు 40.21 శాతం, రెండవ పేపర్‌కు 39.32 శాతం హాజరు :** హైదరాబాద్‌లో జిల్లా కల్టెకర్ అనుదీప్ దురిశెట్టి గ్రూప్ 2 పరీక్ష కేంద్రాలను ఆదివారం అకస్మికంగా సందర్శించారు. మెహదీపట్నం, సంతోష్ నగర్ సెయింట్ ఆన్స్ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్ 2 పరీక్షకేంద్రాలను అకస్మికంగా సందర్శించిన జిల్లా కలెక్టర్ పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు.హైదరాబాద్ జిల్లాకు సంబంధించి 48,012 మంది అభ్యర్థులకు గాను 101 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు. జిల్లాలో మొదటి రోజు పేపర్ –1 పరీక్షకు సంబంధించి 48,012 అభ్యర్థులకు గాను 19208 మంది (40.21శాతం), రెండవ పరీక్షకు గాను 18,879(39.32 శాతం) మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్లు కలెక్టర్ అనుదీప్ వివరించారు.

## దమనకాండను సహించబోం

(మొదటి పేజీ తరువాయి)

డిమాండ్లను పరిష్కరించాలని పంజాబ్, హర్యానాకు చెందిన రైతులు చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా పాదయాత్రగా హర్యానాలోని శంభు నుంచి బయలుదేరిన 101 మందితో కూడిన రైతుల జాతను ఢిల్లీకి వెళ్లకుండా భద్రతా సిబ్బంది అడ్డుకోవడమేమిటాంటూ సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ కన్వీనర్లు పశ్యపద్మ, టిసాగర్, ప్రభాకర్, విస్సా కిరణ్, వెంకన్నలు అగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వంగతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ రైతులు చేపటిన నిరసన కార్యక్రమం అడ్డుకోవడమే కాకుండా వారిపై భాష్పవాయు గోళాలన్ని ప్రయోగించడం ఏమిటి అన్ని ప్రశ్నించారు. రైతులపై కేంద్ర ప్రభుత్వం ధమన కాండ కొనసాగించడం పరిపాటిగా మారిందని, ఇదే విధంగా వ్యవహరిస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మరోసారి భంగపాటు తప్పదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం రైతుకుల గతంలో ఇచ్చిన హామిలను తక్షణమే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## భూసేకరణ షురూ (మొదటి పేజీ తరువాయి)



అతి త్వరలో అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. పాతబస్తీ మెట్రో రైల్ మార్గానికి సిఎం అత్యంత ప్రాధాన్యత ఇస్తుండటంతో హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్(హెచ్‌ఏఎంఎల్) ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి పనులు వేగవంతం చేశారు. అందులో భాగంగా భూసేకరణ ప్రక్రిను ముమ్మరం చేశారు. హెచ్‌ఏఎంఎల్ ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలక్టర్ అనుదీప్ దురిశెట్టి సంయుక్తంగా భూసేకరణ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రికి వివరిస్తున్నారు. ఎంజిబిఎస్ చంద్రాయాణ గుట్ట మార్గంలో దాదాపు ఏడున్నర కిలోమీటర్ల పరిధిలో 1100 ప్రభావిత ఆస్తులను గుర్తించారు. భూసేకరణ చట్టానికిలోబడి ఈ ప్రభావిత 1100 ఆస్తులకుగాను ఇప్పటికే 900 ఆస్తులకు సంబంధించిన రిక్విజిషన్‌ని జిల్లా కలెక్టర్‌కి సమర్పించారు. వాటిలో 800 ఆస్తులకు సంబంధించిన ప్రిలిమినరీ నోటిఫికేషన్‌ను దఫదఫాలుగా కలెక్టర్ జారీ చేశారని ఎన్‌విఎస్ రెడ్డి వెల్లడించారు. నోటిఫై చేసిన ఆస్తులలో 400 ఆస్తులకు ప్రిలిమినరీ డిక్లరేషన్‌ను కలెక్టర్ జారీ చేయడం పూర్తయిందని ఆయన చెప్పారు. 200 ప్రభావిత ఆస్తుల పరిహారానికి సంబంధించిన అవార్డులను ఈ నెలాఖరులోగా ప్రకటించడం పూర్తవుతుందన్నారు. తదనంతరం వెంటనే వాటికి పరిహారం చెల్లించి, వాటిని కూల్చివేత పనులు ప్రారంభిస్తామన్నారు. తద్వారా మెట్రో రైల్ మార్గ నిర్మాణాన్ని సుగమవుతోందన్నారు. ఈ మార్గంలో ఉన్న వివిధ నిర్మాణాలు, ప్రభావిత ఆస్తుల యాజమానులతో చర్చించి, వాటిని భూసేకరణ చట్టం ప్రకారం సేకరించి, రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నామని ఎన్‌విఎస్ రెడ్డి చెప్పారు. రోడ్డు విస్తరణలోనూ, మెట్రో నిర్మాణంలోనూ మతపరమైన, చారిత్రాత్మక కట్టడాలన్నిటిని తప్పించి, వాటిని ఇంజనీరింగ్ పరిష్కారంతో పరిరక్షిస్తున్నామని ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు.

## గత పదేళ్లలో వెనుకబడిన రాష్ట్రం (మొదటి పేజీ తరువాయి)

సాగితే ప్రజలు మరోసారి తగిన సమయంలో తగిన బుద్ధి చెప్పడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పదవ తరగతి మొదలు గ్రూప్ 1 పరీక్షల వరకు అన్నింటా అవకతవకలు, గందరగోళమే నెలకొన్నదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన ఒక్క ఏడాదిలోనే రాష్ట్రంలో దాదాపు 54 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసి, దేశంలోనే రికార్డును నెలకొల్పామని తెలిపారు. ఉద్యోగాలను భర్తీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే, బిఆర్‌ఎస్ వాటిని అడ్డుకునేందుకు కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. పోటీ పరీక్షలను వాయిదా వేయడానికి కెసిఆర్,ఆయన కుటుంబ' సభ్యులు, బిఆర్‌ఎస్ నాయకులు శతవిధాలా ప్రయత్నించారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ప్రతిపక్షాల కుట్రలను ఛేదించి, పరీక్షలను విజయవంతంగా నిర్వహించిందని ఆ లేఖలో మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. అవినీతే లక్ష్యంగా కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారని, తానే కాళేశ్వరం డిజైన్ రూపకర్తను అని కెసిఆర్ గర్వంగా చెప్పుకున్నారని, ఆ ప్రాజెక్టు నాణ్యతా లోపంలో కూడా కెసిఆర్ బాధ్యతవహించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కెసిఆర్, ఆయన కుటంబ సభ్యులకు ,అనుచరులకు ఒక ఎటిఎంలాగా మారిందని ఆరోపించారు. కాళేశ్వరం కింద మూడు బ్యారేజీలు పనిచేయకపోయినా తెలంగాణ రైతులు ఈ ఖరీఫ్ సీజన్‌లో 66.76 లక్షల ఎకరాల్లో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేసేలా సాగునీరు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా కెసిఆర్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని, ప్రాజెక్టులు, ఫ్లైఓవర్లు ఇలా అన్ని రంగాల్లో అవినీతిలో కెసిఆర్ కుటుంబ సభ్యులకు, ఆయన అనుచరుల హస్తం ఉందని ఆరోపించారు. 2014 జూన్ 2న రాష్ట్రం ఏర్పడే నాటికి రూ.16 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉంటే, పదేళ్ల బిఆర్‌ఎస్ పాలన తర్వాత కాంగ్రెస్ అధికారం చేపట్టే నాటికి రాష్ట్రం రూ.7 లక్షల కోట్ల అప్పుతో ఉందనేది వాస్తవం కాదా..?, బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులతో ప్రస్తుతం ప్రతి నెల రూ.6500 కోట్ల అసలు, మిత్తీ చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడిందని మహేష్ కుమార్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం 42 లక్షలకు పైగా రైతులకు బీమా కవరేజీ నిమిత్తం రూ.1,433.33 కోట్ల ప్రీమియం చెల్లించిందని, అకాల వర్షాలతో నష్టపోయిన 94 వేల మందికి పైగా రైతులకు రూ.95.38 కోట్ల పంట నష్టాన్ని చెల్లించిందని,సన్నాలు పండించిన వారికి ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లించిందని వివరించారు. అధికారంలో ఉన్న పదేళ్లు అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని, ప్రస్తుతం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్‌ను విమర్శించడం ఎంత వరకు సమంజసమని నిలదీశారు. హుస్సేన్ సాగర్‌లో నీటిని కొబ్బరినీళ్లుగా మారుస్తామని కెసిఆర్ స్వయంగా చెప్పిన విషయాన్ని మహేష్‌కుమార్ గౌడ్ గుర్తు చేశారు. ఇప్పుడు హుస్సేన్ సాగర్‌లో కొబ్బరి నీళ్లు తాగడానికి వస్తారా అని కెసిఆర్‌ను మహేష్‌గౌడ్ ప్రశ్నించారు.

## హింసను వీడండి (మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి, హోం మంత్రి ప్రతిజ్ఞ చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా ప్రతిజ్ఞకు కట్టుబడి ఉంది. కలిసికట్టుగా 2026 మార్చి 31లోపు చత్తీస్‌గఢ్‌లో నక్సలిజాన్ని నిర్మూలిస్తాం. నక్సలిజం చెరనుంచి చత్తీస్‌గఢ్‌కు విముక్తి కల్పించేందుకు మేం అందరం కట్టుబడి ఉన్నాం' అని అమిత్‌షా తెలిపారు.చత్తీస్‌గఢ్ నక్సల్స్ నుంచి విముక్తిచెందినప్పుడు దేశం మొత్తం నక్సలిజం ముప్పునుంచి విముక్తి పొందుతుందని, నక్సలిజాన్ని అంతమొందించాలనేది రాష్ట్ర పోలీసుల సంకల్పమని తెలియజేశారు. ప్రెసిడెంట్ కలర్ అనేది కేవలం రంగు మాత్రమే కాదని, ఇది సేవ, అంకితభావం, త్యాగానికి ప్రతీక అన్నారు. ఇది పోలీసులు ఎదుర్కోవాల్సిన లెక్కలేనన్ని సవాళ్లను గుర్తు చేస్తుందని అమిత్‌షా తెలిపారు. చత్తీస్‌గఢ్ పోలీసులు తమ బాధ్యతలను నిర్వర్తిస్తారని, తమ బాధ్యతల నుంచి వారు ఎన్నటికీ తగ్గబోరని అమిత్‌షా విశ్వాసం వ్యక్తం చేశారు.రేపటినుండి చత్తీస్‌గఢ్ పోలీసులు తమ యూనిఫారమ్‌లపై రాష్ట్రపతి చిహ్నాలతో బయటకు వస్తారని, వారి నైతికత అనేక రెట్లు పెరిగిపోతుందని తాను విశ్వసిస్తున్నానని అమిత్‌షా ఆకాంక్షించారు.'గత ఏడాదికాలంలో నక్సలిజంపై జరిగిన పోరాటంలో చత్తీస్‌గఢ్ పోలీసులు గణనీయమైన విజయం సాధించారు. రాష్ట్రంలో గత ఏడాది 287మంది నక్సలైట్లు తటస్థీకరించబడ్డారు. దాదాపు 1000మంది నక్సలైట్లు అరెస్ట్ అయ్యారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో గత ఏడాది కాలంలో 837మంది లొంగిపోయారు. ఈ పరిస్థితి నక్సలైట్లపై ఎంతగట్టి పోరాటం జరిగిందనేది ప్రతిబింబించబడుతున్నది. నక్సలిజానికి వ్యతిరేకంగా గత ఏడాదికాలంగా రాష్ట్రంలో 14మంది అగ్రశ్రేణి కేడర్ (నక్సలైట్లు)తటస్థీకరించబడ్డారు' అని ఆయన వెల్లడించారు. నాలుగు దశాబ్దాలలో మొదటిసారిగా నక్సల్స్ హింసలో పౌరులు, భద్రతాదళాల మరణాల సంఖ్య 100 లోపునకు తగ్గించబడిందని అమిత్‌షా వివరించారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 10సంవత్సరాలలో దేశ వ్యాప్తంగా నక్సల్ హింసకు అడ్డుకట్టవేయడం జరిగిందని చెప్పారు.గత పదేళ్ల కాలాన్ని తులనాత్మక విశ్లేషణ (గత దశాబ్దంతో పోలిస్తే) భద్రతా సిబ్బంది మరణాలు 73శాతం క్షీణించాయని , మావోయిస్టుల హింసలో పౌరుల మరణాలు 70శాతం తగ్గాయని అమిత్ షా చెప్పారు. నక్సలైట్లు హింసను విడనాడి ప్రధాన స్రవంతిలోకి రావాలని కేంద్ర హోం మంత్రి విజ్ఞప్తి చేశారు. చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణ దేవ్ సాయి, ఉప ముఖ్యమంత్రులు అరుణ్‌సావో, విజయ్ శర్మ, రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ రమణ్ సింగ్, డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అశోక్ జునేజా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజానికి ఆదరణ

26న సిపిఐ శత జయంతి ఉత్సవాలు

రామగుండం మున్సిపల్ ఎన్నికల్లో సిపిఐ పోటీ

సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ప్రపంచవ్యాప్తంగా ప్రజలు కమ్యునిజాన్ని ఆదరిస్తున్నారని, అనేక దేశాల్లో కమ్యునిస్టు పార్టీలు అధికారంలోకి రావడమే తార్కాణమని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి అన్నారు. భారత కమ్యునిస్టు పార్టీ రామగుండం నగర సమితి జనరల్ బాడీ సమావేశం ఆదివారం స్థానిక భాస్కర రావు భవన్‌లో సిపిఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా చాడా వెంకటరెడ్డి హాజరై మాట్లాడుతూ ఈనెల 26న సిపిఐ 100 సంవత్సరాల్లోకి అడుగు పెడుతున్న సందర్భంగా వాడవాడలా, గ్రామ గ్రామాన వంద వసంతాల ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. 100 సంవత్సరాల చరిత్రలో కమ్యునిస్టు పార్టీ అనేక పోరాటాలు చేసిందని రైతులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, యువకులు, మహిళలకు సంబంధించిన అనేక హక్కులు సాధించడంలో కమ్యునిస్టు పార్టీ పోరాటం ఎనలేనిదని కొనియాడారు. యుపిఎ వన్ ప్రభుత్వంలో చేరడం ద్వారా ఉపాధి హామీ పథకంతో పాటు అనేక ప్రగతిశీల పథకాలకు శ్రీకారం చుట్టామని వివరించారు. నేడు కేంద్రంలో నరేంద్ర మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన అనంతరం ఒకే దేశం ఒకే ఎన్నిక అంటూ జమిలి ఎన్నికలకు తహతహలాడుతున్నారని, భారత దేశంలో ప్రజలకు పన్నుల భారాన్ని మోపుతూ నిత్యావసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నా, పెట్రోల్, గ్యాస్ లాంటి వాటిని జిఎస్టీ పరిధిలోకి తీసుకురాకుండా ఒక్కో వస్తువుకు ఒకోరకమైన పన్నులు విధిస్తూ ఒకే దేశం, ఒకే ఎన్నిక దేనికోసం అని ప్రశ్నించారు. రాబోయే కాలం అంతా ఎన్నికల కాలమని, స్థానిక సంస్థలతో పాటు పంచాయతీ మండల ఎన్నికలు జరుగుతాయి గనుక భారత కమ్యునిస్టు పార్టీ కార్యకర్తలు, నాయకులు స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, ఎప్పటికప్పుడు ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ రేపు రాబోయే రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలిచి కౌన్సిల్లో అడుగుపెట్టాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ జనరల్‌బాడీ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సహాయ కార్యదర్శి గోశిక మోహన్, మాజీ జిల్లా కార్యదర్శి గౌతమ్, గోవర్ధన్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కె.స్వామి, ఆర్.జి.1 కార్యదర్శి ఆరెల్లి పోషం, నగర సహాయ కార్యదర్శి తాళ్లపల్లి మల్లయ్య, మడికొండ ఒదెమ్మ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు కన్నం లక్ష్మీనారాయణ, సిపిఐ నగర కార్యవర్గ సభ్యులతో పాటు 200 మంది పార్టీ కార్యకర్తలు పాల్గొనడం జరిగింది. ప్రజానాట్య మండలి కళాకారులు ఎజ్జ రాజయ్య, వై.లెనిన్, మొండి, దప్పు రాజు, ఆసాల రమ విప్లవ గేయాలు ఆలపించారు.



## దేవాదాయ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం / మక్తల్ రూరల్ :** రాష్ట్రంలోని దేవాదాయ భూముల పరిరక్షణకు సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను, రూపొందించినట్లు రాష్ట్ర అటవీ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి, దేవుడి మాన్యాలపై ఎలాంటి శ్రద్ధ చూపలేదని, కాని తమ ప్రభుత్వం ఆలయాలతో పాటు వాటికి భూములను కాపాడుకునేందుకు అన్నిరకాల చర్యలు చేపడుతోందని ఆమె స్పష్టం చేశారు. ఆదివారం నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలోని శ్రీ పడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరై, స్థానిక ఎమ్మెల్యే వాటికి శ్రీహరితో కలిసి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత పాలకులు యాదాద్రి పేరిట యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయ అభివృద్ధిని అసంపూర్తిగా వదిలేశారని ఎద్దేవా చేశారు. భక్తులకు సరియైన సౌకర్యాలు కల్పించలేదన్నారు. కానీ తమ ప్రభుత్వం యాదగిరి లక్ష్మీనర్సింహస్వామి, ఆలయ అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టిందని, ఆలయంలో వృద్ధులు, పిల్లలు, వికలాంగులకు ప్రత్యేక దర్శనానికి అవకాశం కల్పిస్తోందన్నారు. క్యూలైన్లలో భక్తులు ఎండకు ఇబ్బంది పడకుండా నీడను కల్పించామన్నారు.

## మహేష్ కుమార్ గౌడ్ చెప్పిన 'ఉద్యోగ' లెక్కలు తప్పు

బిఆర్ఎస్ ఎంఎల్ఎ వివేకానంద



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉద్యోగాల హామీల అమలు విషయంలో టిపిసిసి అధ్యక్షుడు తప్పుడు లెక్కలు చెబుతున్నారని బిఆర్ఎస్ ఎంఎల్ఎ వివేకానంద అన్నారు. ఆరు గ్యారంటీల అమలు ఏమైందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఎ బాల్క సుమన్‌తో కలిసి వివేకానంద మాట్లాడుతూ పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు సిఎం రేవంత్ రెడ్డి అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదన్నారు. ఘట్‌కేసర్‌లో ప్రాథమిక సహకార సొసైటీలో ఒక్క రైతుకు కూడా రుణ మాఫీ కాలేదని, వీరికి మహేష్‌కుమార్‌గౌడ్ సిఎంతో మాట్లాడి రుణమాఫీ చేయించాలని సూచించారు. తెలంగాణ ఉద్యమం నుంచి పుట్టిన తల్లే తెలంగాణకు నిజమైన తల్లి అని, గెజిట్ ద్వారా వచ్చిన తల్లి నిజమైన తల్లి కాదని చెప్పారు. పేర్లు మార్చడం తప్ప రేవంత్ రెడ్డి తన ఏడాది పాలనలో చేసింది ఏమిటని ప్రశ్నించారు. మూసీ,హైడ్రా, కాళేశ్వరం, అదానీ ఇలా అన్నింటిలో సిఎం రేవంత్‌వి ద్వంద్వ ప్రమాణాలేనని ఆరోపించారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి అన్ని ప్రశ్నలపైనా బిఆర్ఎస్ సమాధానమిస్తుందన్నారు. బాల్క సుమన్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి మెప్పుకోసమే కెసిఆర్‌కు పిసిసి అధ్యక్షుడు లేఖ రాశారన్నారు. మహేష్‌గౌడ్ రాసిన లేఖ చిత్తు కాగితంతో సమానమన్నారు.



## రాజ్యాంగాన్ని కాపాడుకోవడం భారతీయుల తక్షణ కర్తవ్యం

బి.వి.రాఘవులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతీయులు విశ్వమానవులని, వారిని ఐక్యంగా ఉంచగలిగింది రాజ్యాంగం మాత్రమేనని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి రాఘవులు అన్నారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం భారతీయుల తక్షణ కర్తవ్యమన్నారు. 'తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యుటిఎఫ్) సీనియర్ నాయకుడు అక్షయకుమార్ దత్ ప్రథమ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి టిఎస్ యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి అధ్యక్షతన వహించగా, రాఘవులు స్మారకోపన్యాసం చేశారు. మన అస్థిత్వం భారతీయత, భారతీయులందరికీ సమానమైన హక్కులు ఉండాలన్నారు. అమెరికా లాంటి పెట్టుబడిదారీ దేశాల్లో అమలవుతున్న పౌరసత్వప్రాతిపదిక జాతీయవాదం (సిటిజన్ బేస్డ్ నేషనలిజమ్) మన దేశంలో అమలు కాకుండా అడ్డుకునేందుకు, ముస్లింలను మినహాయించి పౌరసత్వ సవరణ చట్టం చేయబూనుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడితే, బిజెపి రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తున్నదని అన్నారు. ప్రపంచంలో ఎలక్టోరల్ డిక్టేటర్ షిప్ అనే కొత్త సంస్కృతి తెరపైకి వచ్చిందని, ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకే దేశం ఒకే ఎన్నిక కూడా నియంతృత్వానికి దారితీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సిఐటియు ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య, టిఎస్‌యుటిఎఫ్ సీనియర్ నాయకులు పి.మాణిక్ రెడ్డి, ఎం.నరహరి, సి.కమల కుమారి, రాష్ట్ర నాయకులు సింహాచలం, కొండలరావు, పౌర స్పందన వేదిక కార్యదర్శి రాథేశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



భారత తొలి ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సిఎం సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు నివాళి అర్పించారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

## శ్రీతేజ్‌ను పరామర్శించిన మందకృష్ణ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పుష్ప2 ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో బాలుడిని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పరామర్శించారు. ఆదివారం ఆసుపత్రికి వెళ్లి బాలుడు శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. బాలుడికి అందిస్తున్న వైద్యంపై ఆరా తీశారు. అనంతరం మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద ఆసుపత్రికి వచ్చారు. బాలుడిని పరామర్శించి వైద్యులతో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. పుష్ప2 బెనిఫిట్ షో సందర్భంగా డిసెంబర్ 4న హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్ రోడ్డులోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట చోటు చేసుకున్న విషయం తెలిసిందే. సినిమా చూసేందుకు అల్లు అర్జున్ థియేటర్‌కు రాగా.. అక్కడ తొక్కిసలాట చోటుచేసుకుంది. ఇదే థియేటర్‌కు సినిమా చూసేందుకు దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన భాస్కర్, అతడి భార్య రేవతి, కుమారుడు శ్రీతేజ్, కూతురు వెళ్లారు. అయితే అక్కడ జరిగిన తొక్కిసలాటలో రేవతి మృతి చెందగా.. కుమారుడు శ్రీతేజ్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ప్రస్తుతం శ్రీతేజ్ కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

# కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



**ప్రజాపక్షం/పరిగి/పరిగి రురల్/కుల్కచర్ల :** వికారాబాద్ జిల్లా పరిధిలోని పరిగిమండలం, కుల్కచర్ల మండల మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనుసూయ అక్క, మండల చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్‌గాపరుశురాంరెడ్డి, వైస్ చైర్మన్‌గా సయ్యద్ హుషన్, కుల్కచర్ల మార్కెట్ కమిటి చైర్మన్ అంజనేయులు ముదిరాజు, వైస్ చైర్మన్‌గా రాంమోహన్‌శర్మ, డైరెక్టర్లు ప్రమాణ స్వీకరం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి దేశంలోనే ఇప్పటివరకు రైతులకు ఏ ప్రభుత్వం చేయనంత రుణమాఫీ 2లక్షల రూపాయల వరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యయంలో రాష్ట్రంలో సుమారు 21 కోట్ల రూపాయల రుణమాఫీ చేశామని తెలిపారు. సన్న వడ్లకు బోనస్‌లో భాగంగా 500రూపాయలు చెల్లిస్తున్నామని, మన పొలాల్లో పండించిన వరి మన గరుకుల హాస్టల్లో , రేషన్ షాపుల్లో ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. పామాయిల్ సాగు చేయాలని రైతు లాభం పొందే పంటలు పండించాలని తెలిపారు. పరిగి నియోజకవర్గం అభివృద్ధి చేయాలని, నాయకుడు రామ్మోహన్ రెడ్డి అన్నారు.

ఎమ్మెల్యేగా గెలిచారని అది ప్రాంత అదృష్టం అని వారు రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్నారని ముఖ్యమంత్రి దగ్గర మంత్రుల దగ్గర అభివృద్ధి నిధులు తెచ్చి సత్తా ఉన్న నాయకుడు అని తెలిపారు. వికారాబాద్ ,రంగారెడ్డి జిల్లా మంచి సారవంతమైన భూములు ఉన్నా ప్రాంతమని ఈ ప్రాంతానికి సాగునీరు తేవడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తపించే నాయకడు అని అన్నారు. 2018 ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ పరిగి నియోజకవర్గం సమస్యల గురించి అసెంబ్లీలో మాట్లాడాటానికి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఎన్నోసార్లు నాతో చెప్పారని, ఎన్నో విషయాలను నేను సభ దృష్టికి తీసుకువెళ్లాలని తెలిపారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన చైర్మన్ పాలకవర్గం ఈ ప్రాంత రైతుల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల పాలనలో ఈ ప్రాంతం పూర్తిగా అభివృద్ధికి దూరమైంయింది అని ప్రధాన రహదరి రోడ్లకు కూడా పూర్తిచేయాలని అసమర్ధనాయకులు గతంలో ఉన్నారని అన్నారు. పరిగి నియోజకవర్గంకు 295కోట్ల రూపాయల రుణమాఫీ చేసింది అన్నారు. పరిగి నియోజకవర్గం అభివృకి కృషి చేస్తానన్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో తన వంతు సహకారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల హృదయాల్లో సజీవంగా గద్దర్ పాటలు

* సిద్ధిపేటలో గద్దర్ విగ్రహం ఏర్పాటుకు కృషిచేస్తా
* గద్దర్ డాక్యుమెంటరీ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తా
* మాజీ మంత్రి హరీష్‌రావు




**ప్రజాపక్షం/ సిద్ధిపేట ప్రతినిధి :** గద్దర్ అర్థదశాబ్దాపు పోరాటం పదవుల కోసం ఆశపడకుండ.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతంగా పోరాటం చేశారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. విప్లవ ఉద్యమం, తెలంగాణ ఉద్యమం, దళిత ఉద్యమంలో క్రీయాశీలక పాత్ర నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఉద్యమంలో న్యాయం వైపు నిలిచి అన్యాయాన్ని ప్రశ్నించారన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రం విపంచి కళానిలయంలో గద్దర్ ఫౌండేషన్‌లో ప్రజాయుద్ధ నౌక గద్దరన్న సాహిత్య కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తనకు గద్దరన్నను కలిసే అవకాశం దక్కిందన్నారు. వంద ఉపన్యాసాల సారం గద్దరన్న ఒక్క పాట అని కొనియాడారు. సామాన్య పదాలతో ప్రజల హృదయాల్లో చేరే విధంగా గద్దరన్న పాటలుంటాయన్నారు. ప్రజల జీవన సంస్కృతికి దగ్గరగా గద్దరన్న పాటలుంటాయని,. ప్రజల్లోకి త్వరగా చొచ్చుకపోతాయన్నారు. గద్దరన్న భౌతికంగా మన మధ్య లేకపోయినా పాట ఉన్నన్ని రోజులు గద్దరన్న ప్రజల హృదయాల్లో సజీవంగా ఉంటారన్నారు. పొడుస్తున్న పొద్దు మీద పాట తెలంగాణ ఉద్యమాన్ని సమాజాన్ని ఉగ్రూతలూగించి ప్రజల్లో చైతన్యాన్ని నింపిందన్నారు. సిద్దిపేటలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేసుకోవటం తమకు గర్వకారణమని, విగ్రహం పెట్టించే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. గద్దరన్న జీవిత చరిత్రపై డాక్యుమెంటరీ చేయండి.. గద్దర్ పోరాటాన్ని చరిత్రను రేపటి భావితరానికి అందించేందుకు ఆయన కుమారుడు సూర్యం తీసుకోవటం మంచి ప్రయత్నమని, పూర్తి స్థాయిలో సఫలం కావాలని ఆకాంక్షించారు.

*** గద్దర్ వ్యక్తి కాదు...మహాశక్తి**

**ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

దళితుల్లో ప్రపంచ మేధావి బిఆర్ అంబేద్కర్ తర్వాత స్థానం గద్దర్‌దే అని ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. గద్దర్ తెలంగాణ గడ్డమీద జన్మించటం మనందరికి గర్వకారణమన్నారు. ఆయన వ్యక్తి కాదు..శక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ రాష్ట్ర నాయకులు తిరుపతిరెడ్డి, కవి సిద్ధంకి యాదగిరి, టియుడబ్లుజే జిల్లా అధ్యక్షుడు రంగాచారి, గద్దర్ ఫౌండేషన్ ప్రతినిధులు సూర్యం, శ్రీహరి యాదవ్, పాపయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గద్దర్ రచించిన పుస్తకాలను మాజీ మంత్రి హరీష్‌రావు ఆవిష్కరించారు.

## టి- సాట్‌లో వ్యవసాయ కార్యక్రమాల ప్రత్యేక్ష ప్రసారాలు

సిఇఒ వేణుగోపాల్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్య, ఉపాధి అంశాలతో పాటు పోటీ పరీక్షల కంటెంట్ అందిస్తోన్న టిసాట్ నెట్‌వర్క్ వ్యవసాయ ప్రసారాలు సైతం అందించనుందని సిఇఒ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ప్రతివారం నిపుణ ఛానల్ లో సోమ, శనివారాల్లో సాయంత్రం 4 నుంచి నుండి ఐదు గంటల వరకు వ్యవసాయ కార్యక్రమాలు ప్రత్యక్ష ప్రసారాలుంటాయని ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరుసటి రోజు ఉదయం 7 నుంచి నుండి 8 గంటల వరకు గంట పాటు విద్య ఛానల్‌లో ప్రసారామౌతాయని ఆయన వివరించారు. మంగళవారం రోజు నిపుణ ఛానల్‌లో ప్రసారమయ్యే హార్టికల్చర్ కార్యక్రమాలు సైతం మరుసటి రోజు ఉదయం 7 నుంచి నుండి 8గంటల వరకు విద్యలో ప్రసారం కానున్నాయని, రైతుల తమ తమ సందేహాలకు టిసాట్ వేదికకు హాజరయ్యే వ్యవసాయ నిపుణుల సూచనల ద్వారా సమాధానాలు పొందాలని సూచించారు. ఇందుకు సంబంధించి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయం, తెలంగాణ వ్యవసాయ, ఉద్యానవన శాఖల శాస్త్రవేత్తలు, అధికారులు, అనుభవం కలిగిన రైతులు టిసాట్ నెట్ వర్క్ ద్వారా వారి సూచనలుసలహాలు అందిస్తారని వెల్లడించారు. వాటిని అనుసరించి రైతులు పంటల్లో అధిక దిగుబడి పొందే విధంగా సిద్ధమౌవ్వాలని సిఇఒ వేణుగోపాల్ రెడ్డి కోరారు. సాయంకాలం నాలుగు నుండి ఐదు గంటల సమయంలో గంట పాటు వ్యవసాయ కార్యక్రమాలపై జరిగే ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో వ్యవసాయ నిపుణుల సలహాలు పొందేందుకు 04023540326/726 టోల్ ఫ్రీ నెం.1800 425 4039 నెంబర్లకు కాల్ చేయాలని సూచించారు.



## సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

రాష్ట్ర ప్రభుత్వానికి రాచాల విజ్ఞప్తి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ (హైదరాబాద్) :** సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షా అభియాన్‌లోని అన్ని విభాగాలలో దాదాపు 19,600 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని, 20 ఏండ్లుగా వారు చాలీచాలని వేతనంతో జీవితాలు నెట్టుకొస్తున్నారని అవేదన వ్యక్తం చేశారు. గత పదేండ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడూ వీరి సమస్యలు పట్టించుకొన్న పాపాన పోలేదన్నారు. ఎపి తరహాలో తెలంగాణలో కూడా సమగ్ర శిక్షా ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయాలని సిఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ప్రతి ఉద్యోగికి రూ.10 లక్షల జీవిత బీమా, రూ.10 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ, విద్యాశాఖ నియామకాల్లో వీరికి వెయిటేజ్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిసి పొలిటికల్ జెఎసి సలహాదారులు పి.బడేసాబ్, గాలిగల్ల సాయిబాబా, సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సంఘం హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సరిత గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నవనీత గౌడ్, కోశాధికారి శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

# భక్తజన సంద్రం... యాదగిరిగుట్ట

స్వామివారి దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు

స్వామివారి నిత్యరాబడి రూ.57.65 లక్షలు



**యాదగిరిగుట్ట :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి దర్శనానికి భక్తులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆదివారం యాదగిరికొండ నిండిపోయింది. యాదగిరి కొండపైన, కొండ కింద పరిసర ప్రాంతాల్లో ఎక్కడ చూసినా భక్తుల సందడి కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రీసత్యనారాయణస్వామి వారి వ్రత పూజలలో భక్తులు పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం తెల్లవారు జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. అనంతరం ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం, నిత్యబ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ, స్వర్ణపుష్పార్చన పూజలలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి, అమ్మవార్ల శీఘ్రదర్శనం 5 గంటలు, అతిశీఘ్రదర్శనం 4 గంటల సమయం పట్టినట్లు ఆలయ అధికారులు తెలిపారు. యాదాద్రి కొండపైన దర్శన క్యూలైన్లతో పాటు ప్రసాద విక్రయ కేంద్రం, శివాలయం, పలు కూడళ్లలో భక్తుల సందడి నెలకొంది. కార్తీకమాసం సందర్భంగా యాదగిరిగుట్ట కొండపైన కొలువైన శ్రీపర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం యాదగిరిగుట్ట అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని భక్తులు దర్శించుకొని తరించారు.

**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి నిత్యరాబడిలో భాగంగా ఆదివారం రూ.57,65,859 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.7,24,300, బ్రేక్ దర్శనం ద్వారా రూ.3,62,100, విఐపి దర్శనం ద్వారా రూ.5,20,350, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.7,00,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.97,000, ప్రసాద విక్రయం ద్వారా రూ.21,79,740, కల్యాణకట్ట ద్వారా రూ.1,10,000తో పాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**యాదగిరీశుడి సేవలో హైకోర్టు జడ్జి శ్రవణ్‌కుమార్**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ ఎస్‌వి.శ్రవణ్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానికి వచ్చిన ఆయన ముందుగా శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ శ్రవణ్‌కుమార్‌కు ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేయగా, ఈవో భాస్కర్‌రావు స్వామి వారి ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు.

## ఈ ఏడు 17,210 మంది సైబర్ బాధితులకు రూ.155కోట్లు అప్పగింత

సైబర్ క్రైమ్ కేసులు ఛేదించడంలో అగ్రగామిగా నిలిచిన తెలంగాణ

టిజిసిఎస్‌బి డైరెక్టర్ శికాగోయల్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబర్ క్రైమ్ బాధితులకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) ఈ ఏడు (2024) కొండత అండగా నిలిచింది. తెలిసోతెలియకో రూ.కోట్లలో డబ్బును పోగొట్టుకున్న బాధితులకు ఊరట కలిగించింది. సైబర్ క్రైమ్ కేసులు ఛేదించడంతో పాటు సైబర్ క్రైమ్ నిందితుల నుంచి డబ్బును రికవరీ చేయడంలో దేశంలోనే టిజిసిఎస్‌బి అగ్రభాగాన నిలిచింది. ఈ ఏడు సొమ్మును పోగొట్టుకున్న 17,210 బాధితులకు నిందితుల అకౌంట్లలో నుంచి రూ.155.22 కోట్లు రికవరీ చేసి అప్పగించి టిజిసిఎస్‌బి రికార్డు సృష్టించింది. ఇదిలావుండగా శనివారం జరిగిన మెగా నేషనల్ లోక్ అదాలత్‌లో 4,893 సైబర్ మోసాల బాధితులకు రూ.33.27 కోట్లు రిఫండ్ చేసి మరో రికార్డును టిజిసిఎస్‌బి తన సొంతం చేసుకుంది. గతంలో జరిగిన లోక్‌అదాలత్‌లో రూ.27.2కోట్లు బాధితులకు చెల్లించగా ఈసారి అది రెట్టింపు అయ్యింది. తెలంగాణలోని అన్ని జిల్లాలలో సైబర్ మోసం బాధితులకు న్యాయం, ఆర్థిక పునరుద్ధరణకు టిజిసిఎస్‌బి తిరుగులేని నిబద్ధతతో వ్యవహరిస్తుంది.



**సైబరాబాద్ టాప్ : శిఖాగోయల్**

ఇటీవలి లోక్ అదాలత్‌లో అత్యుత్తమ పనితీరు కనబరిచిన యూనిట్లలో సైబరాబాద్ మొదటి స్థానంలో నిలిచిందని టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖాగోయల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2,136 కేసుల్లో బాధితులకు రూ.12.77 కోట్లు చెల్లించగా, హైదరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో 268 కేసుల్లో రూ.8.84 కోట్లు, రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో 592 కేసుల్లో రూ.4.53 కోట్లు, టిజిసిఎస్‌బిలో 60 కేసుల్లో రూ.1.06 కోట్లు, సంగారెడ్డిలో 188 కేసుల్లో రూ.కోటి బాధితులకు తిరిగి చెల్లించారని పేర్కొన్నారు. టిజిసిఎస్‌బి, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టిజిఎల్‌ఎస్‌ఎ). జిల్లా న్యాయమూర్తులు, మెజిస్ట్రేట్‌లు, డిఎల్‌ఎస్‌ఎఎస్, కమిషనర్లు, జిల్లా ఎస్‌పిల మధ్య సమన్వయంతో బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం దక్కిందన్నారు. అత్యాశ, భయంతో చాలా మంది సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతున్నారని అధ్యయనంలో తేలిందన్నారు.

ఫోకస్

# ఆరోగ్యం

## 18వ శతాబ్దంలోనే విటమిన్లపై అవగాహన




మనిషి ఎదుగులకు, ఆరోగ్యాని విటమిన్లు, ప్రొటీన్లు అవసరం. ఈ విషయం పై మనిషి అవగాహన నిన్నమొన్నటిదికాదు. మనిషికి విటమిన్లపై 18వ శతాబ్దంలోనే అవగాహన ఏర్పడిందని చరిత్ర చెప్తున్నది. అప్పట్లో నావికులు తమకు అందుబాటులో ఉన్న జంతు కాలేయాన్ని భుజించడం వల్ల రేచీకటి, నిమ్మ జాతికి చెందిన ఫలాలను తినడం వల్ల స్కర్వీవ్యాధి, కాడ్‌చేపలను ఆ హారంలోతీసుకోవడంవల్ల రికెట్స్‌వ్యాధి నయమవుతున్నట్టు గ్రహించారు. హాప్కిన్స్ అనే శాస్త్రవేత్త పాలలో పెరుగుదలకు అవసరమైన పదార్థం ఉందని కనుక్కొన్నాడు. దీన్ని అదనపు కారకంగా పేర్కొన్నాడు. ఫంక్ అనే శాస్త్రవేత్త తవుడులో బెరిబెరి వ్యాధిని నిరోధించే పదార్థం ఉందని కనిట్టి, దాన్ని వైటమిన్ 'సి'అని పిలిచారు.అనారోగ్యకరమైన ఆహారం భుజించడం వల్ల అంధ త్వం, రక్తహీనత,స్కర్వీ,సివిటమిన్‌లోపిస్తే వచ్చే వ్యాధి,ముందస్తు జననం, మృత ప్రసవం, వామనత్వం, స్థూలకాయం మెటబాలిక్ సిండ్రోమ్ వంటి అనారోగ్యాల ప్రమాదం ఉంటుంది. గుండె జబ్బులు, మధుమేహం,ఆస్టియోపోరోసిస్ వంటి సాధారణ దీర్ఘకాలిక దైర్ఘన వ్యాధులు రావటానికి ఆస్కారం వుంది. పోషకాహార లోపం తీవ్రమైన సందర్భాల్లో , దీర్ఘకాలిక పోషకాహార లోపానికి సంబంధించి క్షయవ్యాధికి దారితీస్తుంది.

# పెరుగుదలకు పోషకాలు..

మనిషికి అవసరమైన శక్తికి, శరీర పెరుగుదలకు, నిర్మాణానికి అవసరమైన రసాయన పదార్థాలను పోషక పదార్థాలు లేదా పోషకాలు (న్యూట్రియంట్లు) అంటారు. వీటిని సేకరించడం లేదా తీసుకోవడాన్ని పోషణ లేదా న్యూట్రిషన్ అని పిలుస్తారు. జంతు శాస్త్రం ప్రకారం పోషణలో ఆహార స్వీకరణ (ఆహారాన్ని తీసుకోవడం), జీర్ణక్రియ (స్థూల అణువులను సూక్ష్మ అణువులుగా మార్చడం), శోష ణం (ఆంత్ర కుడ్యము పీల్చుకోవడం), స్వాంగీకరణం (రక్త ప్రసరణలోనికి చేరటం), విసర్జన (జీర్ణము కాని, అనవసరమైన పదార్థాలను బయటకు పంపించడం) అనే ఐదు దశలు ఉంటాయి. పోషకాల విషయానికి వస్తే, ఇవి స్థూల పోషకాలు (మాక్రో న్యూట్రియంట్లు), సూక్ష్మ పోషకాలు (మైక్రో న్యూట్రియంట్లు)గా విభజిస్తారు. కార్బొహైడ్రేట్లు, ప్రొటీన్లు, కొవ్వు పదార్థాలు అవసరం. కాబట్టే వీటిని పోషకాలుగా పేర్కొంటారు. విటమిన్లు, ఖనిజ లవణాలు మన దేశానికి తక్కువ మొత్తంలో అవసరం. అందుకే వీటిని సూక్ష్మ



పోషకాలని పిలుస్తారు. ఇక శరీరానికి అవసరమైన కార్బొహైడ్రేట్లు అనేవి కార్బన్, హైడ్రోజన్, ఆక్సీజన్‌లతో నిర్మితమవుతాయి. గ్లూకోజ్, ఫ్రక్టోజ్, గాలక్టోజ్, రైబోజ్‌లలో ఒకే రకమైన చక్కర పరమాణువు ఉంటుంది. ఈ కారణంగానే వీటిని సరళ చక్కరలు అంటారు. చెరకులోని చక్కరైన గ్లూకోజ్, పాలలోనే చక్కరైన లాక్టోజ్, జంతువులలోని పిండిపదార్థమైన గ్లైకోజెన్, మొక్కల్లోని పిండిపదార్థం, వృక్ష జాతుల్లోని సెల్యులోజ్ వంటివి సంక్లి ష్ట కార్బొహైడ్రేట్లకు ఉదాసరం. వీటిలో రెండు నుం చి కొన్ని వందల చక్కెర అణువులు ఉంటాయి. ఆహారం ద్వారా వీటిని తీసుకున్నప్పుడు సంక్లిష్టమైన కార్బొహైడ్రేట్లు ఆహారనాళంలోని ఎంజైమ్‌లతో కలిసి జల విశ్లేషణం చెం దుతుంది. తత్ఫలితంగా సరళ చక్కెరలుగా అవి విడిపోతాయి. ఇక అమైనో ఆమ్లాలతో నిర్మితమయ్యే ప్రొటీన్లు కూడా ఆహార నాళంలోని ఎంజైముల సా యంతో విడిపోయి, అమై నో ఆమ్లాలుగా మారుతా యి. ఈ ఆమ్లాలు పేగు గోడల నుంచి శోషణం చెందుతాయి. వీటిలో అనావశ్యక ఆమైనో ఆమ్లాలు, అంటే కొవ్వులు, ఫ్యాటీ ఆమ్లాలు గ్లిజరాల్‌తో ఏర్పడతాయి. కొవ్వు పదార్థాలను ఆహారంలో చేర్చినప్పుడు, అవి శరీరంలో ఫ్యాటీ ఆమ్లాలు, గ్లిజరాల్‌గా జల విశ్లేషణం చెందుతాయి.

# సంపూర్ణ ఆరోగ్యానికి మెరుగైన జీవన శైలి అవసరం

సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందాలంటే, మెరుగైన జీవన శైలిని అనుసరించక తప్పదు. ఆహారం, వ్యాయామం అనే రెండు అంశాలు ఇందులో అత్యంత కీలకం. ఆరోగ్యానికి రోజులో ఏం తింటారనేది ముఖ్యం. రోజంతా ఉత్సాహంగా ఉండాలంటే ఆ రోజు మనం తీసుకునే తొలి ఆహారంపైనే ఆధారపడి ఉంటుంది. ఈ క్రమంలో శరీరానికి శక్తిని అందించే పదార్థాలకు అధిక ప్రాధాన్యమివ్వాలి. పండ్లు, నట్స్ వంటివి తీసుకోవాలి. రోజూ ఉదయాన్నే ఏదైనా ఒక పండు లేదంటే , నానబెట్టిన కొన్ని బాదం పప్పులు,కిస్మిస్లను తీసుకోవాలి. ఇలా తీసుకోవడం అలవాటుగా మార్చుకుంటే రోజూ యాక్టివ్గా ఉండటంతోపాటు ఆరోగ్యానికీ ఎంతో మంచిది. తాజా పదార్థాలు, పండ్లు, పీచు పదార్థం ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలి. తృణధాన్యాల ఉత్పత్తులు, అలాగే రోజుకి 10 నుండి 12 గ్లాసుల నీరు త్రాగడం కూడా ఆరోగ్యానికి మంచిది. పోషకాహారం తీసుకోవడం, కంటి నిండా నిద్ర పోవడం, శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవడానికి వ్యాయామాన్ని రొటీన్లో భాగం చేసుకోవాలి. పాల ఉత్పత్తులను తీసుకుంటే తక్కువ కొవ్వు, స్కిమ్డ్ రకాలను ఎంచుకోండి. మీ సమయం ఎక్కువ తీసుకున్నా సరే ఆహారాన్ని పూర్తిగా నమిలి తినాలి. బయటి ఫుడ్ కంటే ఇంట్లో వండిన భోజనం తినడం మంచిది. మీకు మీరే వంట చేసుకోండి. బయట తినడం తగ్గించండి. ఆరోగ్యకరమైన లైఫ్స్టైల్ కోసం, మంచి నిద్ర, రక్తాన్ని పెంచడానికి, శరీరం సరిగ్గా పనిచేయడానికి ఆరోగ్యకరమైన ఆహారం చాలా ముఖ్యం. 30 నుంచి 40 నిమిషాలు నడవడం, యోగా సెషన్, జిమ్, వాకింగ్ అనేవి మీ మానసిక స్థితిని పెంచుతాయి. ఇది నిరాశ, ఆందోళన, యాంగ్జైటీ భావాలను తగ్గించడంలో సహాయపడతాయి. ఇది మిమ్మల్ని మరింత చురుగ్గా చేస్తాయి. అనేక సమస్యల నుండి రక్షిస్తాయి. పోషకాహారం లోపం వల్ల మూత్రపిండ వ్యాధి, లాక్టోస్ అసహనం, ఉదరకుహర వ్యాధి వంటివి వస్తాయి. ఇవే కాక సరిగ్గా లేని లైఫ్స్టైల్, నిద్రసరిగ్గా పోకపోవడం, గుండె జబ్బులకి కారణమవుతాయి. ఈ సమస్యలు దరిచేరకుండా ఉండాలంటే పోషకాహారం తీసుకోవాలి. ప్రతి మూడు మాసాలకు ఒకసారి ఆరోగ్యానికి సంబంధించి పరీక్షలు చేయించుకుని శరీరంలో వస్తున్న మార్పుల గురించి తెలుసుకోవాలి. బరువుతో సంబంధం లేకుండా సంపూర్ణ ఆరోగ్యానికి మనం తీసుకునే ఆహారం ఎంత ముఖ్యమో, క్రమం తప్పకుండా చేసే వ్యాయామం కూడా అంతే ముఖ్యం. కాబట్టి వారానికి మూడు గంటల చొప్పున రోజుకు అరగంట పాటు వ్యాయామానికి కేటాయించాలి. బార్లీ, బ్రౌన్ రైస్, బుక్వీట్, మిల్లెట్, ఓట్‌మీల్, పాప్‌కార్న్, గోధుమపిండి, బ్రెడ్ తదితరాలతో తృణ ధాన్యాలు మన ఆహారంలో భాగమవుతాయి. మిల్లెట్స్ పోషకాహారంలో పుష్కలంగా ఉన్నాయి. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో, గుండెజబ్బులు, షుగర్, క్యాన్సర్, ఇతర ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడే సంక్లిష్ట పిండి పదార్థాలు ఫైబర్ ఫుడ్లో ఉంటాయి. నిపుణుల సూచనలను పాటిస్తే శారీరకంగా, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యాన్ని మీ సొంతం చేసుకోవచ్చు.



ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

# పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం) ప్రతి సోమవారం

- ముస్లింలీగ్ ఏర్పాటు?
  – 1906
- బెంగాల్ విభజనను ప్రతిపాదించినది?
  – కర్జన్
- అతివాదుల నాయకుడు?–
  బాలగంగాధర్ తిలక్
- వందేమాతరం ఉద్యమంతో సంబంధమున్న అంశం?
  బెంగాల్ విభజన
- మలేరియా వ్యాధికారకం ఆడ ఎనాఫిలస్
  దోమ
- ఉత్తరాఖండ్ 6వ ముఖ్యమంత్రి
  – బి.సి. ఖందూరి
- రక్తం ఘనీభవించుటలో ప్రధాన పాత్రధారి
  – రక్త ఫలకికలు
- జ్ఞానేంద్రియాలలోని కణాలు:
  గ్రాహకాలు
- అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం
  సెప్టెంబర్ 8
- ఇది ప్రపంచంలో అత్యధిక వర్షపాతం సంభవించే ప్రదేశము
  వయలీలీ శిఖరం
- ప్రపంచంలో ఎక్కువ తపాలా కార్యాలయాలు గల దేశం ఏది?
  భారత్
- 'గోధుమ విప్లవం' దేనికి సంబంధించినది?
  సాంప్రదాయేతర ఇంధన వనరులు
- ఈగ జీవిత చరిత్రలో ఆఖరి దశ ఏది?
  ఇగో
- మనదేశానికి గుత్తాధిపత్యంగల పంట ఏది?
  జనుము
- నానాసాహెబ్ సైన్యాలకు నాయకత్వం వహించినది ఎవరు?
  తాంతియా తోపే
- ప్రపంచంలో 'తేయాకు'ఉత్పత్తిలో ప్రథమ స్థానంలోఉన్న దేశం ఏది?
  భారత్
- లీపు సంవత్సరం ఎన్ని సంవత్సరాలకు ఒకసారి వస్తుంది?
  4 సంవత్సరాలు
- 'ఊదా విప్లవం' దేనికి సంబంధించినది?
  ఉన్ని
- పెన్సిలిన్ కింది దాని నుండి తయారు అవుతుంది
  శిలీంధ్రాలు
- కారన్ వాలీస్ చేసిన ఒక సంస్కరణ :
  ప్రాచీన గ్రామపంచాయితీ వ్యవస్థ రద్దు చేశాడు
- ఉత్తర రొడీషియాకు ప్రస్తుత పేరు జాంబియా
- వందేమాతరం గీత రచయిత బంకించంద్ర ఛటర్జీ
- నానాజాతి సమితి స్థాపకుడు ఎవరు? – ఉడ్రో విల్సన్
- అత్యంత లవణీయత ఉన్న 'వాన్ సరస్సు' ఏ దేశంలో ఉంది?
  టర్కీ
- బుద్ధుని మహాభినిష్క్రమణకు చిహ్నం? – గుర్రం
- 1857 తిరుగుబాటు ఇచ్చట ప్రారంభమైంది మీరట్
- రవీంద్రనాథ్ ఠాగూర్కు నోబెల్ ఈ సంవత్సరంలో లభించింది:
  – 1913
- కమ్యూనిస్టు మేనిఫెస్టో గ్రంథకర్త: – కారల్ మార్క్స్
- భారత రాజ్యాంగం అమలులోనికి వచ్చిన సంవత్సరం 1950
- అంతర్జాతీయ న్యాయస్థానములోని న్యాయమూర్తుల పదవీకాలం
  9 సంలు

# రైతుల ఖాతాల్లోకి రైతు భరోసా

సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి డిమాండ్



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఈ యాసంగి సీజన్లో అయినా పెట్టుబడి సాయం కింద రైతు భరోసా డబ్బులను వెంటనే రైతుల ఖాతాలలో వేయాలని జనగామ మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రాజారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని శ్రీమన్నారాయణపురం గ్రామంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, మండల కార్యదర్శి కావటి యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించగా కార్యక్రమానికి రాజారెడ్డి, సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి ఆది సాయన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణపురం గ్రామానికి చెందిన ఇటుకల హన్మాజీ, తూడి బిక్షపతి, తూడి ఆంజనేయులు, మల్లేష్, శ్రీనివాస్ తదితరులు రాజారెడ్డి సమక్షంలో సిపిఐలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రూ.2లక్షల రుణాలను బేషరతుగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురవుతున్నాయని, సంబంధిత అధికారులు దృష్టి సారించి చెరువులు, కుంటలు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో పూర్తిగా ఇల్లులేని నిరుపేదలకు అందేవిధంగా అధికారులు పథకాన్ని పారదర్శకంగా అమలుచేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అవకతవకలకు పాల్పడితే చూస్తూ ఊరుకునేది లేదని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ పార్టి మండల నాయకులు తూడి రేణుబాబు, తూడి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# నిరంతరం పేదల పక్షాన పోరాటం

సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు

**ప్రజాపక్షం/నందిగామ:** సిపిఐ వంద వసంతాలు పూర్తి చేసుకోవడం కమ్యూనిస్టుల గొప్పతనమని పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పానుగంటి పర్వతాలు అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్ల నందిగామ మండల పరిధిలోని రంగాపూర్ గ్రామంలో సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పర్వతాలు మాట్లాడుతూ వందేళ్లుగా ప్రజల పక్షాన ఉండి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న ఏకైక పార్టీ కమ్యూనిస్టు పార్టీ అన్నారు. అధికారంలో ఉన్నా..లేకపోయినా నిరంతరం పేదల పక్షాన పోరాడే కమ్యూనిస్టు పార్టీని ప్రజలు ఆదరించాల్సిన బాధ్యత ప్రజలందరికి ఉందన్నారు. 1925 డిసెంబర్ 26న భారతదేశంలోని కాన్పూర్ పట్టణంలో ఆవిర్భవించిన సిపిఐ పార్టీ వంద సంవత్సరంలోకి అడుగుపెట్టడం కమ్యూనిస్టుల త్యాగనిరతికి నిదర్శనం అన్నారు. పార్టీ శతాబ్ది ఉత్సవాలను వాడవాడల ఘనంగా నిర్వహించి సిపిఐ పోరాట చరిత్ర, త్యాగాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులను కోరారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో సిపిఐ నాయకులు మల్లేష్, పోన్నేష్, గడ్డం లక్ష్మయ్య, జగదీష్, షకీరయ్య, అశోక్, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.



# రాజ్యాంగంపై బిజెపి కపట ప్రేమ

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు

పార్టీలో చేరిన ప్రజాసంఘాల నాయకులు



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** రాజ్యాంగంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానిది కపట ప్రేమ అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. ఆదివారం పట్టణానికి చెంది వివిధ ప్రజాసంఘాల ముఖ్య నాయకులు ఏదునూరి వెంకట్రాం, జుర్రు సంపత్‌కుమార్ యాదవ్ తదితరులు సిపిఐలో చేరారు. హనుమకొండ బాలసముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారికి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు సిపిఐ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశంలో రాజ్యాంగం స్థానంలో మను స్మృతి అమలు చేయడానికి పూనుకుంటున్నారని ఆరోపించారు. బిజెపి నాయకులు, ప్రజాప్రతినిధులు అడుగడుగునా రాజ్యాంగ ధిక్కరనకు పాల్పడుతున్నారన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు, లౌకిక శక్తుల ఐక్యతకు దేశంలో సిపిఐ అనునిత్యం పోరాడుతుందన్నారు. ప్రజాసమస్యలపై పార్టీ చేపడుతున్న పోరాటాలకు ఆకర్షితులై పలువురు సిపిఐలో చేరుతున్నారని తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై పోరాటాల చరిత్ర సిపిఐది

ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు సామిడి శేఖర్‌రెడ్డి

**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** సిపిఐ శతజయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు సామిడి శేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం హయత్‌నగర్‌లో లేబర్ అడ్డ వద్ద సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పేదల ప్రజలకు అండగా నిలిచిన చరిత్ర సిపిఐ ఉందని ఆయన కోనియాడారు. ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటాల చరిత్ర సిపిఐకి మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు రమావత్ సక్రు నాయక్, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు చెంది వెంకట్, ఉప్పలయ్య, రమేష్, వినోద్, పార్వతి, ఎల్లమ్మ, సునీత, కనకయ్య, శ్రీను, జంపన్న తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సమరానికి సిద్ధం కావాలి




పార్టీ శ్రేణులకు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా పిలుపు

**ప్రజాపక్షం/మణుగూరు :** స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మణుగూరు సిపిఐ కార్యాలయంలో ఆదివారం పార్టీ జిల్లా కార్యవర్గసభ్యులు, మండల, పట్టణ కార్యదర్శులు, సహాయ కార్యదర్శుల సంయుక్త సమావేశం జరిగింది. సమావేశానికి సాబీర్‌పాషా హాజరై మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో ఇతర పార్టీలతో కలిసి ముందుకు వెళ్లేందుకు ప్రయత్నిస్తామని, అవసరమైతే ఒంటరిగా పోటీచేసేందుకు సిద్ధంగా వుండాలన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ ఉద్యమాల వైపునకు నడిపించాలన్నారు. పాలకులు ఇచ్చిన హామీల అమలుకోసం ఉద్యమించాలని, సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేవిధంగా పార్టీ శ్రేణులు చొరవ తీసుకోవాలన్నారు. డిసెంబర్ 26 నాటికి సిపిఐ పార్టీ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వాడవాడలా శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించి సిపిఐ పోరాట చరిత్ర, త్యాగాలను ప్రజలకు వివరించాలని, గ్రామలతోపాటు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో సభలు నిర్వహణకు కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. సభ్యత్వ చేర్పింపు, పునరుద్ధరణ లక్ష్యానికి చేరువలో ఉన్నామని, మిగిలిన సభ్యత్వం పూర్తి చేయాలని కోరారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ అవసరాన్ని ప్రజలు గుర్తిస్తున్నారని, అందుకగుణంగా ప్రజా ఉద్యమాలు మరింత ముందుకు తీసుకుపోవాలన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతంలోకి అడుగిడుతున్న వేళ పార్టీ నిర్మాణంపై దృష్టిసారించాలని కోరారు. బలమైన కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణమే అమరులకు మనమిచ్చే నివాళి అని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపైన గ్రామ స్థాయి నుంచి ప్రజా ఆందోళనలు ఉద్యమాలు చేపట్టాలన్నారు. వ్యవసాయ రంగం కార్మికులు, పేద, మధ్యతరగతి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అప్పుడే పార్టీకి ఆదరణ పెరుగుతుందన్నారు. పార్టీ శతజయంతి ప్రారంభ సభ ఈనెల 30న నల్లగొండలో జరుగుతుందని జాతీయ స్థాయి ముగింపు సభ 2025 డిసెంబర్ 26న ఖమ్మంలో జరుగుతుందని ఈ సందర్భంగా రెండు లక్షల మందితో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ముందు ఇటీవల మృతి చెందిన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాల మల్లేష్, ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటుప్రసాద్, వివిధ స్థాయిల్లో పనిచేసి మృతి చెందిన వారికి నివాళులర్పించారు. చంద్రగిరి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, సరెడ్డి పుల్లారెడ్డి, ఎస్‌డి సలీం, కె.సారయ్య, మున్నా లక్ష్మి కుమారి, కమటం వెంకటేశ్వరరావు, రేసు ఎల్లయ్య, సలిగంటి శ్రీనివాస్, దేవరకొండ శంకర్, మండలాలు, పట్టణాల కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# దేవాదుల ప్రాజెక్టు పూర్తిచేయండి

హనుమకొండ సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి

**ప్రజాపక్షం/ఎల్కతుర్తి :** అసంపూర్తిగా ఉన్న దేవాదుల ప్రాజెక్టుకు నిధులు కేటాయించి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేయాలని హనుమకొండ సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి డిమాండ్ చేశారు. సిపిఐ ఎల్కతుర్తి మండలం సమావేశం మండల కేంద్రంలో మరిపెల్లి తిరుమల అధ్యక్షతన ఆదివారం జరిగింది. సమావేశానికి బిక్షపతి హా జరై మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టు ద్వారా కాలువలు అసంపూర్తిగా ఉండడంవల్ల ఆయకట్టు నీరు అందక రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనేక దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో ఉన్న రైతులు జీవనోపాధి కోసం ఇతర నగరాలకు, పట్టణాలకు వలస వెళ్లిన సందర్భం ఉందని, దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీరును విడుదల చేయడంతో సాగునీరు, తాగునీరుకు ఇబ్బంది తప్పేదని, కానీ అరకొర నిధులు కేటాయించి ఈ ప్రాజెక్టును నిర్మించి కాలువలు పూర్తి చేయకపోవడంతో ఆయకట్టు చివరి రైతు వరకు నీరు అందక ఈ ప్రాంత ప్రజలు రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు మొరపెట్టుకున్నా కూడా గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో ఈరాష్ట్ర ప్రభుత్వానికి అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రజలు విజ్ఞప్తులు చేయడం జరిగిందన్నారు. ఈప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలు కాలువలు పూర్తికి నిధులు రాబట్టడం కోసం రాష్ట్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావాలని, రైతాంగానికి ఉపయోగపడే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం జమిలి ఎన్నికల ద్వారా ఒకే ఎన్నిక ఒకే దేశం చట్టం తీసుకువచ్చే విధంగా తహతహలాడుతున్నారన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ చిన్న భిన్నం అవుతూ నిరుద్యోగం ఉపాధి లేక యువత ఇతర దేశాలకు వలస పోతున్నారని, దేశానికి స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా నేటికి విద్యా వైద్యం ఇండ్లు ఇళ్ల స్థలాలు ఉపాధి దొరకక రెండు పూటలా భోజనం చేయలేని పరిస్థితి దౌర్భాగ్యం ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలలో ఆరో గ్యారంటీలను అమలు చేయాలని, రెండు లక్షల రూపాయల రైతుల రుణ మాఫీని పూర్తిగా అమలు చేసి రైతన్నను ఆదుకోవాలని, రేషన్ కార్డులు, ధరణి సమస్య, వయోవృద్ధులకు పింఛన్లు, ఇళ్లస్థలాలు, పక్కాఇండ్లు నిర్మాణం చేయాలని బిక్షపతి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరు రాములు, జిల్లా కౌన్సిల్ సభ్యులు మర్రి శ్రీనివాస్, కామర వెంకటరమణ, శనగరపు రాజకుమార్, నిమ్మల మనోహర్, తండ మొండయ్య, బొంత మల్లన్న, గడ్డం రాజనర్సు, ఆరేపల్లి చంద్రమౌళి, వేముల కుమారస్వామి, అశోక్ రావు, జూపాక రవి, పోచన్న తదితరులు పాల్గొన్నారు.



# ఇవిఎంలపై నిందలు ఆపండి

## ఎన్నికల ఫలితాలను అంగీకరించాలి

## కాంగ్రెస్‌కు ఒమర్ అబ్దుల్లా హితవు



**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఎలక్ట్రాక్ ఓటింగ్ మెషీన్ (ఇవిఎం)ల పట్ల అదే పనిగా కాంగ్రెస్ వ్యక్తం చేస్తున్న అభ్యంతరాలను తోసిపుచ్చారు. ఎన్నికల ఫలితాల విషయమై బిజెపి వాదనను ఆయన ఒక విధంగా సమర్థించారు. కాంగ్రెస్ గెలిచినప్పుడు ఎన్నికల ఫలితాలను ఆమోదించడం, ఓడినప్పుడు ఇవిఎంలను నిందించడం తగదని ఒమర్ అన్నారు. 'అవే ఇవిఎంలను ఉపయోగించి వంద మందికి పైగా పార్లమెంట్ సభ్యులను మీరు పొందినప్పుడు దానిని మీ పార్టీ విజయంగా వేడుక చేసుకుంటుంటారు, కొన్ని నెలలు గడచిన తరువాత ఎన్నికల ఫలితాలు ఆశించిన రీతిలో లేకపోతే మాకు ఆ ఇవిఎంలు అంటే ఇష్టం లేదని అంటుంటారు' అని ఒమర్ అబ్దుల్లా 'పిటిఐ'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించారు. బిజెపి అధికార ప్రతినిధి వలె కనిపిస్తున్నారని అన్నప్పుడు 'భగవంతుడు క్షమించుగాక' అని ఒమర్ స్పందించారు. 'లేదు.అది అంతే.. ఏది సరైనదో సరైనదే' అని ఆయన అన్నారు. పక్షపాతంతో కూడిన విధేయతతో కాకుండా సిద్ధాంతాల ప్రాతిపదికపైనే తాను మాట్లాడుతుంటానని ఆయన చెప్పారు. 'సెంట్రల్ విస్టా' వంటి మౌలిక వసతుల ప్రాజెక్టులకు తన మద్దతును తన స్వతంత్ర ఆలోచనలకు ఒక ఉదాహరణగా ఒమర్ పేర్కొన్నారు. 'ఇతరులు అభిప్రాయానికి భిన్నంగా, ఢిల్లీలో ఆ సెంట్రల్ విస్టా ప్రాజెక్టు వల్ల ఒనగూరుతున్నది చాలా మంచి విషయమని నా భావన. మనకు పార్లమెంట్ కొత్త భవనం అవసరం. పాత భవనం అవసరానికి మించి ఉపయోగపడింది' అని ఆయన అన్నారు. ఓటింగ్ యంత్రాంగాన్ని విశ్వసించనప్పుడు పార్టీలు ఎన్నికల్లో పోటీ చేయరాదని ఆయన అన్నారు. ఇవిఎంలపైనే దృష్టి కేంద్రీకరించడం ద్వారా ప్రతిపక్షాలు, ముఖ్యంగా కాంగ్రెస్ గింజుకుంటున్నాయని భావిస్తున్నారా అన్న ప్రశ్నకు ఒమర్ సమాధానం ఇస్తూ, 'మీకు ఇవిఎంలతో సమస్యలు ఉన్నట్లయితే, ఆ సమస్యలపై మీరు నిలకడగా ఉండాలి' అని సూచించారు. హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం అనంతరం కాంగ్రెస్ ఇవిఎంల లోపం, ఎన్నికల ఫలితంపట్ల అనుమానాలు వ్యక్తం చేసింది. ఎన్నికల్లో తిరిగి బ్యాలట్ పత్రాలు ఉపయోగించాలని ఆ పార్టీ కోరింది. జమ్ముకశ్మీర్‌లో సెప్టెంబర్‌లో అసెంబ్లీ ఎన్నికల్లో తాము పొత్తు పెట్టుకున్న కాంగ్రెస్ పట్ల నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) అసంతృప్తికి ఒమర్ తాజా వ్యా ఖ్యలు బలం చేకూరుస్తున్నాయి. ఎన్నికల ఫలితం ఎలా ఉన్నా ఇవిఎంలు ఒకే విధంగా ఉంటాయని, పార్టీలు ఓటమికి ఒక సాకుగా వాటిని వాడుకోరాదని ఒమర్ స్పష్టం చేశారు. 'ఓటర్లు ఒక రోజు మిమ్మల్ని ఎంచుకోవచ్చు, ఆ మరునాడు వారు అలా చేయకపోవచ్చు' అని ఆయన అన్నారు. సెప్టెంబర్ అసెంబ్లీ ఎన్నికల్లో తాము మెజారిటీ సాధించగా లోక్‌సభ ఎన్నికల్లో తాను ఓడిపోవడాన్ని ఆయన ఈ సందర్భంగా ఉదహరించారు. 'నేను ఇవిఎంలను ఎన్నడూ తప్పు పట్టలేదు' అని ఒమర్ చెప్పారు.

# డల్లేవాల్ వద్దకు డిజిపి, పంజాబ్ ఎంహెచ్‌ఎ డైరెక్టర్

## సుప్రీం ఆదేశాల అమలు కోసం వచ్చామని సమావేశం అనంతరం విలేకరులకు వెల్లడి



**చండీగఢ్ :** పంజాబ్‌హర్యానా మధ్య ఖనౌరీ సరిహద్దు పాయింట్ వద్ద ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న రైతునాయకుడు డల్లేవాల్‌ను ఆదివారం పంజాబ్ పోలీస్ చీఫ్ గౌరవ్ యాదవ్, కేంద్ర హోం వ్యవహారాలమంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఎ) సీనియర్ అధికారి మయాంక్ మిశ్రాతో కలిసివెళ్లి పరామర్శించారు. డల్లేవాల్ ఆరోగ్యపరిస్థితి గురించి అతడినే స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) న్యాయపరమైన హామీ సహా పలు డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు పంజాబ్ రైతు నాయకుడు డల్లేవాల్ నవంబరు 26నుంచి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. 70 ఏళ్ల డల్లేవాల్ క్యాన్సర్ పేషెంట్. ఆయన ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో ఆయనను వెంటనే స్వయంగా కలిసి చర్చించాలని,ఆ యన ప్రాణం విలువైనదనే విషయాన్ని వివరించి ఆయన నిరవధిక నిరాహారదీక్షను నిలిపివేసేలా ఒప్పించాలని సుప్రీంకోర్టు ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులను ఆదేశించిన రెండు రోజుల తర్వాత కేంద్ర, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు ఖనౌరి సరిహద్దు పాయింట్‌ను సందర్శించారు. డల్లేవాల్‌తో సమావేశం అనంతరం పంజాబ్ డిజిపి గౌరవ్ యాదవ్ విలేకరులతో మాట్లడుతూ 'డల్లేవాల్ ఆరోగ్యపరిస్థితిని విచారించేందుకు మేం ఇక్కడికి వచ్చాం' అని చెప్పారు. తాను భారత ప్రభుత్వ ప్రతినిధిగా పంజాబ్ డిజిపితో కలిసి ఇక్కడకు వచ్చానని, తాను మయాంక్ మిశ్రా అని ఆయన విలేకరులకు పరిచయం చేసుకున్నారు. 'డల్లేవాల్ డిమాండ్లను అన్నింటినీ మేం విన్నాం' అని విలేకరులకు తెలిపారు. విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా మయాంక్ మిశ్రా మాట్లాడుతూ ఏవిధమైన ప్రతిపాదన లేదని, సుప్రీంకోర్టు ఆదేశం అమలు కోసం డల్లేవాల్ చెప్పేది వినడానికి ఇక్కడకు వచ్చామని చెప్పారు. డిజిపి యాదవ్ మాట్లాడుతూ డల్లేవాల్ శాంతియుత ధోరణిలో ఆందోళనను నిర్వహిస్తున్న తీరు అన్నిచోట్లా ప్రశంసింపబడుతున్నదని, దీనిని ప్రభుత్వం కూడా దీనిని గుర్తించిందని తెలియజేశామని వివరించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అత్యవసర వైద్యసహాయం ఏర్పాటుచేయాలనే విషయంపై డల్లేవాల్‌తో చర్చించగా ఆయన అంగీకరించారని డిజిపి గౌరవ్ యాదవ్ చెప్పారు. ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ఒక సందేశాన్ని పంపించారని, ఆ దిశగా వారి డిమాండ్లపై తాము చర్చలు జరిపి, ఈ సమస్యను పరిష్కరించాలన్నదే తమ ప్రయత్నమని డిజిపి తెలిపారు. డల్లేవాల్ ప్రాణం విలువైనదని రైతులకు చెప్పామని, ఇక్కడ వైద్య సదుపాయాలు కల్పించామని, వారి సమన్వయంతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. డల్లేవాల్‌కు అత్యవసర వైద్య సహాయం అందించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇక్కడ అన్ని సౌకర్యాలతో కూడిన అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచామని డిజిపి గౌరవ్ యాదవ్ తెలిపారు. రైతు నేతలతో నిరంతరం మాట్లాడుతున్నామని, సానుకూల ఫలితం వస్తుందని ఆశిస్తున్నామని ఆయన విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. వారు అడిగిన మరో ప్రశ్నకు సమాధానమిస్తూ ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన వైఖరి ఉందన్నారు. డల్లేవాల్ ప్రాణాధారాల విషయమై నిరంతరం పర్యవేక్షిస్తున్నామని డిజిపి చెప్పారు.

# అక్రమ చొరబాట్లకు కేంద్రానిదే బాధ్యత



**న్యూఢిల్లీ :** భారత్ లోకి అక్రమంగా ప్రవేశిస్తున్న రోహింగ్యా లు వారి పునరావాసాలపై ఢిల్లీ ముఖ్య మంత్రి ఆతిశీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై కేంద్ర మంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. అక్రమ చొరబాట్లకు కేంద్ర మే బాధ్యత వహించాలన్నారు. నిత్యం బంగ్లాదేశ్ నుంచి వేల సంఖ్యలో అక్రమ చొరబాట్లు జరుగుతున్నట్టు ఇటీవల ఓ మీడియా సంస్థ కథనం ప్రచురించింది. వారు సరిహద్దును ఎలా దాటుతున్నారో తెలిపింది. కేంద్రం లోని ఎన్డీయే ప్రభుత్వం దేశ సరిహద్దులను రక్షించడంలో విఫలమైన తీరుకు ఇది అద్దం పడుతోంది. అంతేకాకుండా రోహింగ్యాలకు ఢిల్లీలో పున రావాసంతో పాటు తగిన వసతులు కల్పించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోం ది' అని ఆతిశీ లేఖలో పేర్కొన్నారు. ఇదే విషయంపై ఇటీవల ఆప్ జాతీయ కన్వీనర్ కేంద్రంపై నిప్పులు చెరిగారు. ఆయన ఆరోపణలపై స్పందించిన బిజెపి.. ఎన్నికల్లో రోహింగ్యా లను ఓటు బ్యాంకుగా మార్చేందుకు ఆప్ ప్రయత్నిస్తోందని ఆరోపించింది. కేజ్రీవాల్‌పై చేసిన ఆరోపణలపై తాజాగా స్పందించిన ఆతిశీ లేఖలో ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా.. ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలకు ఆప్ అభ్యర్థుల తుది జాబితా విడుదల చేసింది.

# 38 మంది అభ్యర్థులతో ఆప్ తుది జాబితా

## న్యూఢిల్లీ నుంచి పార్టీ సుప్రీం కేజ్రీవాల్ పోటీ



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ ప్రచారంలో దూసుకుపోతుంది. ఇప్పటికే రెండు విడతలుగా అభ్యర్థుల జాబితాను విడుదల చేయగా, తాజాగా తుది జాబితాను ప్రకటించింది. న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి ఆప్ సుప్రీమ్ అరవింద్ కేజ్రీవాల్ పోటీ చేయనున్నారు. అభ్యర్థుల జాబితా విడుదల సందర్భంగా కేజ్రీవాల్ బిజెపిపై విరుచుకుపడ్డారు.కాషాయ పార్టీకి ముఖ్యమంత్రి అభ్యర్థే లేరని ఎద్దేవా చేశారు. కాగా ఆదివారంనాడు ఆప్ 38 మంది అభ్యర్థులతో తుది జాబితాను విడుదలచేసింది. ముఖ్యమంత్రి ఆతిశీ మరోసారి కల్కాజీ స్థానం నుంచి బరిలోకి దిగుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ పూర్తి విశ్వాసంతో, పూర్తి సన్నద్ధతో పోటీ చేస్తుందని కేజ్రీవాల్ ఎక్స్‌లో పోస్టు చేశారు. బిజెపి కనిపించడం లేదని, ఆ పార్టీకి ముఖ్యమంత్రి అభ్యర్థే లేరని, ఎలాంటి బృందమూ లేదని, అసలు ఢిల్లీ కోసం కార్యాచరణ గానీ, ఒక విజన్‌గానీ లేదని మండిపడ్డారు. ఆ పార్టీకి కేవలం ఒకే నినాదం, ఒకే ఒక విధానం, ఒకే ఒక మిషన్... అది కేజ్రీవాల్‌ను తొలగించడమేనన్నారు. ఎద్దేవా చేశారు. ఈ ఐదేళ్లలో వారిని ఏం చేశారని ప్రశ్నిస్తే... వారు చెప్పేది ఒక్కటేనని కేజ్రీవాల్‌ను తిట్టడమేనన్నారు. బిజెపి ఇప్పటి వరకు అభ్యర్థుల జాబితాను విడుదల చేయలేదు. కేజ్రీవాల్‌పై న్యూఢిల్లీ నియోజకవర్గంలో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు పర్వేష్ వర్మను బరిలో దింపవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.ఇదిలా ఉండగా, కాంగ్రెస్ కూడా ఇటీవల 21 మంది అభ్యర్థులతో జాబితాని రిలీజ్ చేసింది. మాజీసిఎం, దివంగత షీలా దీక్షిత్ కుమారుడు కేజ్రీవాల్‌పై పోటీ చేయనున్నారు. అయితే కాంగ్రెస్‌తో పొత్తు ఉండబోదని కేజ్రీవాల్ ఇప్పటికే పలు సందర్భాల్లో స్పష్టం చేశారు. వరుసగా మూడవ సారి కూడా అధికారాన్ని చేజిక్కించుకోవాలని ఆప్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగా అన్ని నియోజకవర్గాల్లోనూ సొంతంగా తమ అభ్యర్థులను పోటీకి దించుతోంది. బాబర్‌పూర్ నుంచి మంత్రి గోపాల్ రాయ్, గ్రేటర్ కైలాష్ నుంచి మరోమంత్రి సౌరభ్ భరద్వాజ్, శకుర్ బస్తీ నుంచి సత్యేంద్రజైన్, నంగోలి జాట్ నుంచి మంత్రి రఘువిందర్ షోకీన్, సుల్తాన్‌పూర్ మజ్రా నుంచి ముఖేష్ కుమార్ అహ్లోవాట్‌లు బరిలోకి దిగుతున్నారు.

# అయ్యప్ప స్వాముల బస్సును ఢీ కొన్న కారు

## నవ దంపతులు సహా నలుగురి దుర్మరణం



**న్యూఢిల్లీ :** కేరళ శబరిమల కొండలపై వెలిసిన అయ్యప్ప స్వామిని దర్శించుకోవడానికి భక్తులు వేల సంఖ్యలో తరలి వెళ్తోన్నారు. ఏపీ, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున మాలధారణ చేస్తోన్నారు. నియమ నిష్ఠలతో మణికంఠుడిని కొలుస్తోన్నారు. ఇప్పటివరకు 20 లక్షలమంది వరకు భక్తులు అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. మండలంమకరవిళక్కు మహాపడి పూజల కోసం అయ్యప్ప స్వామి ఆలయం తలుపులు కిందటి నెల 15వ తేదీన తెరచుకున్న విషయం తెలిసిందే. దీనితో మండలం మకరవిళక్కు సీజన్ ఆరంభ మైంది. స్వామివారిని దర్శించుకోవడానికి ఏపీ, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు శబరిమలకు తరలి వెళ్తోన్నారు. అదే సమయంలో వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటోన్నాయి. తాజాగా పత్తినంథిట్ట జిల్లాలో ఈ తెల్లవారు జామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో కొత్తగా పెళ్లయిన దంపతులు ఉండటం వారి కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపినట్టయింది. మృతులను మథయ్ ఎప్పన్, అను, నిఖిల్, బిజూ జార్జ్గా గుర్తించారు. మృతులు పత్తినంథిట్ట సమీపంలోని మలస్సేరి గ్రామానికి చెం దిన వాళ్లు. నవ దంపతులిద్దరూ హనీమూన్ కోసం మలేసియాకు వెళ్లారు. హనీమూన్ ముగించుకుని రాత్రి తిరువనంతపురం విమానాశ్రయానికి చేరుకున్నారు. వారిని తీసుకుని రావడానికి మథయ్, బిజూ జార్జ్ కారులో తిరువనంతపురం వెళ్లారు. నవదంపతులను తీసుకుని కారులో స్వగ్రామానికి తిరుగుముఖం పట్టారు.

## భారత్‌లో దిస నాయకే తొలి పర్యటన

# ఇండియా చేరుకున్న శ్రీలంక అధ్యక్షుడు



**న్యూఢిల్లీ :** మూడు రోజుల పర్యటనలో భాగంగా శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సానాయకే భారత్ చేరుకున్నారు. ఆదివారం సా య ంత్రం ఢిల్లీ చేరుకున్న ఆయనకు కేంద్ర సహాయ మంత్రి మురుగన్ స్వాగతం పలికారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి భారత్‌లో పర్యటిస్తున్న ఆయనకు సాదర స్వాగతం పలికినట్లు భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ వెల్లడించారు. భారత్‌లో మూడు రోజుల పాటు (డిసెంబరు 15–17 వరకు) అధ్యక్షుడు అనుర కుమార దిస్సానాయకే పర్యటన కొనసాగనుంది. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన అనంతరం మనదేశంలో చేపట్టిన తొలి ద్వైపాక్షిక పర్యటన ఇదే. శ్రీలంక విదేశాంగ మంత్రి విజితా హెరాత్‌తోపాటు మరో మంత్రి అనిల్ జయంత ఫెర్నాండో కూడా ఉన్నారు. తొలుత భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో దిస్సానాయకే సమావేశం కానున్నారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో భేటి కానున్నారు. ప్రధానంగా ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, ఇతర అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీంతోపాటు సముద్ర భద్రతా సహకారానికి సంబంధించిన అంశాలు కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది. కాగా.. శ్రీలంకలో సెప్టెంబరులో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో అనుర కుమార దిస్సానాయకే విజయం సాధించిన సంగతి తెలిసిందే. దేశ 9వ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్న శ్రీలంక.. ఇప్పుడిప్పుడే బయటపడేందుకు ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే నూతన అధ్యక్షుడు దిసనాయకే భారత్‌లో తొలిసారి పర్యటించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# 'మహా' క్యాబినెట్ విస్తరణ..

## మంత్రులుగా 39 మంది ప్రమాణం



**ముంబయి :** మహారాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటైన పది రోజుల తర్వాత పూర్తిస్థాయిలో మంత్రివర్గ విస్తరణ జరిగింది. మహాయుతిలోని మూడు పార్టీలకు చెందిన పలువురు నేతలు మంత్రులుగా ప్ర మాణం చేశారు. నాగ్‌పూర్‌లోని రాజ్‌భవన్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గవర్నర్ సిపి రాధాకృష్ణన్ వీరితో ప్రమాణం చేయించారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఉపముఖ్యమంత్రులు ఏక్‌నాథ్ షిండే, అజిత్ పవార్‌ల సమక్షంలో మూడు పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. 33 మంది క్యాబినెట్ మంత్రులుగా, మరో ఆరుగురు సహాయ మంత్రులుగా ప్రమాణం చేశారు. మహారాష్ట్ర మంత్రివర్గంలో గరిష్ఠంగా 43 మంది మంత్రులు ఉండవచ్చు. మంత్రివర్గ విస్తరణలో బిజెపికి 19, ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు 11, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి 9 మంత్రి పదవులు దక్కాయి. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ బావాన్‌కులేతోపాటు రాధాకృష్ణ విఖే పాటిల్, చంద్రకాంత్ పాటిల్, గిరీశ్ మహాజన్, గణేశ్ నాయక్, మంగళ్ ప్రభాత్ లోధా, జయ్‌కుమార్ రావల్, పంకజ ముండే, అతుల్ సావే, అశోక్ ఉయికే, ఆశిశ్ శేలార్, శివేంద్రసిన్హ భోసలే, జయ్ కుమార్ గోరె మంత్రులుగా ప్రమాణం చేశారు. శివసేన నుంచి గులాబ్ రావ్ పాటిల్, దాదా భూసే, సంజయ్ రాథోడ్, ఉదయ్ సామంత్, శంభూరాజ్ దేశాయ్, ఎన్‌సిపి నుంచి ధనంజయ్ ముండే, హసన్ ముష్రిఫ్, దత్తత్రేయ భార్నే, అధితీ తాత్కరే, మానిక్ రావ్ కొకాటే, నరహరి జిర్వాల్ తదితరులు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసిన వారిలో ఉన్నారు. మహారాష్ట్రలో వరుసగా రెండోసారి మహాయుతి ప్రభుత్వం డిసెంబర్ 5నే కొలువుదీరింది. బిజెపి శాసనసభాపక్ష నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్ (54).. రాష్ట్ర 20వ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. శివసేన అధినేత ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీ అగ్రనేత అజిత్ పవార్ లకు ఉప ముఖ్యమంత్రుల హోదా కల్పించారు. ఫడ్నవీస్ మహారాష్ట్ర సిఎంగా మూడోసారి బాధ్యతలు చేపట్టగా.. డిప్యూటీ సీఎంగా అజిత్ పవార్ ఆరోసారి బాధ్యతలు చేపట్టడం గమనార్హం.

## ''సొంత వైఫల్యాల నుంచి దేశం దృష్టిని మరల్చేందుకే''

# నెహ్రూ పాలనపై పరువుతీసే వ్యాఖ్యలు

## ప్రధాని మోదీపై కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరాం రమేష్ ధ్వజం



**న్యూఢిల్లీ :** జవహర్‌లాల్ నెహ్రూ కనీస ప్రజాస్వామిక పాలన పరువుతీయడమే ప్రధానమంత్రి నరేంద్రమోదీ నమూనా అని కాంగ్రెస్ పార్టీ విరుచుకు పడింది. ఆదివారం నాడు ఇక్కడ ఆ పార్టీ ప్రధానకార్యదర్శి జైరాం రమేష్ మాట్లాడుతూ మోదీ తన సొంత వైఫల్యాలను, ప్రస్తుత సవాళ్ల నుండి దేశం దృష్టిని మరల్చడానికే భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ పాలనను పరువుతీస్తూ రెచ్చగొడుతున్నారని ధ్వజమెత్తారు. భారత రాజ్యాంగం అద్భుతమైన 75సంవత్సరాల ప్రయాణ ప్రస్థానంపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై దాడిచేసిన ఒక రోజు తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ పార్టీ విమర్శల దాడికి దిగింది. 'దేవుడు లేడనుకుంటే ఆయనను కనిపెట్టడం అవసరమని ప్రఖ్యాత ఫ్రెంచ్ తత్వవేత్త వోల్టేర్ చెప్పాడు. మన స్వీయ అభిషిక్త దైవత్వానికి నెహ్రూ లేకుంటే ఆయనను కనిపెట్టాల్సిన అవసరం ఉండేది' అని జైరాం రమేష్ అన్నారు. 'నెహ్రూ లేకుండా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఏం చేస్తారని , ఎవరికి రోగలక్షణ వ్యామోహం ఉన్నదని కాంగ్రెస్ నేత ప్రశ్నించారు. తన సొంత వైఫల్యాల నుండి దేశం దృష్టిని మరల్చడానికి ఆయనకు నెహ్రూ అవసరం. ప్రస్తుత సవాళ్లనుండి దేశం దృష్టిని మరల్చాల్సిన అవసరం ఉందని మనం అంటే ఆయన పూర్తిగా మౌనం వహిస్తారు' అని జైరాం రమేష్ ఎద్దేవా చేశారు. 2014కంటే ముందు దేశ ంసాధించిన అనేక విజయాలను నెహ్రూ తప్పనిసరిగా తిరస్కరించాల్సిన అవసరం ఉందని రమేష్ అన్నారు. జైరాం రమేష్ తన 'ఎక్స్' పోస్ట్‌లో శనివారం నాడు లోక్‌సభలో తన వాగ్వాదంలోనరేంద్ర మోదీ, ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ భారత రాజ్యాంగానికి మొదటి సవరణపై దాడిచేశారు. ఇది 1951 జూన్ 18 నుండి అమలులోకి వచ్చిందని ఆరోపణ చేశారు అని ధ్వజమెత్తారు. ఈ సవరణను ఎందుకు తీసుకువచ్చారో వివరి స్తూ మూడు కారణాల వల్ల చేశామని తెలిపారు. ఒకటి అత్యంత సున్నితమైన సమయంలో మత ప్రచారాన్ని ఎదుర్కోవడం, రెండవది కొట్టివేయబడుతున్న జమిందారీ చట్టాలను రక్షించడం, కో ర్టులు విద్య, ఉద్యోగాలలో ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసిల రిజర్వేషన్లను తిరస్కరించడం నుంచి రక్షించడానికి చేయాల్సివచ్చిందని జైరాంరమేష్ చెప్పారు.

# దరఖాస్తు చేసుకున్న అందరికీ హజ్ యాత్రకు అవకాశం

## 17న జిల్లా హజ్ కమిటీల సమావేశం

## 22న తొలి హజ్ శిక్షణా శిబిరం



**హైదరాబాద్ :** దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఈ సారి హజ్ యాత్రకు అవకాశం లభించనుంది. అదే జరిగితే ఇది రాష్ట్ర హజ్ కమిటీ చరిత్రలో అద్భుతం అని చెప్పవచ్చు. రాష్ట్ర హజ్ కమిటీ ద్వారా హజ్ యాత్ర కోసం మక్కాను దర్శించుకునే అవకాశం లభించడం అంత తేలిక విషయం కాదు. కాని ఈ సారి రాష్ట్రం నుండి హజ్ ధరఖాస్తుల సంఖ్య కాస్త తగ్గింది. దేశవ్యాప్తంగా ఎంపికైన కొంత మంది చివరి క్షణంలో మక్కాకు వెళ్లేందుకు వెనక్కు తగ్గడంతో వెయిటింగ్ జాబితాలో ఉన్న వారికి అవకాశం లభిస్తుంది. 2025 హజ్ యాత్రకు రాష్ట్రం నుంచి దాదాపు 9 వేల మంది యాత్రికులు దరఖాస్తు చేసుకున్నారు. వారందరికీ మక్కాకు వెళ్లే అవకాశం లభించనున్నట్లు తెలుస్తోంది. ఏటా గరిష్టంగా 6 నుంచి 7 వేల మందికి మాత్రమే తీర్థ యాత్రలకు వెళ్లే అవకాశం లభించేది. ఈసారి రాష్ట్ర హజ్ యాత్ర కోటాను కేంద్రం పెంచింది. మరోవైపు దరఖాస్తులు తక్కువగా రావడంతో అందరూ హజ్ యాత్రకు వెళ్లే అవకాశం వచ్చింది. ఈ ఏడాది హజ్ కమిటీకి 9,011 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో డ్రా ద్వారా 6,519 మందిని ఎంపిక చేయడం జరిగింది. తొలి విడుత హజ్ రుసుము 1,30,000 చెల్లింపు గడువు ముగిసిన తర్వాత దేశ వ్యాప్తంగా డబ్బు చెల్లించని వారిని మినహాయించడంతో ఆ స్థానాలను వెయిటింగ్‌లో ఉన్న వారితో భర్తీ చేయడం జరిగింది. దీని ప్రకారం కేంద్ర హజ్ కమిటీ మన రాష్ట్రం నుంచి వెయిటింగ్ లీస్ట్‌లో ఉన్న 1631 మందిని హజ్ యాత్రకు అవకాశం కల్పించింది. దీంతో రాష్ట్ర హజ్ కమిటీ నుండి హజ్ యాత్రకు ఎంపికైన వారి సంఖ్య 8,150కి చేరుకుంది. తొలివిడుత హజ్ రుసుము చెల్లించిన వారు ఈ నెల 16 లోగా రెండో విడుత హజ్ రుసుము రూ. 1,42,000 చెల్లించాల్సి ఉంది. వెయిటింగ్ లీస్ట్ నుండి ఎంపికైన 1631 మంది ఈ నెల 16 లోగా రెండు విడుతులుకలిపి ఒకేసారి రూ.2,72,300 చెల్లించాల్సి ఉంది. మూడో విడుత చెల్లింపు తర్వాత ప్రకటించడం జరుగుతుంది. అయితే రెండు విడుతలు చెల్లింపు గడువు పూర్తైన తర్వాత దేశ వ్యాప్తంగా డబ్బు చెల్లించిన వారి సంఖ్యను సరి చూసుకొని వెయిటింగ్‌లో ఉన్న వారిని తీసుకునే అవకాశం ఉంది. ఈ ప్రకారం మన రాష్ట్రం నుండి కేవలం 861 మంది మాత్రమే వెయిటింగ్‌లో ఉండడంతో అందరికి హజ్ అవకాశం లభిస్తుందని భావిస్తున్నారు. 2024 హజ్ యాత్రకు 11 వేల దరఖాస్తులు వచ్చాయి. వీరిలో రాష్ట్రం నుంచి 7,500 మందికి మాత్రమే పాదయాత్రకు అవకాశం లభించింది. సెంట్రల్ హజ్ కమిటీ 2025కి రాష్ట్ర హజ్ యాత్రికుల కోటాను పెంచింది, వచ్చే ఏడాది జూన్ 4 నుంచి 9వ తేదీ వరకు హజ్ యాత్ర కొనసాగనుంది. కాగా ఈ నెల 17న రాష్ట్ర హజ్ కమిటీ కార్యాలయంలో జిల్లా హజ్ సొసైటిల అధ్యక్ష, కార్యదర్శులు సమావేశం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర హజ్ కమిటి చైర్మన్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుంది. ఈ నెల 22న హైదరాబాద్ మలక్‌పేట్‌లోని హైటెక్ గార్డెన్‌లో తొలి హజ్ శిక్షణా శిబిరం నిర్వహించనున్నారు. ఇందుకు ఇప్పటికే రాష్ట్ర హజ్ కమిటీ ఏర్పాట్లు చేసింది.

## ఆపరేటర్‌గా పనిచేయడం ఇష్టం లేక

# చేతివేళ్లు నరుక్కున్న వ్యక్తి



**అహ్మదాబాద్:** బంధువుకు చెందిన సంస్థలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఆ జాబ్ పట్ల విసిగిపోయాడు. పని మానేయడంపై తన బంధువుకు చెప్పే ధైర్యం చేయలేకపోయాడు. దీంతో కంప్యూటర్ ఆపరేటర్ పనికి అనర్హుడయ్యేందుకు తన చేతి వేళ్లను నరుక్కున్నాడు. చేతబడి కోసం ఎవరో ఈ పని చేసినట్లు నమ్మించేందుకు ప్రయత్నించాడు. గుజరాత్‌లోని సూరత్‌లో ఈ సంఘటన జరిగింది. 32 ఏళ్ల మయూర్ తారాపరా తన బంధువుకు చెందిన వజ్రా ల సంస్థలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆ పని పట్ల విసిగిపోయిన అతడు జాబ్ మానేయాలనుకున్నాడు. అయితే ఈ విషయాన్ని బంధువుకు చెప్పే ధైర్యం చేయలేకపోయాడు. కాగా, డిసెంబర్ 8న రాత్రి పది గంటల సమయంలో బైక్‌పై స్నేహితుడి ఇంటికి తారాపరా బయలుదేరాడు. అమ్రోలిలోని వేదా ంత సర్కిల్ సమీపంలోని రింగ్‌రోడ్ వద్ద బైక్ ఆపాడు. కొనుగోలు చేసిన పదునైన కత్తితో ఎడమ చేతిలోని నాలుగు వేళ్లను నరుక్కున్నాడు. నరుక్కున్న వేళ్లను, కత్తిని ఒక సంచిలో ఉంచి దూరంగా విసిరేశాడు. రక్తం కారకుండా మోచేతి దగ్గర తాడు కట్టుకున్నాడు. ఫ్రెండ్స్‌కు ఫోన్ చేయగా అక్కడకు వచ్చి అతడ్ని హాస్పిటల్‌కు తరలించారు. మరోవైపు బైక్‌పై వెళ్తున్న తనకు కళ్లు తిరగడంతో అక్కడ అచేతనంగా పడిపోయినట్లు పోలీసులకు తారాపరా తెలిపాడు. పది నిమిషాల తర్వాత స్పృహలోకి వచ్చినప్పుడు ఎడమ చేతి నాలుగు వేళ్లు నరికివేయడాన్ని గమనించినట్లు చెప్పాడు. చేతబడి కోసం ఎవరో ఈ పనిచేసినట్లు అనుమానం వ్యక్తం చేశాడు. తారాపరా ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును క్రైమ్ బ్రాంచ్‌కు అప్పగించారు. కాగా, ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలించారు. సాంకేతిక, నిఘా ఆధారాలు సేకరించారు. దీంతో తన చేతి వేళ్లను నరుక్కున్నట్లు పోలీసులు తెలుసుకున్నారు. కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేయడం ఇష్టం లేక ఇలా చేశాడని పోలీస్ అధికారి తెలిపారు. ఒక బ్యాగ్‌లో మూడు వేళ్లు, మరో బ్యాగ్‌లో కత్తిని కనుగొని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# సాహితీ విహారి

# తెలుగులో కమ్యూనిస్టు ఉద్యమగీతాలు 2

### ఎర్రజెండా పాటలు


ఎస్వీ సత్యనారాయణ

తుమ్మల వెంకటరామయ్య రాసిన తొలి ఎర్రజెండా గీతాన్ని గురించి చర్చించుకున్నాం. తరువాతి కాలంలో కమ్యూనిస్టు ఉద్యమవ్యాప్తితో బాటు అనేక ఎర్ర జెండా గీతాలు తెలుగుభాషలో వెలువడ్డాయి. వాటిలో బాగా ప్రఖ్యాతిచెంది, ప్రజల నోళ్ళలో గూళ్ళు కట్టుకున్న పలు గీతాలున్నాయి. 1954లో పార్లమెంట్‌లో ఒక సభ్యుడు ఎర్రజెండాను విదేశీయమైనదిగా విమర్శించాడు. అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ కూడా దాన్ని సమర్థించాడన్న వార్తను విని రాంభట్ల కృష్ణమూర్తి, ఒక 'ఎర్రపాట' ను రాశారు.

చిట్టీత పండెరుపు  చిలక ముక్కెరుపు
పసిపాప నవ్వెరుపు  పాల బుగ్గెరుపు
పగడాల దండెరుపు  ప్రత్యూషమెరుపు
రానున్న రేపెరుపు  ప్రాణ కాంతెరుపు
శ్రమ ఎరుపు క్షమ ఎరుపు  శాంతి సుఖమెరుపు
పాటు పడువారి పోరాటాలు ఎరుపు
ఎర్రజెండా నాది  ఈ భూమి నాది
నిండు హృదయం నాది  స్నేహితము నాది

అనే గీతంలో సూర్యోదయం మొదలు సూర్యాస్తమయం వరకు ప్రకృతిలో ప్రత్యక్షమయ్యే 'ఎరుపు'ను, జీవన సౌందర్యానికి ప్రతీకగా నిలిచిన 'ఎరుపు'ను రాంభట్ల వర్ణించారు. దాదాపు ఇదే పాట చూపిన బాటలో చెరబండరాజు..

కష్టజీవుల నెత్తురెరుపూ
కమ్యూనిస్టు జెండ ఎరుపూ

అని ప్రారంభమయ్యే గీతం 'ఊపిరి'లో, సమాజ సంపద పై శ్రమజీవులకు అధికారం దొరికేదాక, ఎర్రజెండా నీడ కింద ఆయుధాలు దించకుండా సాయుధ పోరాటం సాగించమని ప్రబోధించారు. 'ఎరుపు' సూర్యోదయానికి సంకేతం. కానీ కొందరికి ఎరుపంటే భయం. అలాంటి వారిని ఆక్షేపిస్తూ పెన్నూ గన్నూ పట్టిన ప్రజాకవి సుబ్బారావు పాణిగ్రాహి రాసిన గీతం గోడలమీద నినాద గీతంగా రూపొందింది.

ఎరుపంటే కొందరికి  భయం భయం
పసిపిల్లలు వారికన్న  నయం నయం

ఈ గీతంలో మన మనసులోనే ఎరుపు ఉందనీ, మన రక్తంలోనూ ఎరుపు ఉందని, ఎరుపులోనే మెరుపు ఉందనీ, పోరాడే శక్తి ఉందనీ ఆ కవి గానం చేశారు.

ఇక 'ఎర్రజెండా'ను గురించి వెలువడిన కొన్ని ప్రసిద్ధ గీతాలను ఉదహరించడం అవసరం.

ప్రజా నాట్యమండలి కవిగా, కళాకారుడిగా విశేషమైన కృషి చేసిన ముక్కామల నాగభూషణం రాసిన 'ఎర్ర జెండా' గీతంలో..

'వేగరావోయ్ కార్మికా  వేగరావోయ్ కర్షకా
కలిసి మెలిసి  పలకవోయ్ అరుణ పతాకకు జై
జైజైజై  అరుణ పతాకకు జై
కత్తులు దూసుకుపోయినా  నెత్తురుటేరులు పారినా
ఎత్తిన జెండా దించకోయ్  అరుణ పతాకకు జై ॥అరుణ॥
బాంబుల వర్షం కురిసినా  బారు ఫిరంగులు మ్రోగినా
ఎత్తిన జెండా దించకోయ్  అరుణ పతాకకు జై ॥అరుణ॥
పీడిత ప్రజల రక్తమున్ త్రాగెడివారలు బెదరగన్
ఆకసమందున ఎగరెడి  అరుణపతాకకు జై ॥అరుణ॥'

అనే కమ్యూనిస్టు చైతన్యాన్ని వ్యక్తీకరించారు. ఎత్తిన జెండా దించవద్దని ఎలుగెత్తి నినదించారు. 1960–70 మధ్య కాలంలో యువజన సమాఖ్య, విద్యార్థి సమాఖ్య ఊరేగింపుల్లో మార్చింగ్ గీతంగా ఈ పాట మారుమ్రోగేది.

'జై యనరా కార్మిక, జై యనరా కర్షకా
జై జైయని జగమంతట జయపతాక నెగరవేస్తూ
జై యనరా జై జై యనరా, జై అరుణపతాకకు జై'

అంటూ సుద్దాల హనుమంతు రాసిన గీతంలో తరతరాల పీడిత ప్రజల దాస్యబంధాలను తెంచి, ఉన్నత మానవతా సమాజాన్ని నిర్మించే దారి చూపే జెండాకు జేకొట్టమన్నారు. 1970 దాకా ముక్కామల, తుమ్మల వెంకటరామయ్యల ఎర్రజెండా పాటలు అనేక వేదికలపై, జనహృదయ వేదికలపై ప్రతిధ్వనిస్తే, 1970 నుండి ఏటుకూరి ప్రసాద్ రాసిన 'ఎర్రజెండా' పాట ఊరూరా, వాడవాడా మారుమ్రోగుతోంది. ఇప్పటికే అనేక ప్రజాసంఘాల గీతికా సంకలనాల్లో స్థానం సంపాదించుకున్న ఈ గీతంలోని కొన్ని చరణాలు మారి ఇతరుల గీతాల్లోనూ చోటు చేసుకున్నాయి.

'ఎర్రజండేరా తమ్ముడ! ఎర్ర జండేరా  మనది
ఎర్రజండేరో తమ్ముడ ! ఎర్రజెండేరా ॥ఎర్ర॥'

ఈ పల్లవితో ప్రారంభమయ్యే గీతంలో ప్రపంచవ్యాపితంగా ఎర్రజెండా సాధించిన విజయాలను ఏటుకూరి ప్రసాద్ ప్రజల భాషలో సరళమైన బాణీలో వివరించారు. ఈ కవి రాసిన గీతాలను 'ఎర్రజెండా' (పాటలు) పేరుతో ఆం.ప్ర. యువజన సమాఖ్య 1973 మేడే నాడు వెలువరించింది. 'ఎర్రబాట' పేరుతో మరో సంపుటి 1975జనవరిలో వెలుగు చూసింది. ఎర్రజెండా నీడ కింద ఎర్రబాటలో పయనిస్తూ ఎర్రపాటలు స్వయంగా గొంతెత్తి గానం చేసే ఏటుకూరి ప్రసాద్ 'ఎర్రజెండా కవి'గా ప్రఖ్యాతి పొందారు.ప్రసాద్ రచించినదే మరో గీతం 'ఎర్రజెండరా... త్యాగాల కందరా'. ఈ పాట కూడా విశేష ప్రాచుర్యాన్ని పొందింది. భారత కమ్యూనిస్టు పార్టీ, యువజన సమాఖ్య, విద్యార్థి సమాఖ్య, ఎఐటియుసి కార్మిక సంఘాలు తమ సమావేశాలకు, మహాసభలకు ముందు సభాస్థలిలో ఎర్రజెండాను ఎగరేస్తారు. అప్పుడు ప్రజానాట్యమండలి గాయనీగాయకులు 'ఎత్తరా మన ఎర్రజెండా' గీతాన్ని ఆలపిస్తారు. ప్రముఖ అభ్యుదయ కవి గజ్జెల మల్లారెడ్డి రాసిన ఈ గీతంలో...

'ఎత్తరా మన ఎర్రజెండా  ఎర్రకాంతులు దిశలు నిండా
ఎత్తరా  సంఘర్ష కీలల  అవతరించిన ఎర్రజెండా
॥ఎత్తరా॥
అమరవీరులు ధారబోసిన  అరుణ రక్తపుధార సాక్షిగ
సమసమాజము కొరకు పోరే  శ్రమిక విప్లవ దీక్షసాక్షిగ  ॥ఎత్తరా॥'

అంటూ ప్రారంభించి 'గుత్త పెత్తందారి దోపిడి వర్గ దుర్గాల్ దద్దరిల్లగ ఎత్తరా మన జెండా' అని పథ నిర్దేశం చేస్తున్నారీ కవి.

అలాగే మరో గీతంలో...

ఎవరెన్ని చెప్పినా  ఎవరెంత దెప్పినా
ఎర్రజెండా మనకు అండరా తమ్ముడా
ఎర్రజెండా మనకు అండరా తమ్ముడా!

అంటున్న మల్లారెడ్డి.. 'ఉక్కు పిడికిళ్ళెత్తి ఒక్కటై మనమంత గర్జించితే జైలు కటకటా లాగునా? లావా ప్రవాహాన్ని లాఠీలు ఆపునా?' అని సవాల్ జేస్తున్నారు. పెట్టుబడిదారీ వర్గంపై తుట్టతుదిపోరు సలపడానికి ఎర్రజెండా మనకు అండగా ఉంటుందంటున్నారు.1975 జనవరి 27 నుండి ఫిబ్రవరి 2 వరకు విజయవాడ నగరంలో 'భారత కమ్యూనిస్టు పార్టీ' 10వ జాతీయ మహాసభ జరిగింది. ఈ మహాసభ సందర్భంగా రాష్ట్ర వ్యాపితంగా ఎర్రజెండా జైత్రయాత్ర నిర్వహించబడింది. అప్పుడు ఎర్రజెండా జైత్రయాత్ర గీతాలనేకం వెలువడ్డాయి.

అదే అదే పతాక జైత్రయాత్ర సాగుతోందిరా
పదే పదే రణానికై నగార మ్రోగుతోందిరా
ధగ ద్ధగ ద్ధగ ప్రభన్  పతాక సాగుతోందిరా
ధిమి ద్ధిమి ద్ధిమి ద్వనిన్  నగార మ్రోగుతోందిరా

అంటూ రాంభట్ల కృష్ణమూర్తి రాసిన జైత్రయాత్ర గీతం ఎర్రజెండాతో బాటు ఊరూరా విజయయాత్ర చేసింది. మహారుణ స్రవంతిలా తెలుగు నేల నాలుగుచెరుగులా ప్రవహించింది.మరో గీతాన్ని ఏటుకూరి ప్రసాద్ రాశారు.

కదిలెనదే ఎర్రజెండ ప్రజల ఆశయాలు పండ
వాడవాడ జనం ఎదురు రండిరా  అడుగడుగునహారతు లెత్తండిరా

ఈ పల్లవితో సాగే 'ఎర్రపాట' అమర వీరుల ఆశయాలను ప్రజలు నెమరువేసుకోడానికి తోడ్పడింది.

అలాగే అక్షరాల్లో అగ్ని కురిపించే అభ్యుదయకవి కె.రాజేశ్వరరావు

నీలి నీలి గగనంలో నిప్పులు విరబూసెరా
అరుణారుణ కాంతిధార  అవనిపైన కురిసెరా

అంటూ అరుణకాంతి ధారల్ని వర్ణించారు. 'గుత్తధనోన్మత్త శక్తుల' గుండెలదిరేలా గర్జించారు.

ఇకపోతే ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, రాడికల్ స్టూడెంట్స్ యూనియన్, విప్లవ రచయితల సంఘం, జన నాట్యమండలి కార్యక్రమాల్లో ప్రతిధ్వనించే 'ఎర్రజెండా' గీతంలో...

సుత్తీ కొడవలి గుర్తుగవున్నా
ఎర్రని జెండా ఎగురుతున్నది
ఆకాశంలో అరుణబింబమై
పీడితజనాని కండదండగా  ॥సుత్తీ ॥

అనే పల్లవితో ప్రారంభమై, పెట్టుబడులను దోచుకొని దాచు ద్రోహుల గుండెల్లో అగ్నికణములను చెరుగుతూ, నిరుపేద జనానికి పెన్నిధిగా పేరెన్నిక గన్న పతాకం వర్ణింపబడింది.

ఎర్రజెండెర్ర జెండన్నియ్యలో  ఎర్రెర్రనిదీ జెండన్నియ్యలో పేదల పాలిటి ఎన్నియ్యలో  మరి పెన్నిధి ఈ జెండన్నియ్యలో

గీతం విప్లవ విద్యార్థి సంఘాల సమావేశాలకు కొత్త వెలుగులను ప్రసాదిస్తూ ఉంది. అల్లం వీరయ్య రాసిన గీతమిది.

నక్సల్‌బరి నుండెన్నీయలో  మరి నాలుగు
దిక్కులె న్నీయలో
పోరూ సాగంగెన్నీయలో  మరి
పోరూ మార్గం లెన్నీయలో
ఒరిగిన అన్నల కెన్నీయలో
మన ఎర్రని దండా లెన్నీయలో

అంటూ సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమర వీరులకు ఎర్రని దండాలు పెట్టే గీతమది.

తినడానికి తిండి, కట్టడానికి గుడ్డలేని నిరుపేద జనాన్ని సంబోధిస్తూ సుబ్బారావు పాణిగ్రాహి...

ఎడమచేత పట్టవోయి ఎర్రని జెండా
తుపాకి పట్టవోయి వేరొక చేతా
ఇడుములు రాకుండ ముందు  నడుముకట్టి నిలవవోయ్
చేయి చేయి కలిపి వేగ  ముందుకడుగు వేయనోయ్

అనే గీతంలో మార్క్స్ రాసిన సిద్ధాంతాన్ని, లెనిన్ చూపిన ఆశయాన్ని, స్టాలిన్ చూపిన సంకల్పాన్ని ఆదర్శంగా పెట్టుకుని, వర్గరహిత సమాజాన్ని నిర్మించడానికి ఎడమచేత్తో ఎర్రని జెండా, కుడిచేత్తో తుపాకి పట్టి నడవమని పోరాటమార్గాన్ని నిర్దేశించారు. ఆ వీరుడే మరో గీతంలో...

ఓ అరుణ పతాకమా! చేకొనుమా రెడ్ శాల్యూట్
శ్రమజీవుల కేతనమా! నీకిదిగో రెడ్ శాల్యూట్

అంటూ మృతవీరుల త్యాగాల ప్రతీకగా నిలిచిన అరుణ పతాకానికి అరుణాంజలి ఘటించారు.

ఇంకా ఇక్కడ ప్రస్తావించని ఎన్నో ఎర్రజెండా పాటలు ప్రజల ఎదల్లో పోరాటపు ఊపిర్లు పోస్తున్నాయి. తిరుగుబాటు తత్వాన్ని ప్రబోధిస్తున్నాయి.

### అమరవీరుల స్మృతిగీతాలు

మన దేశంలో 'కమ్యూనిస్టు ఉద్యమం' ప్రారంభమైన నాటినుండి నేటి వరకు కొన్ని వేలమంది వీరులు అమరులయ్యారు. కొందరు పోరాటంలో నేల కొరిగితే; మరి కొందరు పోలీసుల తుపాకుల గుళ్ళకు బలయ్యారు. ఇంకా కొందరు బూటకపు ఎన్‌కౌంటర్లు, పోలీసుల చిత్రహింసలకు గురయి, ప్రాణాలొదిలారు. వీరిని స్మరిస్తూ వామపక్ష కవులు వందలాది స్మృతిగీతాలు రాశారు. కొన్ని గీతాల్లో అమరవీరుల పేర్లు లేకుండా, అమరులందరినీ స్మరించడం కనిపిస్తుంది. మరి కొన్ని గీతాల్లో అమరవీరుల్లో ప్రముఖంగా కనబడుతున్న వారి పేర్లు ప్రస్తావించబడ్డాయి. ఇంకా కొన్ని గీతాలు ఒకే ఒక వీరుడ్ని స్మరిస్తూ, అతని పోరాట నిబద్ధతనీ త్యాగాన్నీ కొనియాడుతూ అక్షరాంజలి ఘటించినవి కనబడుతున్నాయి. వందలాది గా వెలువడిన పాటలన్నింటినీ ఇక్కడ పేర్కొనడం సాధ్యం కాదు కాబట్టి బాగా ప్రాచుర్యాన్ని పొందిన కొన్ని గీతాలను తీసుకొని పరిశీలించడం జరుగుతున్నది. మృతవీరులకు 'లాల్ సలామ్' చెప్పిన రాంభట్ల కృష్ణమూర్తిగారి గీతంలో...

'మృతవీరులారా లాల్ సలాం  ఇదే మా లాల్ సలామ్
లాల్ సలాం లాల్ సలాం  ॥మృత॥
దరిలేని బానిస చాకిరీ  నరహంతకుల గుండాగిరీ
ఇక వద్దని ఇది రద్దని  పోరాడి నేలకు ఒరిగినా
రణధీరులారా లాల్ సలాం  లాల్ సలాం లాల్ సలాం  ॥మృత ॥
మతమూఢ విశ్వాసాలను  కులజాతి విద్వేషాలను
నిరసించుతూ ఎదిరించుతూ  పోరాడి నేలకు ఒరిగినా
యువశూరులారా లాల్ సలాం  లాల్ సలాం  లాల్ సలాం  ॥మృత॥
శ్రమశక్తి దోపిడీదారుని  సమరాల గుత్తకుబేరుని
అరికట్టుతూ  హతమార్చుతూ  పోరాడి నేలకు
ఒరిగి నా శ్రమజీవులారా లాల్ సలాం లాల్ సలాం
లాల్‌సలాం  ॥మృత॥
చిరశాంతి భువి నిండాలనీ  నరజాతి కల పండాలనీ
యుగ స్రష్టలై కమ్యూనిస్టులై  పోరాడి నేలకు ఒరిగినా
ధృవతారలారా లాల్ సలాం  లాల్ సలాం లాల్ సలాం
॥మృత॥




బానిస చాకిరీకి, మత మూఢవిశ్వాసాలకు, కుల జాతి విద్వేషాలకు, పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతూ నేలకొరిగిన వీరులకు లాల్ సలాం సమర్పించడం జరిగింది.

మరొక వామపక్ష కవి (ఎస్వీ) అమరవీరులకు లాల్ సలాం చేస్తూ...

నిదురించే మనజాతిని  కదిలించిన వీరులార!
స్వేచ్ఛ కొరకు కదనానికి  నడిపించిన ధీరులార!
కాలం కంటే ముందుకు  నడిచిన యుగతారలార!
ఎర్రెర్రని వందనాలు  అందుకోండి లాల్ సలాం

అనే గీతంలో తెల్లపాలనకూ, నిజామ్ రాజరికానికి, భూస్వామ్య దోపిడికి, ధనస్వామ్య పీడనకూ వ్యతిరేకంగా పోరాడుతూ నలిగిన జన శ్రేణులకు ఎర్రెర్రని వందనాలు చేశారు.

మరో గీతంలో....

ఉద్యమాలు ఊపిరిగా  పోరాటం ప్రాణంగా
కమ్యూనిజం సాధనలో  కనుమూసిన వీరులార!
అన్నలారా! మీకూ  మా ఎర్రదండాలు
అమరులారా! మీకూ  ఎర్రెర్ర దండాలు
అంటూ ఉద్యమాల్లోనే కొన ఊపిరి విడిచిన
కామ్రేడ్లందరికీ ఈ కవి ఎర్రెర్ర దండాలు సమర్పించారు.

ఆట, పాట, మాటల విశిష్ట సమ్మేళనం గద్దర్. విప్లవ గీతాలకు ఒరవడి దిద్దిన ఐదుగురు అగ్రశ్రేణి కవిగాయకుల్లో గద్దర్ ఒకరు.

భూమికొరకు భుక్తి కొరకు మనదేశ విముక్తికొరకు
సాగే ప్రతిపోరులోన  సాహసులై పోరాడిన
విద్యార్థి వెలుగులార  వీరులార శూరులార
కోట్లాది శ్రమజీవుల  లాల్ సలామ్ లాల్ సలామ్

ఈ గీతంలో... ప్రజాయుద్ధ పంథాకు ప్రాణమై వెలుగుతూ సాయుధ పోరాటానికి సమిధలైన వీరులందరికీ గద్దర్ పేరుపేరునా లాల్ సలాం చెప్పారు.

మరో గీతంలో ఒక అజ్ఞాతకవి కూడులేని కూలోళ్ళకు, గూడులేని పేదోళ్ళకు తిరగబడే దారిని చూపుతూ, అసువులర్పించిన అమరవీరులకు...

జోహార్లు జోహార్లురా  ఓ అన్నలార
మా విప్లవ జోహార్లురా మా అన్నలార
ఎర్రెర్రని జోహార్లురా

అంటూ దాదాపు 21మందికి పైగా వీరుల పేర్లను స్మరిస్తూ జోహార్లు చెప్పాడు.

'నర్రెంగ సెట్టుకింద నరుడో  ! భాస్కరుడా!
కన్నెర్రసేస్తివయ్య నరుడో  ! భాస్కరుడా!
కన్నెర్రసేసి నీవు నరుడో  ! భాస్కరుడా!
కదనాన దూకితివా నరుడో  ! భాస్కరుడా!
బర్రెంక సెట్టుకింద నరుడో  ! భాస్కరుడా!
బందూకు పట్టివయ్య నరుడో  ! భాస్కరుడా!
బందూకు సేతబట్టి నరుడో  ! భాస్కరుడా!
బంధాలు తెంచ్తివయ్య నరుడో  ! భాస్కరుడా!'

అంటూ చాగంటి భాస్కరరావుపై శివసాగర్ ప్రభావవంతమైన స్మృతిగీతం రాశాడు. ప్రజానాట్యమండలి వారి 'ప్రతి ధ్వని'లోనూ, విజయలక్ష్మి స్మారక ట్రస్టు వారి 'ఎర్రజెండా పాటలు' (సంకలనం)లోనూ ఆరుట్ల రామచంద్రారెడ్డి మొదలైన కమ్యూనిస్టు వీరయోధులపై, డాక్టర్ రాజారావు, సుంకర, సి.మోహన్‌దాస్ మొదలైన ప్రజా కళాకారులపై రాసిన స్మృతిగీతాలు ప్రచరితమయ్యాయి. విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవయుగ, యువజన, అభ్యుదయ, సృజన, అరుణతార, ప్రజాసాహితి, మిలిటెంట్ మొదలైన పత్రికల్లో వందలాది అమర వీరుల స్మృతి గీతాలు అచ్చయ్యాయి. ప్రజోద్యమాలలో క్రియాశీలంగా పాల్గొంటూ, ఉద్యమాలకే ఊపిరులూదిన అమరవీరులను స్మరించ దం, విషాదాన్ని ప్రకటించడమే కాక విప్లవాశయాలకు పునరంకితం కావాలన్న ప్రతిజ్ఞ చేయడం ఈ స్మృతిగీతా ల్లో ప్రధానంగా కనపడుతుంది. ప్రజల కళ్ళల్లో కన్నీళ్ళ నూ, గుండెల్లో పోరాట నిబద్ధతనూ నింపగలుగుతున్న ఈ గీతాలు వామపక్ష భావాల వ్యాప్తికి దోహదం చేస్తున్నాయి.

### పార్టీ ప్రచార గీతాలు

వామపక్ష పార్టీలు నడుపుతున్న పోరాటాల్లో వాటి ఆశయాలను, ఆదర్శాలను వ్యక్తీకరించే పాటలు వెలువడుతూనే ఉంటాయి. అయినప్పటికీ ఈ పార్టీలను గురించి, పార్టీల సిద్ధాంతాలను గురించి ప్రజలకు పరిచయం చేయడానికి ప్రగతిశీల కవులు 'పార్టీ ప్రచారగీతాలను' కూడా రాస్తుంటారు. సమావేశాల్లో, సభల్లో, ఊరేగింపుల్లో ఈ ప్రచారగీతాలు ఊపందుకుంటూ ఉంటాయి.

పదండి పీడిత మానవులారా!
పదండి శ్రామిక సైనికులారా!
కార్మిక వర్గపు అగ్రదళం మన
కమ్యూనిస్టు పార్టీ పిలిచింది
ప్రభంజనంలా ఉధృతంగా
ప్రజానీకమే కదిలిందీ  ॥పదండి॥

అనే 'పిలుపు'లో... సమ్మెలు, హర్తాళ్ళు, బంద్, ఘెరావ్ వంటి సమస్త రీతుల పోరాటాల్లో కాకలుతీరిన కార్మిక యోధులను కమ్యూనిస్టు పార్టీ ఆహ్వానిస్తున్నదని గజ్జెల మల్లారెడ్డి వివరిస్తున్నారు.

వామపక్ష ప్రజాతంత్ర శక్తులు జరుపుతున్న పోరాటాల మలుపులన్నింటిలో ప్రతిస్పందిస్తూ కనిపించే అభ్యుదయ కవి మల్లిక్.

కమ్యూనిస్టు పార్టీ అంటె  కష్టజీవి పార్టీరా
విప్లవాన్ని తెచ్చితీరు  ఎర్రజెండ పార్టీరా

అంటూ చీలికవాదాలు ఉద్యమానికి ఎన్ని చికాకులు కల్పించినా, శ్రామికవర్గ కవచమైన ఐక్యతను నిలబెట్టమని ఉద్బోధిస్తున్నారు.

కూలినాలి జనుల  కూటమిగ నిలబెట్టి
జాలి బతుకుల్లోన  జ్వాలలను రగిలించి
కదిలినడిపే పార్టీరా మన పార్టీ
కమ్యూనిస్టు పార్టీరా

అనే గీతంలో అభ్యుదయకవి చైతన్యప్రసాద్ కుల, మత, ప్రాంతీయ దురహంకారాలకు వ్యతిరేకంగా పార్టీ నడిపిన పోరాటాలను వర్ణించారు.

పుడమితల్లి పొత్తిటిలో  పుష్పించిన మందారం
అంధ తమో వారాసిని  ప్రభవించిన అంగారం!
జనించింది నా పార్టీ  శ్రమజీవుల కాయుధమై
అగణిత పీడిత జనగణ  ఆశయ ప్రతిరూపమ్మై

అంటూ ప్రారంభించి 115 పాదాల దీర్ఘగీతాన్ని కె.రాజేశ్వరరావు రాశారు. సైనిక బలగాలు, పాలకుల శాసనాలు, చెరసాలలు, ఉరికొయ్యలు పార్టీ పురోగమనాన్ని ఆపలేవనే దృఢ సంకల్పాన్ని చాటి చెప్పారు.

ఇప్పుడు రాష్ట్రమంతటా యువజన విద్యార్థులు, కార్మిక కర్షకులు ఉత్సాహంగా పాడుకుంటున్న (ఎస్వీ) పార్టీ ప్రచార గీతం 'ప్రజోద్యమాలనేత' శీర్షికన 1985 డిసెంబర్‌లో 'విశాలాంధ్ర' పత్రికలో ప్రచురితమయింది.

శ్రమజీవుల పోరులోన  ఉద్యమాల హోరులోన
ఎర్రజెండ నీడకింద  ఎదురు తిరుగు జాడలోన
పుట్టిన పులిబిడ్డరో  భారత కమ్యూనిస్టు పార్టీ
ప్రజల జీవగడ్డరో  భారత కమ్యూనిస్టు పార్టీ ॥శ్రమ॥

ఈ పల్లవితో ప్రారంభమై తెల్లదొరలను తరిమికొట్టిన ఉక్రోషంగా, నిజాం నవాబును గద్దె దించిన తిరుగుబాటుగా, ధనస్వాములపై ధ్వజమెత్తే ఉద్రేకంగా, భూస్వాముల పీడనపై బుసకొట్టే ఉద్వేగంగా 'పార్టీ' వర్ణింపబడింది.

దిక్కు మొక్కులేని జనం  ఒక్కొక్కరు అగ్నికణం

అనే విప్లవ తీవ్ర నినాదాన్నందించిన ప్రజాకవి పాణిగ్రహి

కష్టజీవులం మేము కమ్యూనిస్టులం
ఔనన్నా కాదన్నా అదే యిష్టులం

అనే గీతాన్ని రచించారు. ఊరూరా వాడవాడలా విశేష ప్రచారాన్ని పొందిన ఈ గీతంలోనే...

అరెస్టులను సాగించి  ప్రజాశక్తి నడ్డలేరు
అరచేతిని అడ్డుపెట్టి  సూర్యకాంతి నాపలేరు

అని ఎలుగెత్తి నినదించారు. పాలకవర్గాలను, పోలీసు అధికారాలనూ హెచ్చరిస్తూ ఈ నినాదంలో కవితానాదాన్ని ప్రతిధ్వనింపజేశారు.

ఇవీ మచ్చుకు కొన్ని కమ్యూనిస్టు ఉద్యమగీతాలు. ప్రజాచైతన్య ప్రతీకలు.

అభ్యుదయ కవి బాబ్జీ రాసినట్టుగా
'ఒక్క రోజైనా, ఒక్క సాయయినా
కమ్యూనిస్టుగా బ్రతుకు నేస్తమా!
ఆగొప్ప నీకు తెలుస్తుంది మిత్రమా!

సమాప్తం...

---

### అరుదైన ఫొటో



సోవియట్ క్రియేటివ్ అవాంట్-గార్డ్ ప్రతినిధులు మయకోవ్‌స్కీ, పాస్టర్నాక్, లిలియా బ్రిక్, ఐసెన్‌స్టెయిన్ తదితరులతో జపనీస్ ప్రముఖ రచయిత టమీజ్ నైటో. ఈ ఫొటో 1924 సంవత్సరం నాటిది. ఎల్లలులేని సాహితీ సమాగమనానికి ఇదో మచ్చుతునక.

---

### ఈ వారం కవితలు

## ఎత్తరా మన ఎర్రజెండా

**చరణం!**
సమ సమాజ లక్ష్యం కోసం
సాగుతున్న సమరంలో
అమరులైన యోధులకు
అరుణారున వందనార్పిస్తూ
ఎత్తరా మన ఎర్రజెండా !

**పల్లవి!**
ఎత్తర ఎత్తర ఎత్తర
ఎర్ర జెండా ఎత్తరా
ఎత్తర ఎత్తర ఎత్తర
పోరు జెండా లెత్తర

శత వంతాల అరుణకేతనం
త్యాగ చరితము వాడవాడలో
ప్రతిధ్వనించగా ప్రశంసించగా
ఎత్తరా మన ఎర్రజెండా !

కార్మిక వర్గం చిందించిన
కవోష్ణ రక్తం కర్షకలోకం
చిలికిన స్వేద జలం
హక్కుల పోరులో
ఎరుపెక్కిన జండా  ॥ ఎత్తర ॥

కదం త్రొక్కిన ఎర్రసేనను
లెనిన్ నడిపిన విప్లవ జండ
చికాగో నగరంలో శ్రామికవర్గం
చిందించిన రక్తంలో
ఎరుపెక్కిన జండా

జర్మన్ హిట్లర్ జారురాజుల
కూకటి వేళ్ళతో కూల్చిన జండా
సామ్రాజ్య వాధులకు
సింహస్వప్నమై
క్యూబా గడ్డపై ఎగిరిన జండా

బానిస బతుకుల బంధీఖానా
నిజాంపాలనపై సాయుధపోరుకు
సైయంటూ రావి బద్దం ముఖంలు
తొడగొట్టి ఎదిరించిన
ఎర్రని జెండా  ॥ ఎత్తర ॥

జైలు గోడలు దద్దరిల్లగ
జంగ్ నడిపిన ధర్మబిక్షం
నల్లమల పోరుసింగం
గిరి అణభేరి నల్లా
నర్సింహులు ఆరుట్ల
సాగించిన సాయుధ సమరం

పల్లె పల్లెన పోరుబిడ్డలు
ఎత్తిపట్టిన ఎర్రనిజెండరా
ఐదువేల మృత వీరుల
అరుణరక్తం ధారబోసిన
సాయుధ పోరు జండరా

అంబరాన ఆ అమర వీరులు
అరుణతారలై దారిచూపగ
అవని పైన కమ్యూనిష్టులు
క్రాంతికారులై కదం తొక్కగ
॥ ఎత్తర ॥

మతోన్మాదం మట్టి కరవగ
దోపిడి శక్తుల వెన్ను విరయగ
విప్లవ శంఖం పూరిస్తూ
ఎత్తిపట్టరా శత వసంతాల
మన ఎర్రెర్రని జండా !
॥ఎత్తర ॥

బొమ్మగాని నాగభూషణం

---

## కలిసి పోరాడుదాం కామ్రేడా..!

**పల్లవి**
కలిసి పని చేద్దాం కామ్రేడా...
గతమెంతో మన కీర్తి గలవోడా...
కలిసి పని చేద్దాం కామ్రేడా...
గతమెంతో మన కీర్తి గలవోడా

జండెత్తి లేవరా కామ్రేడా...
జనమంతా మన తోడు కామ్రేడా...
చీలిపోయిన మనము...
ఒక్కటై కలిసుంటే...

ఉక్కు పిడికిళ్లెత్తి ఉద్యమాలు చేస్తూ..
సర్కారు గుండెలో గునపమై ఉంటము
పోరాటమొక్కటే కామ్రేడా...
కలిసి పోరాడుదాం కామ్రేడా...

వీర రక్తపుధార పారబోసిన నేల...
నైజాం రాజును ఉరికించిన నేల...
సాయుధపోరులో సమరాలు నడిపింది
వీరాదివీరులను కోలిపోయి నిలిచింది

ప్రజల పార్టీ మనది కామ్రేడా...
కలిసి పోరుదాం కామ్రేడా...
మార్క్సిస్టు లెనినిస్ట్.. లెఫ్టిస్ట్ పార్టీలు
చంద్ర పుల్లారెడ్డి.. కామ్రేడ్ ఓంకార్

విడిపోయినొళ్ళంతా ఎవరోయి...
చంద్ర రాజేశ్వరుడు
కామ్రేడ్ సుందరయ్య మనవారే
సిపిఐ, సిపిఎం ఒక జెండా
బిడ్డలే కామ్రేడా...

ముక్కలైన జెండా ఒకటైతే సూడు...
ఉడుము పట్టు మనము కలిగుంటము
మేధావి వర్గము మనతోడు ఉండును

పంతాలు వీడరా కామ్రేడా...
ప్రగతి బాట పట్టు కామ్రేడా...
పదవి వ్యామోహం వొదలండి..
ప్రజల కొరకు పోరు నడపండి..

విడిపోయి చెడిపోకు కామ్రేడా...
కలిసి పోరాడుదాం కామ్రేడా..
అవినీతి పాల అంతమొందువరకు..
పోరు పిడికిళ్లెత్తి పోలికేక పెడుదాం

పోరాట ఫలితాలు
దండిగుండు మనకు
సమయమిదే మనది కామ్రేడా...
సందిగ్ధమొద్దిక కామ్రేడా...
కలిసి పని చేద్దాం కామ్రేడా...

నైజాముల మించిపోయే
సర్కారు పనితీరు...
జనమంతా ఒక్కటై చేస్తున్నరు పోరు...
అంతులేని దోపిడి...అక్రమాల పైన...
పెనుగాలి వీచింది...
పాపము పండింది

పోరు జెండా ఎత్తు కామ్రేడా...
కలిసి పోరుదాం కామ్రేడా...
భవిష్యత్ మనదే కామ్రేడా...
బాధలుండవిక కామ్రేడా...

గడ్డమీది చంద్రమోహన్ గౌడ్
9866510399

---

## 'ఎర్ర జెండకు వందనం'

**పల్లవి**
ఉద్యమ చరిత కలిగిన జెండా...
పోరు నడిపిందీ ఎర్రని జెండా...
వందేళ్లు నింపుకున్న
అలుపులేని పోరు జెండా

దేశమంతా ఎగురుతుంది
జనం గుండెల నిండా
కార్మిక, కర్షకులకు
నిరంతరం నిలుస్తుంది అండా

కొంత మంది మేధావులు
ఉద్యమకారులు
ప్రజా మేలు కోరినొళ్ళు
వీరులు రణధీరులు
పందొమ్మిదొందల ఇరువై
ఐదులో.. డిసెంబరు నెల
ఇరువయ్యారు

భూస్వాముల గుండెలపై
రాతెత్తిన రణభేరి...
వందల ఎకరాల భూమి పంచి
నట్టి యుద్ధభేరి
నిషేధాల నదిగమించి
ప్రజా పోరు నడిపింది
ఆటంకాలెన్నోచ్చిన
ఎదురీది సాగింది..
నాటి నుండి నేటి వరకు
ప్రజా పక్షమే నిలిచింది

నియంత పాలన ఇక చెల్లదని
చెప్పింది పరాయి పాలనకు
చరమగీతం పాడింది
ప్రజా రాజ్యానికి పోరుకు
పిలుపు నిచ్చింది

ఆకలనే పదము లేని
పాలనకై  పుట్టింది
కోరుకున్న గమ్యాన్ని
చేరువరకు పోరుదాం
అణగారిన వర్గాలను
సంఘటితం చేయుదాం

అందరము ఐక్యంగా
పోరు పిడికిళ్లెత్తుదాం
రందీ లేని రాజ్యాన్ని
స్థాపించుకుందాం...

– అన్నపూర్ణాదేవి

# కలెక్టర్ జితేష్‌వి పాటిల్ చొరవతో 'రైన్ వాటర్ ప్రాజెక్ట్'

-స్టూడియో పంచ తంత్ర బృందాల విస్తృత పర్యటన





**ప్రజాపక్షం/పాల్వంచ టౌన్:** జిల్లాలో పర్యాటన రంగ అభివృద్ధిలో భాగంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ చొరవతో రైన్ వాటర్ ప్రాజెక్ట్ బృందం, స్టూడియో పంచ తంత్ర బృందం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. ఈపర్యటనలో భాగంగా బృందాలు ముందుగా కిన్నెర సాని అభయారణ్యంను సందర్శించారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సభ్యులకు కిన్నెరసానిలో ప్రత్యేకతల గురించి పర్యాటన రంగం అభివృద్ధి కోసం చేపడుతున్న పనులు, తీసుకోవాలసిన చర్యలు గురించి వివరించారు. అనంతరం కిన్నెరసాని ప్రాజెక్ట్‌లో బోటులో ప్రయాణించి ఆనంద ద్వీపంను సందర్శించారు. డ్రోన్ కెమెరా ద్వారా కిన్నెరసాని అభ్యయారణ్యం అందాలను బృంద సభ్యులు వీక్షించారు. అనంతరం కిన్నెరసాని ప్రాజెక్ట్ కేటీపీఎస్ కుడి కాలువలో పుట్టి ప్రయాణంను ప్రారంభించారు. అనంతరం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. తదుపరి గోదావరి ఘాట్‌ను సందర్శించారు. అనంతరం భద్రాచలం ఐటీడీఏ పరిధిలో నిర్మిస్తున్నటు వంటి గిరిజన మ్యూజియంను సభ్యులు సందర్శించారు. ఈసందర్భంగా గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు, గిరిజనులు ఉపయోగించే వస్తువులు, గిరిజనుల ప్రత్యేక వంటకాల గురించి బృందాలకు కలెక్టర్ వివరించారు. దుమ్ముగూడెం మండలంలోని పర్ణశాల రామాలయం, నార చీరల ప్రాంతం సందర్శించి అక్కడి స్థల పురాణం, ప్రత్యేకతలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బుజ్జిగుప్ప నారాయణరావుపేట గ్రామంలో బృంద సభ్యులు పర్యటించారు. అక్కడ పాతకాలం ఇళ్లను పరిశీలించి, కోయ భాష, గిరిజన సాంస్కృతి, కొమ్ము డాన్స్, వెదురుతో చేసిన కళాకృతుల గురించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నారాయణరావుపేటలో పర్యాటకరంగా అభివృద్ధి లో భాగంగా పర్యాటకులు గిరిజన సాంస్కృతి సాంప్రదాయాలు తెలుసుకునేందుకు వీలుగా పర్యాటకులు బస చేయడానికి వెదురుతో నిర్మిస్తున్నటువంటి ఇళ్లను, కోయ సంస్కృతి సాంప్రదాయాలు తెలియపరిచేలా చేపడుతున్న నిర్మాణాల గురించి బృంద సభ్యులకు అధికారులకు వివరించారు. స్థానిక గిరిజనులతో ముచ్చటించి పర్యాటకంగా తమ గ్రామం ఎలా అభివృద్ధి చేసుకోవాలో పలు సూచనలు చేశారు. ఈపర్యటనలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ శత వసంతాల వేడుకను విజయవంతం చేయండి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సిపిఐ శత వసంతాల వేడుకను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ తెలిపారు. ఆదివారం ఖమ్మం నగరంలోని కొత్తగూడెం సిపిఐ కార్యాలయంలో శాఖ కార్యవర్గ సమావేశం బొమ్మిశెట్టి రామనాథం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పగడాల మల్లేష్ మాట్లాడుతూ సిపిఐ ఆవిర్భావించి 100 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఈనెల 26న శత వసంతాల వేడుకను ఖమ్మంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా కొత్తగూడెం శాఖ ఆధ్వర్యంలో శత వసంతాల వేడుకను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో సిపిఐ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రజా సమస్యలే పరిష్కారంగా సిపిఐ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. తొలుత ఇటీవల మృతి చెందిన సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మృతికి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో 14వ డివిజన్ సిపిఐ కార్యదర్శి ప్రతానపు రామనాథం, 15వ డివిజన్ సిపిఐ కార్యదర్శి జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, చింతకాయల వెంకటేశ్వర్లు, ముద్రబోయిన అప్పారావు, బుడిగె వెంకన్న, చా గంటి వెంకటనర్సయ్య, పోతురాజు వెంకటేశ్వర్లు, భూమా రామ్మూర్తి, రా వుల సంజీవరావు, హరి హుస్సేన్, పొట్ట ప్రసాద్ పాల్గొన్నా రు.

## ఉపాధి రంగాన్ని కాపాడాలి

మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకుడు వెంకన్న

**ప్రజాపక్షం/ఖమ్మం :** స్వయం ఉపాధి రంగమైన ఆటో మోటార్ రంగాన్ని కాపాడడం ద్వారా ఉపాధికి ప్రోత్సాహం ఇచ్చినట్లు అవుతుందని తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాయం వెంకన్న తెలిపారు. రామ నర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్ ప్రధమ మహాసభ ఆదివారం కంకణాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. మహాసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన పాయం వెంకన్న మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన ఆటో కార్మికులు అడ్డాలపై దీనంగా కనిపిస్తున్నారని ఆదాయం గణనీయంగా పడిపోయిందన్నారు. మహాలక్ష్మి పథకం ఆటో కార్మికుల పాలిట శాపంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మోటార్ కార్మికులకు ఇస్తానన్న రూ. 12 వేలను వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో సుమారు ఆరున్నర లక్షల ఆటోలు ఉన్నాయని తెలిపిన వెంకన్న కేంద్ర ప్రభుత్వం రోడ్డు సేఫ్టీ బిల్లును ఉపసంహరించుకోవాలన్నారు.ఈ మహా సభలో యూనియన్ నాయకులు జి. రామయ్య, ఎస్‌కె లాల్‌మియా, ఉపేందర్, యలదండి బాబు,నారాయణ తదితరులు పాల్గొన్నా రు. మహాసభ అనంతరం అధ్యక్షుడిగా కంకణాల శ్రీనివాస్, కార్యదర్శిగా ఎస్‌కె లాల్ మియా, కోశాధికారిగా ముల్కలపల్లి లక్ష్మి నారాయణ లు ఎన్నికయ్యారు.

## ఖమ్మంలో మాజీ మంత్రి పువ్వాడ పర్యటన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం నియోజక వర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఆదివారం ఖమ్మం నగరంలోని లక్ష్మి గార్డెన్స్ నందు చింతలచెర్వు శంకర్‌రావు కుమారుడు భార్గవ్ స్వాతిల వివాహ వేడుకకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. రఘునాథపాలెం మండలం పంగిడి గ్రామంలో మాజీ ఎంపిటిసి బోడా ద్వాలి అనారోగ్యంతో మృతి చెందగా ఆమె భౌతికాయాన్ని పువ్వాడ అజయ్ కుమార్ సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు రూ. 10వేల ఆర్థిక సాయాన్ని కుమారుడు భాస్కర్‌కు అందజేశారు. ఈర్లపుడి గ్రామానికి చెందిన గుగులోత్ పాండ్యానాయక్ ఇటీవల మృతిచెందగా వారి దశ దిన కర్మకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హాజరై ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఖమ్మం నగరానికి చెందిన చెరుకూరి సత్యంబాబు ఇటీవల మృతిచెందారు. వారి స్వగృహంకు వెళ్లి ఆయన మృతిపట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. సత్యంబాబు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, ఆంధ్రా బ్యాంక్ సొసైటీ ఛైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, పగడాల నాగరాజు, వీరునాయక్ పాల్గొన్నారు.

## రాము మృతిపట్ల తుమ్మల యుగంధర్ నివాళి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వేపకుంట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త చావగాని రాము మృతిపట్ల కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ నివాళులర్పించారు. ఆదివారం వేపకుంట్ల గ్రామంలో వారి స్వగృహంలో ఉంచిన రాము భౌతికాయాన్ని తుమ్మల యుగంధర్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. రాము కుటుంబానికి పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందని యుగంధర్ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాంకుడోత్ దీప్లా నాయక్, మారం కరుణాకర్ రెడ్డి, బండి నాగేశ్వర రావు, అర్వికట్ల ప్రేమ్‌కుమార్, దేవ్‌సింగ్, రామునాయక్, మహ్మద్ ఆసీఫ్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు రైతు సంఘం ఆధ్వర్యంలో ఆందోళన

**ప్రజాపక్షం/ఖమ్మం :** రుణమాఫీని పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం 16వ తేదీన అన్ని మండల కార్యాలయాల ఎదుట ఆందోళన నిర్వహించనున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ విషయంలో రైతులను నిరాశ పర్చిందని రెండు లక్షల పైబడి రుణం ఉన్న రైతులకు కూడా రుణమాఫీ చేస్తామని ప్రకటించి అసలు రెండు లక్షల లోపు రైతులకు కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని వారు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగ ఉద్యమాలను అణిచివేసే ప్రయత్నం చేస్తుందని, రైతులపై లాఠీచార్జీ, భాష్పవాయువు గోళాలను నిరసిస్తూ ఆందోళన చేపడుతున్నామన్నారు. రైతు భరోసా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నాన్చివేత ధోరణిని అవలంభిస్తుందని రమేష్, గోవిందరావు లు తెలిపారు. సమస్యల పరిష్కారం కోసం జరిగే ఆందోళనను జయప్రదం చేయాలని వారు కోరారు.

## కేంద్రియ విద్యాలయ వార్షికోత్సవం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని కేంద్రీయ విద్యాలయంలో ఫౌండేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాది డిసెంబర్ 15న నిర్వహించే కేంద్రీయ విద్యాలయ ఫౌండేషన్ వేడుకల్లో భాగంగా 62వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఖమ్మం కేంద్రీయ విద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి ప్రిన్సిపాల్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయాలను దేశ వ్యాప్తంగా ఏర్పాటు చేసి విద్యను అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యార్థులు నాటికలు, పలు సంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## భూమి బాగుంటేనే ఆరోగ్యకరమైన ఉత్పత్తులు

రసాయనాల వాడకంతో ప్రమాదంలో భవిష్యత్తు తరం

సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించండి

ప్రకృతి వ్యవసాయ రైతు విజయ్‌రామ్



**ప్రజాపక్షం/ఖమ్మం :** భూమి ఆరోగ్యకరంగా ఉంటేనే భూమి నుంచి వచ్చే ఉత్పత్తులు వినియోగించిన మనుషులు ఆరోగ్యకరంగా ఉంటారని ప్రముఖ ప్రకృతి సేద్య నిపుణులు విజయ్ రామ్ తెలిపారు. భూమికి రసాయనాలు ఇచ్చి విషతుల్యం చేయవద్దని ఆయన రైతులకు సూచించారు. ప్రకృతి సేద్యంపై రైతుల అవగాహన సదస్సు ఆదివారం ఖమ్మంలోని ఈఆర్ఆర్ రిసార్ట్స్‌లో జరిగింది. రైతుబంధు సమితి రాష్ట్ర నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన రైతు సదస్సులో విజయ్‌రామ్ మాట్లాడుతూ భూమికి విష రసాయనాలు ఇచ్చి సమస్త జీవరాసుల జీవన విధానాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్నారన్నారు. అనవసరమైన రసాయనాలను ఎక్కువగా వాడుతున్నారని దీని వల్ల పెరిగే దిగుబడి కన్న ఆరోగ్యం ఎక్కువగా దెబ్బతింటుందన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని విజయ్‌రామ్ కోరారు. 2025 ఫిబ్రవరి 15 నుంచి 24 వరకు హైదరాబాద్‌లో 10 వేల మంది యువ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై సుప్రసిద్ధ ప్రకృతి వ్యవసాయ నిపుణులు సుభాష్ పాలేకర్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సేంద్రియ వ్యవసాయానికి డిమాండ్ పెరుగుతుందని సేంద్రియ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఉత్సుకత ప్రదర్శిస్తున్నారని విజయ్‌రామ్ తెలిపారు. సేంద్రియ ఉత్పత్తుల వినియోగం మనిషి ఆయువును పెంచడంతో పాటు ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. సేంద్రియ సాగులో ఐదు అంచెల పద్ధతిపై విజయ్ రామ్ రైతులకు అవగాహన కల్పించారు. రాత్రిభవళ్లు కష్టపడి ఉత్పత్తిని పెంచడం కంటే ఆరోగ్యకరమైన ఉత్పత్తులను సాధించినప్పుడు తృప్తి కలుగుతుందన్నారు. సేంద్రియ వ్యవసాయ రైతు, శాస్త్రవేత్త చల్లా నాగేశ్వరరావు ఈ సదస్సులో మాట్లాడుతూ సేంద్రియ పద్ధతి ద్వారా వచ్చిన వ్యవసాయ ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఉత్పత్తిని సాధించడానికి వీలు పడుతుందన్నారు. ప్రముఖ అభ్యుదయ రైతు తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ రైతులు తొలుత తమ అవసరాలకు సరిపడ రసాయనాలు లేని ధాన్యం, ఆకుకూరలు, కాయకూరలను పండించడానికి అలవాటు పడి తద్వారా ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రసాయనాల కారణంగా ఆహార పదార్థాలు విషతుల్యం అవుతున్నాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖమ్మంజిల్లా రైతు సంఘం నాయకులు మాదినేని లక్ష్మి, నరేంద్ర స్వరూప్, కుతుంబాక మాధవి, వెంకట్రామిరెడ్డి, రాణాప్రతాప్, రామారావు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎ. రామిరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు. సేంద్రియ పద్ధతుల్లో రైతులు పండించిన పంటలకు సంబంధించిన ప్రదర్శన పలువురు రైతులను ఆకట్టుకుంది.

## ధాన్యాన్ని సొసైటీ కొనుగోలు కేంద్రాల్లో అమ్మి బోనస్ పొందాలి

రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల



**ప్రజాపక్షం/పాల్వంచ:** రైతులు పండించిన ధాన్యాన్ని సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్మి బోనస్ పొందాలని రాష్ట్ర మార్కెఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం పాల్వంచ మండల పరిధిలోని కారెగట్టులో ఉన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. సొసైటీ కొనుగోలు కేంద్రం ఇంఛార్జిని కొనుగోలు ప్రక్రియ విషయమై అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల బారిన పడకుండా ప్రభుత్వమే ధాన్యానికి మద్దతు ధర ప్రకటించిందన్నారు. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని అన్నారు. రైతుల కోసం ఒకే దఫా రెండు లక్షల రుణమాఫీ, రైతు బోనస్, రైతుకులు ఇన్సూరెన్స్ పథకం వంటి పథకాలతో ప్రభుత్వం రైతుల పక్షాన నిలిచిందన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం అమ్మి, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గిరిజన గ్రామమైన కారెగట్టులో ఆయన పర్యటించి, అక్కడి మహిళలతో ప్రజలతో సమస్యలపై చర్చించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఉంద్రాతి రవి, మాజీ జెడ్‌పిటిసి యర్రంశెట్టి ముత్తయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న, నాయకులు యాకిరెడ్డి, వై వెంకటేశ్వర్లు, కొదుమూరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు ఏరియా ఒసి -2 ఆపరేటర్ల ఔదార్యం



* అనారోగ్యంతో మృతి చెందిన సింగరేణి కార్మికుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఒసి2 ఏ రిలే ఆపరేటర్ల ఆధ్వర్యంలో తమ షిఫ్ట్ లోనే పంపు ఆపరేటర్ గా పనిచేస్తూ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన పి వి కాలనీ వాసి రుద్రాక్షల కృష్ణ కుటుంబానికి ఆదివారంపివి కాలనీలో వారి నివాస గృహానికి చేరుకుని ఏ రిలే షిఫ్ట్ ఇన్ చార్జ్ ఎం నరసింహారావు చేతుల మీదుగా రూ. 73,500/లు ఆర్థిక సహాయం అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాట్లాడుతూ ఆపదలో ఉన్న తమ తోటి ఉద్యోగి కుటుంబానికి ఆర్థికంగా ఆపన్న హస్తం అందజేసి మేమున్నామంటూ, కొండంత మనోధైర్యాన్ని నింపటం ఓదార్పునివ్వడం అభినందనీయమని ఈ సందర్భంగా ఆపరేటర్ల సేవలను ఆయన కొనియాడారు. తమ తోటి ఉద్యోగులే కాకుండా కష్టాల్లో ఉన్న అనేక మందికి అనేక విధాలుగా పలు సందర్భాలలో తోడ్పాటునందించిన ఏ రిలే ఉద్యోగులను ఆయన ప్రశంసించారు. అందరితో ఎంతో స్నేహభావంగా ఉండే కృష్ణ మృతి ఎంతో బాధాకరమని సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అండర్ మేనేజర్ భార్గవ్, ఇంజనీర్ వెంకటరమణ,హెడ్ ఓవర్ మెన్‌లు సుదీప్, రాజ్ కుమార్, ఏ రిలే ఆపరేటర్ల తరపున ప్రతినిధులుగా సయ్యద్ నయమత్ హుస్సేన్, కె మల్లికార్జునరావు, భాగం రవికుమార్, గిరీష్ రెడ్డి, శ్రీధర్, చెన్నుపాటి హనుమాన్ బాబు, కొత్త సత్యనారాయణ, ఎండి యాకూబ్ పాషా, సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

## గొండెల రవిని అభినందించిన ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల కాంగ్రెస్ సేవాదళ్ నాయకుడిగా వైరాకు చెందిన గొండెల రవికుమార్ ఎంపికకావడం చాలా సంతోషదాయకమని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా సేవా కార్యకర్తలు పనిచేస్తారని, వారితో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ వైరా మండలంలో కాంగ్రెస్ పార్టీని ముందుకు తీసుకెళ్లే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపిలు రామసహాయం రఘురామిరెడ్డి, రేణుకాచౌదరిలకు మంచి పేరు తెచ్చే విధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని, గొండెల రవికి అభినందన తెలియజేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పాల్గొని మాట్లాడి ఆయనను అభినందించారు. రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్, రాష్ట్ర కార్యదర్శి కొదుమూరు దయాకర్, జిల్లా సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ గౌస్, కాంగ్రెస్ నాయకులు బొర్రారాజశేఖర్, వైరా మున్సిపాలిటీ చైర్మన్ సూతకాని జైపాల్, రాష్ట్ర నాయకులు కట్ల రంగారావు, మండల అధ్యక్షులు నర్సిరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఏదునూరి సీతారాములు, మిట్టపల్లినాగి, మిట్టపల్లి రాఘవరావు, మిట్టపల్లి శ్రీనివాసరావు, దాసరి ఇమ్మానేయులు, కల్వ సుజాత, అభిమాన సంఘం నాయకులు గ్రంధి ప్రవీణ్ తదితరులు పాల్గొని అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులో శుక్రవారం అంబేద్కర్ నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కొదమసింహం రాఘవాచారి (75) అనే వృద్ధుడు గాయపడ్డాడు. కుటుంబీకులు తెలిపిన వివరాలు ప్రకారం.. అంబేద్కర్ నగర్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాఘవాచారిని కుటుంబీకులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అదే రోజు మెరుగైన వైద్యం కోసం ఖమ్మం లోని ఓ వైద్యశాలలో వైద్యం పొందుతూ ఆదివారం మృతి చెందారు. అతనికి భార్య, పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, పట్టణవాసులు, అర్చకులు ఆయన భౌతిక మృతదేహంను సందర్శించి నివాళులర్పించి వారి కుటుంబానికి సంతాపాన్ని ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కల్లూరు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## 85 పరీక్షా కేంద్రాల ఏర్పాటు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గ్రూప్ 2 పరీక్షలు మొదటి రోజు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం నిర్వహించిన గ్రూప్ 2 పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 28,101 మంది అభ్యర్థులకు గాను 85 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 5. 30 వరకు రెండు సెషన్లలో పరీక్షలను నిర్వహించారు. అభ్యర్థులను ఉదయం సెషన్‌లో ఉదయం 9.30 గంటల వరకు మధ్యాహ్నం సెషన్‌లో మధ్యాహ్నం 2.30 గంటల వరకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. ఎటువంటి అవాంఛనీయ సం ఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద పటి ష్ట పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. సోమవారం కూడా రెండు సెషన్లలో గ్రూప్ 2 పరీక్షలు జరగనున్నాయి.

## భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం



వైరా శాసనసభ్యులు

మాలోతు రాందాస్ నాయక్‌కు వినత

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలం అన్నారుపాడు గ్రామ పోడు సాగుదారులకు సీతారామ ప్రాజెక్టు కాలువలో భూములు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇప్పించాలని స్థానిక వైరా శాసనసభ్యులు మాలోతు రాందాస్ నాయక్ కి ఆదివారం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా రాష్ట్ర నాయకులు, ఇల్లెందు మాజీ శాసనసభ్యులు కామ్రేడ్ గుమ్మడి నరసయ్య సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడక ముందు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని స్థానికంగా అర్హులైన పేదలందరికీ గుర్తించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని రేషన్ కార్డులు ఇవ్వాలని వారు కోరారు. జూలూరుపాడు మండలంలో ఉన్న ఉప మార్కెట్ ను శాశ్వత మార్కెట్ గా ఏర్పాటు చేయాలని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని లింకు రోడ్లను మరమ్మతులు చేపట్టాలని వారు గుర్తు చేశారు. పోడు సాగుదారులు, లంబాడ గిరిజనులు 17 మంది గత 18 సంవత్సరాల నుండి చదును చేసుకొని సాగుకు తీసుకొచ్చిన వారు అనుభవించే సమయంలో సీతారాం ప్రాజెక్టు మంజూరై కాలువ పనులలో వారి భూములు కోల్పోయారని వారు చేసిన కష్టం వృధా అయిందనిచ గత ప్రభుత్వం పోడు రైతులను గుర్తించి పట్టాలు ఇవ్వాలని తీసుకున్న కార్యక్రమంలో ఈ రైతులకు వారి భూములు కాలువలో పోయినందున వారికి పట్టా హక్కు కూడా రాలేదని వారు గుర్తు చేశారు. వారి భూములకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా జిల్లా నాయకులు బానోతు ధర్మ, ఎదులాపురం గోపాలరావు, మండల నాయకులు జవహర్‌లాల్, లోక్యా, రైతులు, బోడ సక్రు, బాలు, బద్రు, సరోజిని, రమణి, వీరు, రమేష్, వీరస్వామి, చిన్న స్వప్న పాల్గొన్నారు.

# ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి

**ప్రజాపక్షం/వైరా:** అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం వైరా మండల, పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఘనంగా వైరాలో నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఆరయవైశ్య సంఘం అధ్యక్షుడు దారా వెంకటకృష్ణారావు, మండల కమిటీ ప్రధాన కార్యదర్శి కొల్లా రాంబాబు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు దారా వెంకటకృష్ణారావు మాట్లాడుతూ భారతదేశంలో అంటరానితనం గురించి విస్తృతంగా ప్రచారం చేస్తూ పోరాడి మహోన్నత పొట్టి శ్రీరాములు అని తెలిపారు. అంతేకాక దళితులకు దేవాలయం ప్రవేశం కోసం అందరితో సంప్రదిస్తూ దళితుల ఉద్ధరణకై పాటు పడ్డారని అదేవిధంగా సబర్మతి ఆశ్రమంలో అజ్ఞాతంలో ఉన్నటువంటి స్వాతంత్ర్య సమరయోధులకు సేవ చేయడంతో పాటు ఎన్నో సామాజిక సేవలు అందించి మహనీయులను ఒక వర్గానికి, ఒక కులానికి పరిమితం చేయడం అనేది దురదృష్టకరం అని అన్నారు. అనంతరం మండల కమిఈ కార్యదర్శి కొల్లారాంబాబు మాట్లాడుతూ మనందరం ఆ మహనీయుడు యొక్క గొప్పతనం తెలుసుకోవాలని పోరాట పటిమని అలవరచుకోవాలని అన్నారు. వారి ప్రాణార్పణ ద్వారా భారతదేశంలో భాషా ప్రయోక్త రాష్ట్రాలు ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో జల్లా అవినాష్, చల్లా వెంకటరమణ, ఆర్యవైశ్య మండల మహిళా అధ్యక్షురాలు బొగ్గవరపు సునీత,



రాయల రోజా, మిట్టపల్లి పద్మజ, వైరా పట్టణ అధ్యక్షురాలు అనుమోలుకుమారి, మిట్టపల్లి మంజుల, కొణతం గీత, వజినేపల్లి చక్రవర్తి, నూకల ప్రసాదరావు, గ్రంధి లక్ష్మీ నరసయ్య, బండారు భాస్కర్‌రావు, మిట్టపల్లి భాస్కర్‌రావు, పెనుగొండ రామారావు, కొత్తూరి రమణ, మిట్టపల్లి శివ, నాగభూషణం, మిట్టపల్లి భాస్కర్‌రావు, రాయల వాసు, నంబూరి వెంకటేశ్వర్లు, కొదుమూరి రవి, మిట్టపల్లి జగన్, కొణతం శ్రీను, రాయపూడి వెంకటేష్, వనమా వెంకటేష్, అనుమోలు భాస్కర్‌రావు, గజ్జల మాణిక్యమ్మ, కొదుమూరి భాగ్యలక్ష్మి, రాయల అన్నపూర్ణ, నూకల అన్నపూర్ణ, మిట్టపల్లి మహాలక్ష్మి, మిట్టపల్లి కృష్ణవేణి, మిట్టపల్లి అరుణ, మిట్టపల్లి సుధారాణి, మిట్టపల్లి సరిత, వజినేపల్లి సునీత, రంగా వాసవి, అనుమోలు రజిత, వైరామండల మెంబర్‌షిప్ చైర్మన్ మిట్టపల్లి విజయ్‌కుమార్, వాసవి క్లబ్ వైభవం అధ్యక్షుడు బోనాల సాయినిఖిల్, తెల్లాకుల సందీప్, వేముల కిషోర్, క్వాజా సైదారావు,మాలే ఉదయ్‌తేజ, గుర్రంఅన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



# 'హనుమకొండ'లో 16,694 మంది గైర్హాజరు

## కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య గ్రూప్-2 పరీక్షలు ప్రారంభం

### ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్2 పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ హనుమకొండ జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. ఇన్‌చార్జ్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద దేవి ఆదివారం ఎస్.ఆర్. ప్రైమ్ స్కూలు, కళాశాల, వరంగల్ పబ్లిక్ స్కూల్, మాస్టర్ జి డిగ్రీ అండ్ పీజీ కళాశాల లో గల పరీక్షల కేంద్రాలను సందర్శించారు. పరీక్ష ముగిసిన తర్వాత జవాబు ( ఓఎంఆర్) పత్రాలను జాగ్రత్త గా భద్రపరచాలని, సిబ్బంది అంతా పరీక్షలు ముగిసే వరకు అప్రమత్తం గా ఉండాలి అని ఆదేశించారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అన్నది గమనించి పలు సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. పరీక్షకు హనుమకొండ జిల్లాలో మొత్తం 33,006 మంది అభ్యర్థులకు గాను 16,312 మంది హాజరు కాగా 16694 మంది గైర్హాజరు అయ్యారని వివరించారు. ఆది, సోమవారాలలో ఉదయం, మధ్యాహ్నం చొప్పున మొత్తం నాలుగు సెషన్లలో జరిగే గ్రూప్2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

### పరీక్ష కేంద్రాల పరిశీలన

**వరంగల్ ప్రతినిధి :** టిజిపిఎస్సీ ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రూపు2 పరీక్షల నిర్వహణను వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద ఆదివారం పరిశీలించారు . వరంగల్ జిల్లాలోని రెడ్డిపాలెం ఇంపాక్ట్‌జీసస్ పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాన్ని పరిశీలించి నిర్వహణ గదులను ,వైద్య ఇతర సౌకర్యలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు . కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ఆదివారం ప్రారంభమైన గ్రూపు 2 మొదటి ,రెండవ పేపర్ ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కలెక్టర్ సత్యశారధ చెప్పారు . పరీక్ష కేంద్రాల వద్ద కట్టదిట్టమైన పోలీస్ బందో బస్తు ఏర్పాట్లు చేసి ఏలాంటి పొరపాట్లు జరుగకుండా జాగ్రత్తగా పకడ్బంది ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు .

# చదువుతోపాటు నైపుణ్యం ఉండాలి



### ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** ప్రతీ విద్యార్థికి చదువుతోపాటు నైపుణ్యం ఉండాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వరంగల్ 11వ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో మెరుగైన విద్య అందించాలని 10 ఏళ్ల క్రితం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రారంభించారని ఈ సందర్భంగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలో అత్యుతన్నత స్థానాల్లో భారతీయులే ఉన్నారని చదువుతోపాటు నైపుణ్యం ఉంటే ఏ రంగంలో అయినా రాణించ వచ్చన్నారు. గడిచిన 75 ఏళ్లలో విద్య, వైద్య రంగాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. ఈ రంగాలు అభివృద్ధి చెందాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులు చేయడం లేదన్నారు. విద్యతోపాటు అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కేయూ మాజీ వైస్ ఛాన్సలర్ గోపాల్‌రెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఛైర్మన్ రాజిరెడ్డి, వైస్ ఛైర్మన్ రవికిరణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఇన్నారెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రోత్సాహకాలు



**ప్రజాపక్షం/హసన్ పర్తి :** వరంగల్ నగర పాలక పరిధి హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామం పరిధిలోని ఎంజెపి పాఠశాలలో గురుకులాల బాట కార్యక్రమంలో భాగంగా జిల్లా రెవెన్యూ ఆఫీసర్ డిఆర్‌ఓ రమేష్, దామెర ఏఈ నరేష్ పల్గొని ఏకీకృత మెనూని ఆవిష్కరించారు. రాష్ట్రంలో గల అన్ని గురుకులాల్లో అమలు చేస్తున్నట్లుగా దీనిలో ప్రతి వారం ఒక్కో రకమైనటువంటి మెనూ ఫాలో అవుతూ నెలకు రెండుసార్లు మటన్, నాలుగు సార్లు చికెన్ అందించే విధంగా ప్రభుత్వం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తుందని గణేష్ పేర్కొన్నారు. ఈ సందర్భంలో భాగంగా పాఠశాలలోని అన్ని విభాగాలను కిచెను వంటగది స్టోర్ రూమ్ క్లాస్ రూమ్స్ సందర్శించారు.ఈ ప్రోగ్రాంలో సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు. పాఠశాలలో ప్రతిభ కనబరిచినటువంటి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతిని కూడా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సరిత, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

# సజావుగా గ్రూప్–2 పరీక్ష




**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్ 2 పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఇన్‌చార్జి సంపత్‌రావు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అన్నది గమనించి పలు సూచనలు చేశారు. కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలని అన్నారు.

# డిమాండ్లపై ప్రభుత్వంతో చర్చిస్తాం

### జాక్టో ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఎస్ఎస్ఎ ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం తో చర్చిస్తానని జాక్టో ఎమ్మెల్సీఅభ్యర్థి పూల రవీందర్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి తో కలిసి ఎస్ఎస్ఎ ఉద్యోగులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పూల రవీందర్ మాట్లాడుతూ ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఎస్ఎస్ఎ ఉద్యోగుల డిమాండ్లు న్యాయమైనవని, వారికి వెంటనే వారికి మినిమం టైం స్కేల్ వర్తింప చేసేలా ప్రభుత్వంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన సిపిఎస్ రద్దు ను సాధించి ఉపాధ్యాయులకు కానుక గా ఇస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010కింద వేతనాలు, నోషనల్ ఇన్క్రిమెంట్లు, ఉద్యోగ ఉపాధ్యాయులకు నూతన పిఆర్‌సి సాధిస్తానని, వచ్చే ఎన్నికల్లో వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎస్‌టియూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఆట సదయ్య, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రాంబాబు, జనగామ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, బిసిటిఎ నాయకులు తిరుపతి, భాస్కర్, సమ్మయ్య, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి సిఎం కప్ టోర్నమెంట్

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** స్థానిక మినీస్టేడియంలో నేడు సీఎం కప్ టోర్నమెంట్‌ను జిల్లాలోని ప్రముఖులచే ప్రారంభించడం జరుగుతుందని జిల్లా యువజన క్రీడల అధికారి ఆదివారం తెలిపారు. సీఎం కప్ టోర్నమెంట్ సందర్భంగా జిల్లాస్థాయిలో ఈనెల 16 నుండి 21వరకు మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు నేరుగా జిల్లాస్థాయిలో పాల్గొనే క్రీడాకారులకు వివిధ క్రీడలలో పోటీలను నిర్వహించి ఎంపికైన వారిని రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడలకు పంపిస్తామన్నారు.క్రీడాకారులు, క్రీడా సంఘాల వారు, అభిమానులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

# వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

### సిసిరోడ్లు, డైనేజీకి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాగరాజు



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నడుస్తుందని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేటర్ పరిధిలో 44, 46 డివిజన్ల పరిధిలో సుమారు రూ. 4.80 కోట్లతో స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు నగర మేయర్ గుండు సుధారాణితో కలిసి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు అందించామని మళ్లీ నేటి ఇందిరమ్మ ప్రభుత్వం త్వరలో అర్హులకు రేషన్ కార్డులను, డిజిటల్ ఆరోగ్యశ్రీ కార్డుల జారీకి ప్రభుత్వం సన్నద్ధం అవుతుందన్నారు. నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం నిర్మించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. డిజిటల్ రేషన్, హెల్త్ కార్డుల ప్రక్రియకు ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద ఒక పట్టణం, ఒక గ్రామాన్ని ఎంచుకునే విషయాన్ని గుర్తు చేశారు. అలాగే ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రైతు రుణమాఫీ చేసిన గొప్ప ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని సంక్రాంతి తరువాత రైతు భరోసా ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ బీఆర్ఎస్, బీజేపీ నాయకుల మాయ మాటలకు మోసపోకుండా అన్నం పెట్టే కాంగ్రెస్ పార్టీని అక్కున చేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెట్టుగుట్ట ఛైర్మన్ రఘుచందర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీద్వారక ప్రారంభోత్సవం



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** శ్రీ ద్వారక అపార్ట్మెంట్ ప్రారంభోత్సవ వేడుకలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వరంగల్ ఉర్సు గుట్ట బైపాస్ రోడ్, ముకుంద కాలనీ లో సత్యం గ్రూప్ నిర్మించిన శ్రీ ద్వారక గృహ సముదాయాలకు గంటా రవికుమార్ దంపతుల సారధ్యంలో ప్రారంభోత్సవం చేశారు. మూడు ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేసి నూతనంగా గృహాలు కొనుగోలు చేసిన వారు అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించి, వారికి ఇంటి తాళంచెవులు అందజేశారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి గణపతి, నవగ్రహ, మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. అలాగే భూ వరాహ సహిత జయలక్ష్మి, నరసింహ మూల మంత్ర హవనము, దశమహా విద్య హవనము బ్రహ్మశ్రీ యల్లంభట్ల సీతారామ శాస్త్రి ఆధ్వర్యంలో విశిష్ట పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం, తీర్థ ప్రసాద, భోజన కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఆహ్వాన వేడుకులకు పెద్ద ఎత్తున సత్యం గ్రూప్ కస్టమర్ల, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు హాజరై అభినందించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన గృహ సముదాయం, విల్లాలను తిలకించి, గృహ ప్రత్యేకతలు తెలుసుకుని ఆనందం వ్యక్తం చేశారు.

# రెడ్‌క్రాస్ సేవలకు బాసట



**ప్రజాపక్షం/కాజీపేట:** హనుమకొండ రెడ్ క్రాస్ కార్యాలయ భవన నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి శంకుస్థాపన చేశారు. తలసీమియా పిల్లలకు పింఛన్ మంజూరు చేయడంపై ముఖ్యమంత్రితో చర్చిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముందుగా రెడ్‌క్రాస్ పాలకవర్గం పూలె బొకే అందచేసి స్వాగతం పలికారు. జూనియర్ రెడ్ క్రాస్ విద్యార్థులు బ్యాండ్ మార్చ్ తో ఎమ్మెల్యే నాయినిని స్వాగతించారు. హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో రెడ్ క్రాస్ కార్యాలయంలో రెడ్ క్రాస్ కార్యకలాపాల భవన నిర్మాణానికి ఆదివారం వారు భూమి పూజ నిర్వహించారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ గుండు సుధారాణి, స్థానిక కార్పొరేటర్ గుజ్జుల వసంత మహేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా శిలాఫలకం ఆవిష్కరించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని పురస్కరించుకొని అయన చిత్రపటానికి నివాళులర్పించారు. రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి. శ్రీనివాస్ రావు ద్వారా బన్ను ఆరోగ్యదా సేవ సొసైటీ ఫౌండర్ డాక్టర్ వీరమల్ల చరణ్ జిత్ రెడ్డి అందించిన బెడ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రక్తదాన సేవలతో పాటు రాష్ట్రంలో తొలి స్థానంలో నిలుస్తున్న రెడ్ క్రాస్ సేవలను ప్రశంసించారు. తలసీమియా పిల్లలకు పింఛన్లు అందేలా ముఖ్యమంత్రితో చర్చిస్తానని అయన హామీ ఇచ్చారు. ఢిల్లీలో పార్లమెంట్ వద్ద ఉన్న రెడ్ క్రాస్ రోడ్ లా హనుమకొండ లో రెడ్ క్రాస్ ఎదురుగా వున్నా ప్రధాన రహదారిని 'రెడ్ క్రాస్ రోడ్' గా నామకరణం చేయాలని మేయర్‌ని కోరారు.మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ 'రెడ్ క్రాస్‌రోడ్'గా నామకరణం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.రెడ్ క్రాస్ కమిటీ తరపున ఎమ్మెల్యేనాయిని రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణిని సత్కరించారు. రెడ్ క్రాస్ సిబ్బందికి నివాస స్థలాలు మంజూరి చేయాలనీ వినతిపత్రం అందజేయగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పందించారు. కలెక్టర్‌తో చర్చిస్తానన్నారు.హనుమకొండ రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ. వి. శ్రీనివాస్‌రావు ఉన్నారు.

# మంత్రుల పర్యటనలో డబుల్‌బెడ్‌రూమ్ ఊసే లేదేమి?




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** నిన్న మంత్రుల పర్యటనలో పేదలకు కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాల పంపిణీ ఊసేలేదని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణరెడ్డి అన్నారు. గత 22 రోజులుగా భూపాలపల్లి భాస్కర్ గడ్డ లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ పట్టాల కోసం చేస్తున్న నిరసన కార్యక్రమంలో పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 నెలల క్రితం కేటాయించిన ఇళ్ళునేటికీగృహప్రవేశాలకినోచుకోకపోవడం దురదృష్టకరమని అన్నారు. గత 22 రోజులుగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ బాధితులు నిరసన చేపట్టిన కనీసం వీరి వద్దకు వచ్చిన నాథుడే లేదని విమర్శించారు. మొన్న జిల్లా మంత్రి శ్రీధర్ బాబు, ఇంచార్జి మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ చేసి ఇక్కడి పరిస్థితి వివరించానన్నారు. నిన్న మంత్రుల పర్యటనలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ విషయం పై ఏమైనా హామీ ఇస్తారేమో అని చూడటం జరిగిందని, మంత్రులకు సైతం చెప్పిన ఫలితం లేదన్నారు.ఇప్పటికైన జిల్లా కలెక్టర్ ఈ పేదవారికి ఇళ్ళ పట్టాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఎస్ వెంకట రాణి సిద్ధు, వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ రాజు, ఎడ్ల మౌనిక, ముంజ పెల్లి మురళి, టీజీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాడ హరీష్‌రెడ్డి స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మతం పోకుండా కులం పోదు

### 'కేంద్ర సాహిత్య అకాడమీ' అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ "రేవు తిరగబడితే" రచయిత పులికొండ సుబ్బాచారికి సన్మానం



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** మతం పోకుండా కులం పోదు అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ అన్నారు. ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహితీ పురస్కార సభ 2024 ఆదివారం హనుమకొండలోని ప్రభుత్వ బిఈడి కళాశాలలో అరసం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సభకు అరసం జిల్లా అధ్యక్షులు బూర బిక్షపతి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఈ సంవత్సరం నవలల పోటీలో ఆచార్య పులికొండ సుబ్బాచారి "రేవు తిరగబడితే" అనే నవల గెలుచుకుందని అన్నారు. రచయత పులికొండ సుబ్బాచారిని ఘనంగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ సన్మానించారు. అనంతరం అంపశయ్య నవీన్ మాట్లాడుతూ సాహిత్య ప్రక్రియలన్నింటిలోనవలాప్రక్రియ సమాజాన్ని గొప్పగా ప్రభావితం చేస్తుందని, ఇప్పుడు "రేవు తిరగబడితే" నవల ఆ స్థానాన్ని భర్తీ చేసిందని, రజకుల ఇతివృత్తమీద ఇంత పెద్ద నవల ఇదే మొదటిదని రచయితను అభినందించారు.దేశంలో మతోన్మాదంరోజురోజుకు పెరిగిపోతుందని,కులానికి పునాది మతమేనని మతం పోకుండా కులం పోదని తన ఆవేదనను వెలిబుచ్చారు. ఇదే విషయాన్ని అంబేద్కర్ కుల నిర్మూలనా గ్రంథంలో నొక్కి చెప్పారని అన్నారు. నేటి యువతలో సాహిత్య పఠనం రోజురోజుకు తగ్గిపోతుందని ఆవేదన చెందుతూ, యువత సాహిత్యంచదివినప్పుడు సామజిక స్పృహ కలుగుతున్నదని అన్నారు. విశిష్ట అతిథి కెయు ప్రొఫెసర్ ఆచార్య బన్న ఐలయ్య మాట్లాడుతూ పులికొండ సుబ్బాచారి మంచి రచయితని, ఆయన రాసిన పుస్తకాలు విద్యార్థులకు పాఠ్యగ్రంథంగా ఉన్నాయని అభినందిస్తూ మరోవైపు రాజ్యాంగం ప్రకారం ఎన్నికై రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నారని, మూడు వర్ణాలకే సేవచేయడానికే సూద్రులు ఉన్నారని అస్సాం ముఖ్యమంత్రి అనడం సిగ్గుచేటని, ఇలాంటి పాలకులున్న దేశం ఎలా ప్రగతి పథంలో నడువగలదని ప్రశ్నించారు. అరసం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బ్రహ్మచారి నిధి పుస్తకాన్ని పరిచయం చేస్తూ రజకుల ఇతివృత్తంగా ఈ నవల కొనసాగిందని, ఆధిపత్యానికి ఆత్మగౌరవానికి మధ్య జరిగిన యుద్ధమని, శ్రమకు శ్రమదోపిడికి మధ్య జరిగిన యుద్ధమే ఈ నవలని, వాస్తవానికి నిజాం పాలకులు తెలంగాణ భారత యూనియన్‌లో విలీనమైనా శ్రమదోపిడి, ఆధిపత్యం నిర్మూలన కాని స్థితికి ప్రతిబింబంగా ఈ నవల ఉందన్నారు. పురస్కార గ్రహీత పులికొండ సుబ్బాచారి మాట్లడుతూ నవలలోని పాత్రలన్నీ సజీవ పాత్ర లేనని నా కళ్ళ ముందు జరిగిన ఘటనలనే ఇతి వృత్తంగా తీసుకొని రేవు తిరగబడితే నవలను తీసుకొచ్చానని, ఇది మలిముద్రకు వెళ్లిందని ఈ అవార్డు భాస్కర్ రావు స్మారకంగా, నవీన్ చేతులమీదుగా పురస్కారాన్ని తీసుకోవడంఆనందంగా ఉన్నదన్నారు. అరసం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ మాట్లాడుతూ ఉత్తమ పాటకు కూడా పురస్కారం ఇస్తే బాగుంటుందని సూచన చేశారు. తెలంగాణ రాష్ట్ర అరసం అధ్యక్షులు పల్లేరు వీరాస్వామి మాట్లాడుతూ అరసం చరిత్రను వివరించారు. వరంగల్ జిల్లా అరసం ప్రధాన కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్ నారాయణ నివేదికను ప్రవేశపెడుతూ పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై కలాన్ని ఎక్కు పెట్టమనేది అరసం అని, కులతత్వాన్ని మతతత్వాన్ని మసి చేయమనేది అరసమనేది అంటూ 2014 నుండి నేటి వరకు వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహితీ పురస్కారాన్ని కవితా సంపుటికి, కథా సంపుటికి, నవలకు, విమర్శకు ఇప్పటివరకు ఏదో ఒక ప్రక్రియకు 11 సంవత్సరాలుగా ఇవ్వడం జరిగిందన్నారు. మానవాళికి మార్క్సిజమే దిక్సూచి అంటూ విద్యార్థిని గంగా భవాని కవితను చదివారు.రచయిత వెంకటి, లక్ష్మీ నారాయణ, ప్రభాకర్, కాసర్ల రంగారావు, గజ్జెల స్వరూప, ఎర్ర ప్రసూన, కోడేం కుమారస్వామి,వెంగల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, మద్దెల కుమారస్వామి, గాదరి ఉప్పలయ్య, రాజ్మహమ్మద్, అంజలి, రవళి, విష్ణుప్రియ, మౌనిక, సంధ్య, వెంకన్న, రాజు, కాసుల రవీందర్ పాల్గొన్నారు.

# 'ఒటిపి' చెప్పారంటే మోసపోయినట్టే

### సిఐ చంద్రమోహన్, ఎస్ఐ మహేందర్




**ప్రజాపక్షం/నెక్కొండ:** సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియని వ్యక్తుల ద్వారా వాట్సాప్‌లలో, సోషల్ మీడియాలో, పరిచయాలు పెంచుకొని ఆపై మోసాలకు పాల్పడతారని, సిఐ చంద్రమోహన్ ఎస్సై మహేందర్ లు విలేకరుల సమావేశంలో అన్నారు. రోజురోజుకు సైబ ర్ నేరాలు పెరుగుతున్నాయని, నేరగాళ్ల చేతుల్లో మోసపోయిన వారు కోకొల్లలుగా ఉన్నారని వారు అన్నారు. కొందరు మాత్రమే పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేస్తున్నారని, కొందరు చెప్పుకోలేని స్థితిలో ఉన్నారని వారు అన్నారు. మోసపోయిన బాధితులు 24 గంటల్లోపు సైబర్ విభాగానికి ఫిర్యాదు చేస్తే న్యాయం జరుగుతుందని, నేరగాళ్ల చేతికి వెళ్లిన డబ్బులు డ్రా చేయకుండా సైబర్ పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటారని వారు అన్నారు. స్మార్ట్ ఫోన్లకు గుర్తుతెలియని వ్యక్తులు మీకు ఫోన్లు చేస్తారని అలాంటప్పుడు పోలీసులకు సమాచార ఇవ్వాలని వారు అన్నారు. ఓటీపీలు అడిగినప్పుడు ఎవరికి ఇవ్వకూడదని, అలా ఇస్తే మీ వ్యక్తిగత సమాచారం మొత్తం నేరగాళ్ల చేతికి వెళ్తుందని వారు తెలిపారు. సోషల్ మీడియాలో పోలీసులు ప్రచారం చేస్తున్నా కూడా ప్రజలు మోసపోతున్నారని, మీ పిల్లలు అరెస్టయినారని, యాక్సిడెంట్ అయినదని, పలాన కేసులో వారు ముద్దాయిలుగా ఉన్నారని, తప్పుడు సమాచారం ఇస్తూ ఫోన్లు చేస్తారని, అలాంటి వాటిని మీరు పట్టించు కోకూడదని, వారికి సమాచారం సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదని వారు తెలిపారు. గత నెల రోజుల నుండి వాట్సాప్‌లో ఈ +923412337236 నెంబర్తో కాల్ వస్తుందని ,వాట్సాప్ డీపీలో పోలీస్ దుస్తులతో ఒక వ్యక్తి ఫోటో ఉంటుంది. ఫోన్ ఎత్తగానే మొదటగా ఒక పురుషుడు మాట్లా డి తదనంతరం ఒక మహిళ ఇంగ్లీషులో, లేదా హిందీలో మాట్లాడుతుందని వారికి ఎలాంటి సమాచారం ఇవ్వకూడదన్నారు. ప్రజల సహకారం ఉంటేనే సైబర్ నేరాలు తగ్గుతాయని వారు తెలిపారు.

# ఆర్భాటాల కోసం తప్ప.. కౌశిక్ చేసిందేమీ లేదు

### వొడితల ప్రణవ్



**ప్రజాపక్షం/ కమలాపూర్:** ప్రజా ప్రభుత్వంలో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు మన ఊరు మన కాంగ్రెస్ కార్యక్రమాన్ని విజయవంతం కొనసాగుతుందని, ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని హుజూరాబాద్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు అన్నారు. కమలాపూర్ మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో ఆయన ఇంటికి వెళ్ళి తొమ్మిది లక్షల ముప్పై ఎనిమిది వేల విలువ చేసే సిఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం కన్నూరు గ్రామంలో మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే రైతులకు రుణమాఫీ, బోనస్ ఇచ్చి రైతులను ఆదుకున్నామని, కమలాపూర్ మండల అభివృద్ధికి నిధులు కేటాయించామని, ఎస్‌డిఎఫ్ నిధులతో అంతర్గత సిసి రోడ్స్, డ్రైనేజీ వ్యవస్థకు కేటాయించామని అన్నారు. ప్రభుత్వ ధవాఖానలో సౌకర్యాల కోసం కృషి చేస్తున్నామని, ఇప్పటికే నిధులు కేటాయించామని అన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఇలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### నోరు అదుపులో పెట్టుకో..

తాను గతంలో ఎమ్మెల్సీగా ఉండి ప్రస్తుతం ఎమ్మెల్యేగా కౌశిక్‌రెడ్డి ప్రజలకు చేసింది ఏమి లేదని ప్రణవ్ అన్నారు. కౌశిక్ రెడ్డి ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరించారు. అల్లు అర్జున్ కేసు విషయంలో చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని, థియేటర్ దగ్గర మహిళ మరణించినప్పుడు స్పందించని కౌశిక్ రెడ్డి ఇప్పుడు స్పందించడం విడ్డూరంగా ఉందని, పబ్లిసిటి స్టంట్ కోసమే కౌశిక్‌రెడ్డి డ్రామాలని, అందుకే లేనిపోని అపోహాలు సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ప్రణవ్ అన్నారు. హుజూరాబాద్‌లో తన ఉనికి కోసం ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని, దీనిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. సిఎం ని విమర్శించే స్థాయి తనకు లేదని మండిపడ్డారు. ఇలాంటి చిల్లర ఆరోపణలతో రాజకీయ పబ్బం గడుపుకునే కౌశిక్ రెడ్డికి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ ఝాన్సీ రాణి రవీందర్, వైస్ చైర్మన్ దేశిని ఐలయ్య గౌడ్, డైరెక్టర్లు సముద్రాల కృష్ణ, శివ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపిటిసి సభ్యులు బాలసాని రమేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు పోడేటి బిక్షపతి, విష్ణుదాస్ వంశీ, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## సాగర్‌లో పర్యాటకుల ఆనందకేళి

**ప్రజాపక్షం/నందికొండ :** సాగర్‌లో పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం వరసగా రెండు రోజులు సెలవులు రావడంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో సేద తీరేందుకు ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున సాగర్ లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు సాగర్ అందాలను తిలకించడానికి వచ్చారు విద్యార్థులు,పర్యాటకులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. లాంచీలో నాగార్జునకొండకు వెళ్లి అక్కడి మ్యూజియంలోని విశేషాలు, బుద్ధుని అవశేషాలు, మాన్యుమెంట్స్ తదితర ప్రాంతాలను సందర్శించారు. అక్కడినుంచి సాయంత్రం వేళలో ఎత్తిపోతల, బుద్ధవనం తదితర ప్రాంతాలను సందర్శించారు. అదేవిధంగా రెండేళ్ల తర్వా త తెలంగాణ పర్యాటక శాఖ అందుబాటులోకి తెచ్చి న నాగార్జునసాగర్ శ్రీశైలం యాత్ర శనివారం రెండవసారి పూర్తిస్థాయి పర్యాటకులతో బయలుదేరిన లాంచి ఆదివారం సాయంత్రం తిరిగి సాగర్ చేరుకుంది నాగార్జునసాగర్ నుండి శ్రీశైలం కు లాంచి ప్రయాణం తమకు ఎంతో ఆనందాన్ని ఆహ్లాదాన్ని కలిగించిందని ప్రయాణికులు తమ అనుభూతిని వ్యక్తపరిచారు.

## గణేష్ ఆశయ సాధనకు పాటుపడాలి



**ప్రజాపక్షం/మునుగోడు:** మునుగోడు మండల ఏఐఎస్ఎఫ్ మాజీ మండల అధ్యక్షులు ఈదలకంటి గణేష్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీరుపారి వెంకటేశ్వర్లు కోరారు.ఆదివారం మునుగోడు మండలంలోని ఎల్లగల గూడెం గ్రామంలో ఈదుల కంటి గణేష్ 13వ వర్ధంతి సందర్భంగా ఆయన స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగా పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణి నిరసిస్తూ గణేష్ ఏఐఎస్ఎఫ్ నాయకునిగా అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు.తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఏఐఎస్ఎఫ్ జండా కింద అలుపెరగని పోరాటాలు నడిపారని గుర్తు చేశారు అకాల మృతి వెంటాడి మన వెంట లేకపోయినా ఆయన ఆశయ సాధన కోసం పాటుపడాలని ఈ సందర్భంగా కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు వెల్లగలగూడం మాజీ సర్పంచ్ సురిగి చలపతి,మండల కార్యవర్గ సభ్యులు ఈదులకంటి కైలాస్,ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు గోపగోని ఉదయ్,సిపిఐ గ్రామ శాఖ సహాయ కార్యదర్శి కె వెంకన్న,మాజీ వార్డు మెంబర్లు దాం వెంకన్న, కట్కూరి లింగస్వామి,గోపగోని సైదులు,బొంగు రాములు,ఈగల కంటి స్వామి,సునీత అండాలు,కవిత, గీత,తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి



**ప్రజాపక్షం/కోదాడరూరల్ :** కాంగ్రెస్ హయంలోనే గ్రామాలాభివృద్ధి జరుగుతుందని కోదాడ ఎంఎల్ ఎ పద్మావతిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని తొగ్రరాయి, గుడిబండి, కాపుగల్లు, చిమిర్యాల, మంగళితండా గ్రామాల్లో సుమారు నాలుగున్నర కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన అర్ అండ్‌బి రోడ్ల, పిఎసిఎస్ గొడౌన్, గ్రామ పంచాయతీ భవనంకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల అభివృద్ధికి మంత్రి ఉత్తమ్‌కుమార్ ఎక్కువ మొత్తం నిధులు విడుదల చేయిస్తున్నారని, మరిన్ని నిధులు సమకూర్చి నియోజక వర్గాల అభివృద్ధికి పాటుపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ వేనేపల్లి చందర్‌రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, చింతకుట్ల లక్ష్మి నారాయణరెడ్డి, కొండా సైదయ్య, మండల పార్టీ అధ్యక్షులు వరప్రసాదరెడ్డి, ఇర్ల సీతారాంరెడ్డి, సతీష్, పిఎసిఎస్ డైరెక్టర్లు సూర్యం, కొత్త రఘుపతి, మాజీ ఎంపిపి మల్లెల రాణి, బ్రహ్మయ్య, ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, అమరనేని వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

## ఎన్‌జిబి కాలనీలో ఉచిత వైద్య శిబిరం



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** నల్లగొండ పట్టణం లోని ఎన్‌జిబి కాలనీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి కాలనీ వాసులతో పాటు,ఇతరులకు ఉచిత వైద్యం అందించడం జరిగింది. శిబిరంలో ఉచితంగా బీపీ, షుగర్, థైరాయిడ్ టెస్టులతో పాటు ఉచితంగా మందులు కూడా ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని సంజీవని మెడికేర్ సొసైటీ అధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సిహెచ్. పవన్ కుమార్ టీం సహకారంతో నల్లగొండలోని ప్రముఖ ప్రసిద్ధిగాంచిన కంటి డాక్టర్ సి.హెచ్ పుల్లారావు, డాక్టర్ పెరుమాళ్ళ వరుణ్ కుమార్ జనరల్ ఫిజీషియన్, డాక్టర్ సోంబాబు, అధ్యక్షులు కాలేరు వీరేశం, ప్రధాన కార్యదర్శి సి.హె.చ్ మదనాచారి, కోశాధికారి గోవర్ధన్ రెడ్డి, ఆర్గనైసేడ్ సెక్రెటరీ దాసరి రాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## స్వాములకు అన్నదానం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో 26వ రోజు స్వాములకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మహా అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాములకు అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. నేడు ఉదయం 6గంటలకు అయ్యప్ప దేవాలయం నుంచి స్వామి వారి కలషం ఊరేగింపు నిర్వహించి పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నూకల వేణుగోపాల్‌రెడ్డి, గుడిపాటి నవీన్, దేశిడి శేఖర్‌రెడ్డి, గోదాల జానకిరాంరెడ్డి, బలుగూరి శ్రీనివాస్, లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.



# పరీక్ష కేంద్రాల్లో విస్తృత తనిఖీలు

### గట్టి బందోబస్తు మధ్య గ్రూప్ 2
### అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్
### పరీక్షా సెంటర్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం /నల్లగొండ ప్రతినిధి :** మొదటి రోజు నల్లగొండ జిల్లాలో నిర్వహించిన గ్రూప్2 పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఆదివారం నల్లగొండ, మిర్యాలగూడ పట్టణాలలో ఏర్పాటుచేసిన (87)కేంద్రాలలో గ్రూప్2 పరీక్షలు జరిగాయి. మొత్తం 29,118 మంది అభ్యర్థులు గ్రూప్2 పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, ఉదయం పరీక్షకు 14676 మంది హాజరు కాగా, 14,442 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 14,540 మంది హాజరుకాగా, 14578 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రారంభమైన తర్వాత జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నల్గొండ జిల్లా కేంద్రంలోని రామగిరి లోని మహిళ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ పరీక్ష కేంద్రానికి కేటాయించిన అభ్యర్థులు, హాజరైన ,గైర్హాజరైన అభ్యర్థుల వివరాలను చీఫ్ సూపరింటిండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అంతేకాక అక్కడ పరీక్షల నిర్వహణకు చేసిన ఏర్పాట్లు సైతం ఆమె పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కాకతీయ డిగ్రీ, పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సైతం తనఖీ అక్కడ వివరాలను చీఫ్ సూపరింటిండెంట్ ను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్ 2 పరీక్షల సందర్భంగా జిల్లాలో ఎలాంటి సంఘటనలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, తదితర శాఖల అధికారులకు కేటాయించిన విధులను తూ.చా తప్పకుండా పాటించాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు.మొదటిరోజు నిర్వహించిన గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని తెలిపారు.

### మిర్యాలగూడలో సబ్ కలెక్టర్ తనిఖీ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం గ్రూప్2 పరీక్షలు పకడ్బందీ





ఏర్పాట్ల నడుమ ప్రారంభమయ్యాయి. మిర్యాలగూడ పట్టణం, మండలంలో 28 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పేపర్1 పరీక్షల ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు పేపర్2 పరీక్ష మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు జరిగింది. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ నిర్వహించగా అభ్యర్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. 28 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 7941 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా పేపర్1 పరీక్షకు 3086 మంది హాజరై 4855 మంది గైర్హాజరు కాగా పేపర్2 పరీక్షకు 3062 మంది పరీక్ష రాయగా 4897 మంది గైర్హాజరయ్యారు. కాగా పరీక్షా కేంద్రాలను సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ తనిఖీ చేశారు. ఆయన వెంట తహసీల్దార్ హరిబాబు, రీజనల్ కోఆర్డినేటర్ వెంకటరమణ, రూట్ ఆఫీసర్లు ఎంఈవో బాలునాయక్, డి.ధర్మానాయక్, కొర్రకృష్ణకాంత్‌నాయక్, శివకుమార్, జాయింట్ రూట్ ఆఫీసర్లు సీఐ నాగరాజు, ఎస్ఐ శోభన్‌బాబు, వీరశేఖర్, సుధీర్, నరేష్, శేఖర్, రూరల్ ఎస్ఐ పి.లోకేష్ పాల్గొన్నారు.

గ్రూప్- 2 పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ హనుమనంత రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్ 2 పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ప్రారంభం అయ్యాయి. భువనగిరి పట్టణంలోని టైమ్స్, యూనిటీ, వెన్నెల కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆది వారం ఆకస్మికంగా తనిఖీ చేసి సిసి కెమెరాలను, అభ్యర్థుల హాజరు శాతం, బయోమెట్రిక్‌ను నిశితంగా పరిశీలించారు. ఆదివారం ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షకు జిల్లాలో మొత్తం 6078 మంది అభ్యర్థులకు గాను 2971మంది హాజరు కాగా, 3107 మంది గైర్హాజరు అయ్యారని అన్నారు. మధ్యాహ్నం సెషన్‌లో మొత్తం 6078 అభ్యర్థులకు గాను 2961 హాజరు కాగా, 3117 మంది గైర్హాజరు అయ్యారని తెలిపారు.

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్రూప్2 పరీక్షలు సూర్యాపేట జిల్లాలో ఆదివారం తొలిరోజు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేపర్ 1 జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటిస్ పరీక్షకు జిల్లాలోని 49 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 16857 మంది అభ్యర్థులకు గానూ 8608 మంది హాజరయ్యారని, 8249 మంది అభ్యర్థులు గైర్హజరైనట్లు, మధ్యాహ్నం జరిగిన పేపర్2 పరీక్ష హిస్టరి, పొలిటి అండ్ సోసైటి పరీక్షకు 8570 మంది అభ్యర్థులు హాజరుకాగా, 8287 మంది అభ్యర్థులు గైర్హజరైనట్లు కలెక్టర్ తెలిపారు.

**ప్రజాపక్షం/కోదాడ:** తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగ యువకులకు ప్రవేశపెట్టిన గ్రూప్2 పరీక్షల నిర్వహణ ఆదివారం తొలిరోజు ప్రశాంతంగా జరిగింది. మొత్తం 19సెంటర్లలో 7887 మంది విద్యార్థులకు గానూ ఉదయం 3605 మంది హాజరుకాగా, 4282 మంది గైర్హాజరైనట్లు, సాయంత్రం 3595 మంది హాజరుకాగా, 4292మంది గైర్హాజరైనట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలను రెవిన్యూ అధికారులు తనిఖీ చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు 144సెక్షన్ అమలు చేశారు.

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఆదివారం నిర్వహించిన గ్రూప్2 రాత పరీక్షకు సంబంధించిన పరీక్షా కేంద్రాలను అదనపు ఎస్పీ నాగేశ్వరరావు పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న సిబ్బందిని పరీక్షా కేంద్రాల సరళిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల, ఎస్వీ డిగ్రీ కళాశాల, విసి కాలేజీ ఆఫ్ ఎడ్యుకేషన్ పరీక్ష కేంద్రాలను సందర్శించారు.





# విద్యార్థులకు నాణ్యమైన భోజనం

### సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హాస్టల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/యాదాద్రి:** భువనగిరి పట్టణం లోని హనుమాన్ వాడలో గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ హనుమంత రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్ లేపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు అనుమతితో వెళ్లాలని అన్నారు. వంటగదిలో గల బియ్యం, పప్పులను, పాలు, పెరుగు, కూరగాయలు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు వండిన భోజనాన్ని, వండుతున్న వంటలు, ఉడకపెట్టిన గుడ్లను పరిశీలించారు. రోజు ఇదే విధంగా ఉండాలని సంబంధిత అధికారులకు తెలిపారు. మెనూ ప్రకారం వండాలన్నారు, విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఆహార విషయంలో శుచి, శుభ్రత పాటించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా పర్యవేక్షణ చేయాలనీ సంబంధిత అధికారులను ఆదేశించారు. చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం విద్యార్థులు చదువుతున్న క్లాస్ రూమ్‌కి వెళ్లి చదువుతున్న తీరును పరిశీలించారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గణితం సబ్జెక్టుపై ప్రాబ్లమ్స్‌ను బ్లాక్ బోర్డుపై వివరించారు. అనంతరం రెసిడెన్షియల్ స్కూల్లో ఇంకా పూర్తి కాకుండా ఉన్న డార్మటరీ హాల్ ను పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సంబంధిత అధికారులు నిధులు లేక పనులు ఆగిపోయాయని కలెక్టర్‌కు వివరించగా వెంటనే తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సెక్రెటరీ అలుగు వర్షినితో మాట్లాడి పరిస్థితులను వివరించారు. త్వరగా నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అండ్ యూత్ వెల్ఫేర్ అధికారి ధనంజనేయులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## డబుల్ బెడ్రూమ్ ఇండ్ల కాలనీలో మౌలిక సదుపాయాలు : ఎంఎల్‌ఏ



**ప్రజాపక్షం/దేవరకొండ :** పట్టణ పరిధిలోని డబుల్ బెడ్రూం ఇండ్ల కాలనీలో మౌలిక వసతుల కల్పన, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ బాలునాయక్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని పేదిటి కలను సాకారం చేసేందుకే డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలు, వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లాంటి బృహత్తర కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని అన్నారు. గూడు లేని వారి గోస తీర్చడానికి ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళలా ప్రభుత్వం ముందుకు వెలుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, దేవేందర్, వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు యూనుస్, వెంకటేష్‌గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ శ్రీశైలం, మాజీ ఎంపిపిలు భవాని, బిక్కు, కృష్ణయ్య, హరికృష్ణ, ఏఈ రాజేష్, డిఈ విద్యాసాగర్, పిఆర్‌డిఈ లింగారెడ్డి, పిఆర్ఏఈ శంకర్, ఆర్‌డ బ్ల్యూఎస్ ఏఈ హుస్సేన్, మునిసిపల్ ఏఈ రాజు, కాంట్రాక్ట్ సంతోష్ పాల్గొన్నారు.

### శ్రీ షిరిడి సాయి బాబా ఆశీస్సులు పొందాలి

దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని శిరిడి సాయిబాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరూ పొందాలని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకొని వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటి సభ్యులు ఎంఎల్ఏ బాలునాయక్‌కు శాలువాతో సత్కరించారు. అనంతరం భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ వారు మిలియనీర్ ఆఫ్ ద ఇండియన్ అగ్రికల్చర్ అవార్డుకు ఎంపిక చేసిన సందర్భండగా లోకసాని పద్మారెడ్డిని ఎంఎల్ఏ బాలునాయక్ శాలువాతో సత్కరించారు. ఈకార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

# నిరుద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

### 16న చలో అసెంబ్లీ ముట్టడిని విజయవంతం చేయండి
### పివైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్

**ప్రజాపక్షం/మోటకొండూర్:** తెలంగాణలోని అన్ని ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగలను భర్తి చేయాలనీ డిమాండ్ చేస్తూ డిసెంబర్ 16వ తేదీన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనీ ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్ నిరుద్యోగులకి పిలుపునిచ్చారు. ఆలేరు, మోటకొండూర్ పివైఎల్ ముఖ్య కార్యకర్తలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజు రోజుకు తీవ్రతరం అవుతున్నదని, నిరుద్యోగుల సమస్య పరిష్కారం చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని, బిస్వాల్ కమిటీ నివేదిక ప్రకారం అన్ని ప్రభుత్వ శాఖలలో 1.91 లక్షల ఉద్యోగాలు ఖాళీగానే ఉన్నాయని ప్రభుత్వం ప్రకటన చేసినప్పటికీ నోటిఫికేషన్ ఇవ్వడం లేదని, గత కెసిఆర్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం తన లెక్కలో వేసుకోవడం దారుణం అని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ పచ్చి బుటకం అని, ప్రభుత్వం ఖాళీ ఉద్యోగం పై ఒక శ్వేత పత్రం విడుదల చేయాలనీ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వలన బిసి,ఎస్‌సి,ఎస్‌టి, మైనారిటీ నిరుద్యోగులు తీవ్రంగా నష్ట పోతున్నారని,



ఇది బహుజన, దళిత, గిరిజన ప్రజలని మోసం చేయడమే అని, వెంటనే ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ని రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని అన్నారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా గంజాయి, డ్రగ్స్ దొరకడం వలన యువత మత్తుకి బానిసలుగా మారుతున్నారని వెంటనే డ్రగ్స్ ను అరికట్టాలని, నిరుద్యోగ సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 16 వ తేదీన చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంకి నిరుద్యోగులు వేలాదిగా తరలి రావాలని నిరుద్యోగులకి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ జిల్లా అధ్యక్షులు సాధుల శ్రీకాంత్, జిల్లా సహాయ కార్యదర్శి చిరబోయిన బాలకృష్ణ, కోశాధికారి షకిలం వెంకటేష్, నాయకులు ఆకుల కృష్ణ, ఆర్.ఉదయ్, అరుణ్, నరేష్, ప్రమోద్ పాల్గొన్నారు.

## కమ్యూనిస్టులు లేకుంటే ప్రజాస్వామ్య మనుగడకు ముప్పు

**ప్రజాపక్షం/ రామన్నపేట:** కమ్యూనిస్టులు లేకుంటే ప్రజాస్వామ్య మనుగడకు ముప్పు వాటిల్లక తప్పదని సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 1925 డిసెంబర్ నుంచి ఈ సంవత్సరం డిసెంబర్ వరకు వంద సంవత్సరంలోకి అడుగుపెడుతుందనానరు. వంద సంవత్సరాల ఉద్యమంలో దేశ వ్యాప్తంగా పార్టీ ఖ్యాతి సంపాదించిందన్నారు. ఎంతో మంది త్యాగమూర్తులను అందించిందని, నిఖార్సైన నాయకులు కమ్యూనిస్టు పార్టీలోనే ఉన్నారన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో అనేక మంది ప్రాణ త్యాగాలు చేశారన్నారు. అనేక పార్టీలు దేశంలో ఉద్భవించి కాలగర్భంలో కలిసిపోయాయని, కమ్యూనిస్టు పార్టీలు మాత్రం అజేయంగా ఉన్నారన్నారు. నగరంలో, పట్టణంలో, గ్రామాల్లో ప్రజలతో మమేకమై ప్రజా సమస్యల గొంతుకగా నిలబడింది కమ్యూనిస్టులేనన్నారు. నేటి పాలకులు పేద ప్రజలకు మేలు చేయకుండా కార్పోరేట్ శక్తులకే మేలు చేస్తూ వారి ఆర్థిక బలోపేతానికి కృషి చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి శివరాత్రి సమ్మయ్య, సీనియర్ నాయకులు బాలగోని మల్లయ్య, గంగాపురం వెంకటయ్య, ఏనూతల రమేష్, ఉట్కూరి కృష్ణ, కల్యాణ్, యాదగిరి, సీహెచ్.మల్లేశం, కల్యాణ్, మత్స్యగిరి, పట్ల నరసింహ పాల్గొన్నారు.



# స్వచ్ఛంద సంస్థల వైద్య శిబిరాలు అభినందనీయం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** స్వచ్ఛంద సంస్థలు వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేద ప్రజలకు సేవలు అందించడం అభినందనీయమని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బేబిమూన్ స్కూల్‌లో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యశోద ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనారోగ్యంతో ఉన్న పేదలు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు చేయించుకోవాలంటే ఆర్థికభారంతో సతమవుతున్నారని, అలాంటి వారికి ఇలాంటి వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడుతాయని చెప్పారు. హైద్రాబాద్ యశోద ఆసుపత్రికి చెందిన 13 మంది వైద్యులు, సిబ్బంది వైద్య శిబిరంలో పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. గతంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సతీమణి వరూధినిదేవి జ్ఞాపకార్థం ఉచిత శిబిరాలు ఏర్పాటు చేసి ఎంతో మందికి కంటి ఆపరేషన్లు చేసినట్లు గుర్తు చేశారు. అనంతరం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థి మండడి రోహిత్‌కు లాప్‌టాప్‌ను అందజేశారు. వైద్య శిబిరానికి ప్రముఖ వ్యాపారి యామా ప్రభాకర్ రూ. 15వేలు ఆర్థికసాయం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, పట్టణ అధ్యక్షులు అంజద్ అలీ, నాయకులు పోలేబోయిన నరసయ్య యాదవ్, కరిముల్లాబేగ్, కరుణాకర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు గోదల రంగారెడ్డి, మహేందర్ రెడ్డి, సునీల్ రెడ్డి పాల్గొన్నారు.

# రాజ్యాంగం నీడలోనే అందరికీ రక్షణ

సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యుడు
చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/గోదావరిఖని :** బిజెపి, ఎన్‌డిఎతో భారత రాజ్యాంగానికి ప్రమాదమని, రాజ్యాంగం నీడలోనే అందరికి రక్షణ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం గోదావరిఖనిలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంటు బొంకూరి మధు, ఆలయ ఫౌండేషన్ డిప్యూటీ సిఇఒ మిట్టపల్లి రాజేంద్రకుమార్ పర్యవేక్షణలో, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైస రాజేష్ అధ్యక్షతన మహాత్మ జ్యోతిరావు పూలే, బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహాలకు జ్ఞానమాల కార్యక్రమాన్ని చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి, హెచ్ఎంఎస్ కేంద్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రియాజ్ అహ్మద్, నారాయణ, సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందంలు పూలే, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాంపల్లి సతీష్, రాష్ట్ర కార్యదర్శి మంతెన లింగయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఇరుగురాల కిష్టయ్య, ఆలయ ఫౌండేషన్ సభ్యులు అర్నకొండ వెంకటేశ్వర్లు, అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కోకన్వీనర్లు ఆకునూరి బాల అంకూష్, ఇండిబెల్లి రవీందర్‌కుమార్, జి.శశిభూషణ్, జనగామ రాజనర్సు, పెగడపల్లి నారాయణ, ఆకునూరి రాజయ్య, ఎండి.నవాబ్, శనిగరపు రామస్వామి, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు కందుకూరి రాజారత్నం, సిపిఐ, ఎఐటియుసి నాయకులు ఎం.ఎ.కరీం, శనిగరపు చంద్రశేఖర్, బహుజన్ సమాజ్‌పార్టీ ప్రధాన కార్యదర్శి మారపల్లి రవికుమార్, నాయకులు తూల్ల నాగరాజు, పంజా అశోక్, పెరిక రవి, ఇందారపు రవి, కాశిపాక రాజమౌళి, దొమ్మటి శేఖర్, ఉప్పులేటి పవన్‌కుమార్, కోరే శంకర్, శోభన్, డప్పు మల్లేష్,రామగిరి రమేష్, మడిపెద్ది రమేష్, రాజు, రామస్వామిలు పాల్గొన్నారు.

# చేర్యాల గురుకుల పాఠశాల ప్రిన్స్‌పాల్‌పై చర్యలు తీసుకోవాలి

ఎఐఎస్ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌కె యూసిన్



**ప్రజాపక్షం/చేర్యాల:** చేర్యాల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్స్‌పల్ పుల్లయ్యపై వెంటనే చట్టపరమైన చర్యలు తసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌కె. యూసిన్ డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన ఆదేశాల మేరకు ఆదివారం విద్యార్థి సంఘం నాయకులు హాస్టల్ వసతి గృహం సందర్శన కోసం వెళ్ళడంతో అనుమతి లేదని జిల్లా కలెక్టర్, సంక్షేమ వసతి గృహల సెక్రెటరీ పర్మిషన్ లేటర్ ఇస్తేలోనికి అనుమతిస్తానని ప్రిన్స్‌పల్ తెలుపడంతో విద్యార్థి సంఘాల నాయకులు గేటు ముందు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ గతంలో సంక్షేమ వసతి గృహంలో అనేక అక్రమాలు జరిగాయాని అందులో భాగంగానే ప్రిన్స్‌పల్ ఆరోపనలు ఎదుర్కొన్నాయని నాణ్యమైన భోజనం అందించాలని పలు మార్లు విజ్ఞప్తి చేసిన పట్టించుకున్న పాపన పోలేదని,వంట సామాగ్రి, బియ్యం తదితర సరులకు దొడ్డి దారున పడుతున్నాయని అన్నారు. అవినీతికి కేంద్రంగా చేర్యాల గురుకుల పాఠశాల ఉందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ పక్షాన డిమాండ్ చేవారు. ఈ కార్యక్రమంలో అవినాష్, అరవింద్, నరేందర్, అభి తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి బండిని కలిసిన టిజిఒలు



**ప్రజాపక్షం/కరీంనగర్:** ఇటీవల తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ కరీంనగర్ జిల్లాలో ఏకగ్రీవంగా ఎన్నికైన (టిజిఒ) సంఘ నాయకులు ఎంప్లాయిస్ జెఎసి చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపి బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి సంఘ సభ్యులను పరిచయం చేశారు. ఈ సంధర్బంగా కరీంనగర్ జిల్లా టిజిఒ అధ్యక్ష కార్యదర్శులు మడిపల్లి కాళీచరణ్, అరవింద్ రెడ్డిలతో పాటు కార్యవర్గాన్ని బండి సంజయ్ అభినందించారు. ఈ సందర్బంగా టిఎన్‌జిఒలు, టిజిఒలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పరిధిలో తమకు ఎలాంటి భద్రత, భరోసా, గ్యారెంటీ లేని కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం(సిపిఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఒపిఎస్)ను పునరుద్ధరించే విధంగా, ఆదాయ పన్ను పరిమితిని ఐదు లక్షల నుంచి 10 లక్షల వరకు పెంచేందుకు చొరవ చూపాలని కోరారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కేంద్ర ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. టిఎన్‌జిఒల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, టిజిఒఎస్ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి కాళీచరణ్ గౌడ్, కార్యదర్శి అరవింద్‌రెడ్డి, టిఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, ట్రెజరీ డిడి నాగరాజు, లైబ్రేరియన్ రామ్మోహన్, వెంకటేశ్వర్ రావు, రామచంద్రారెడ్డి, నాయకులు రాజేశ్వరి, గడ్డం సుధాకర్, లక్ష్మి నరసింహారావు, రోహిత్, వీణ, మమత, అభినయ్, రాజు, కొండాల్‌రెడ్డి, రాజ మహేందర్, చంద్రకళ, రాజశేఖర్, జోయల్, రాకేష్, తదితరులున్నారు.

# తెలంగాణ తల్లిని విమర్శిస్తే పుట్టగతులుండవు

యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్



**ప్రజాపక్షం/చొప్పదండి:** తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎవరైనా విమర్శిస్తే వారికి పుట్టగతులు ఉండవని మండల యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తోడేటి విద్యాసాగర్ అన్నారు. ఈ సందర్భంగా చొప్పదండిలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం ఎంతో నైపుణ్యంతో ఉందన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహం పార్టీ రంగుతో వారికి అనుకూలంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ గీ తాన్ని ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వం రూపొందించి న తెలంగాణ తల్లి విగ్రహాన్ని విమర్శిస్తే సహించేది లేదని విద్యాసాగర్ హెచ్చరించారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి డా. బాబా సాహెబ్ అంబేద్కర్

**ప్రజాపక్షం / ధర్మపురి :** భారత రాజ్యాంగ, నిర్మాత, అణగారిన వర్గాల ఆశాజ్యోతి డా. బి.ఆర్. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం తిమ్మాపూర్ గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆదివారం సంఘ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అడ్లూరి మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన చట్టం ద్వారా కల్పించిన రిజర్వేషన్లతో తాను ఎమ్మెల్యేగా ఉన్నానని చెప్పారు. చిలుముల లక్ష్మణ్, కాళ్ల సత్తయ్య, దాసరి భీమయ్య, సాయిని సత్యనారాయణ పాల్గొన్నారు.

# గ్రూప్-2 పరీక్షలకు 49 శాతం హాజరు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్ 2 పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ కరీంనగర్ జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. జిల్లాలోని కరీంనగర్‌తో పాటు తిమ్మాపూర్, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల్లో 26,978 మంది అభ్యర్థుల కోసం 56 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆది, సోమవారాల్లో ఉదయం, మధ్యాహ్నంతో సెషన్లతో కలిపి నాలుగు పేపర్లు రాయాల్సి ఉండగా ఆదివారం రెండు పేపర్లు పూర్తయ్యాయి. కాగా ఉదయం సెషన్‌లో పేపర్ 1లో 26978 మందికి గాను 13273 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 13705 మంది గైర్హాజరు కాగా 49.20 శాతం హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లోని పేపర్ 2లో 26978 మందికి గాను 13135 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 13843మంది గైర్హాజరయ్యారు. 48.69 శాతం గైర్హాజరయ్యారు. సగటున 50 శాతం మంది విద్యార్థులు గైర్హాజరు కావడం శోచనీయం. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదివారం ప్రభుత్వ గర్ల్స్ జూనియర్ కళాశాలతో పాటు ప్రభుత్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో గల పరీక్షల కేంద్రాలను సందర్శించారు. ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో అంధత్వ అభ్యర్థి సహాయకురాలి సహాయంతో పరీక్ష రాస్తుండడాన్ని కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. పరీక్ష ముగిసిన తర్వాత జవాబు (ఓఎంఆర్) పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని , సిబ్బంది అంతా పరీక్షలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా? లేదా? అన్నది గమనించి పలు సూచనలు చేశారు. ఆది సోమవార్లా ఉదయం, మధ్యాహ్నం చొప్పున మొత్తం నాలుగు సెషన్లలో జరిగే గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు.

**పకడ్బందీగా ఏర్పాట్లు:** ఆదివారం ఉదయం జడ్పీ కార్యాలయం వద్ద గల స్ట్రాంగ్ రూం నుంచి గ్రూప్ 2 పరీక్షల ప్రశ్నాపత్రాల తరలింపు ప్రక్రియను అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించారు. అనంతరం ఆయన అల్ఫోర్స్ కళాశాల, ఎస్సారార్ కళాశాల, తిమ్మాపూర్‌లోని జ్యోతిష్మతి కళాశాల పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. జిల్లాలో గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని తెలిపారు.

# ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

సిపిని కోరిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/గంగాధర:** నాలుగు మండలాలకు ప్రధాన కూడలిగా ఉన్న గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో ట్రాఫిక్ రద్దీతో ప్రజలు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదివారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతిని కోరారు. ట్రాఫిక్ నియంత్రణ లోపించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ట్రాఫిక్ రద్దీతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఆర్టీసీ బ స్సులను రోడ్డుపై నిలపకుండా చర్యలు తీసుకోవాలని డి పో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఎమ్మెల్యే వినతి మేరకు కరీంనగర్ సిపి అభిషేక్ మొహంతి సానుకూలం గా స్పందించి ట్రాఫిక్ నియంత్రణ కోసం చౌరస్తాలో పోలీస్ కానిస్టేబుల్‌ను డ్యూటీలో ఉంచుతామని తెలిపారు. ఆర్టీసీ బస్సులను రోడ్డుపై నిలపకుండా చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ ఎమ్మెల్యేకు తెలిపారు.

# విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించాలని, తల్లిదండ్రులు సైతం పిల్లలను ప్రోత్సహించాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ప్రతి ఆదివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో మాస్క్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు (సప్తగిరి, రాంనగర్ జడ్పి ఉన్నత పాఠశాలలు, చింతకుంట ప్రాథమిక పాఠశాల) పలు అంశాలపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఆత్మవిశ్వాసం, గ్రూప్ యాక్టివిటీస్, రీడింగ్ స్కిల్స్, స్టోరీ టెల్లింగ్, నటన, మెమొరీ ఇంప్రూవ్‌మెంట్, వ్యక్తిత్వ వికాసం, బాడీ లాంగ్వేజ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం విద్యార్థులు ప్రదర్శించిన పలు నాటికలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, మంచి శిక్షణ అందించాలని నిర్వాహకులకు సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటే మనలోని భయం తొలగి ప్రతిభ బయటకు వస్తుందన్నారు. సృజనాత్మకత పెరుగుతుందన్నారు. చదువును సీరియస్‌గా తీసుకుంటూ ప్రతి ఆదివారం శిక్షణ తరగతులకు హాజరుకావాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సందేశాత్మక చిత్రాలు చూపించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్ రెడ్డి, మాస్క్ ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ భూనాత చారి, ఇన్‌స్ట్రక్టర్ శివరాంరెడ్డి, కోఆర్డినేటర్‌వంగళశ్రీధర్, పలువురువిద్యార్థులతల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎంఆర్‌పిఎస్ గ్రామ అధ్యక్షుడి నియామకం



**ప్రజాపక్షం/చొప్పదండి:** చొప్పదండి మండలంలోని రుక్మాపూర్, కాట్నపల్లి ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలను చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ శంకర్ మాదిగ, మండల అధ్యక్షుడు సిపెల్లి నరేష్ మాదిగ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా కమిటీలను ఎన్నుకున్నారు. రుక్మాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడుగా పిరిశెట్టి కొమురయ్య, కాట్నపల్లి ఎమ్మార్పీఎస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా కడారి సంపత్ రాజ్, ఎంఎస్‌పి గ్రామశాఖ అధ్యక్షుడిగా చిలక శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఈ నెల 17న కరీంనగర్‌లో జరగనున్న ఎమ్మార్పీఎస్ మహాసభకు ముఖ్య అతిథిగా వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హాజరవుతున్న సభను మాదిగ కులబాంధవులు, మేదావులు, విద్యావంతులు, యువకులు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర నాయకులు చిలుముల రాజయ్య పిలుపునిచ్చారు. కార్యక్ర

# రైతు సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** నిజాయితీగా పని చేస్తే ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందని, రైతు సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. ఆదివారం రోజున పెద్దపెల్లి వ్యవసాయ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరైన అనంతరం నూతన పాలకవర్గంచే మార్కెట్ రీజనల్ డైరెక్టర్ పద్మావతి ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్ ఈర్ల స్వరూప, వైస్ చైర్మన్ కూర మల్లా రెడ్డి, పాలకవర్గం సభ్యులుగా ఆళ్ల సుమన్ రెడ్డి (పోత్కపల్లి సింగిల్ విండో చైర్మన్ ), కొమ్ము కర్ణాకర్ (గౌరెడ్డిపేట),సోమ చంద్రయ్య (రాగినేడు), మాడగోని శ్రీనివాస్ గౌడ్ (గురాంపల్లి), కొలిపాక కనకయ్య (కనగర్తి), వేగోళపు పెద్ద రాజేశం (తుర్కల మద్దికుంట), పిట్టల కొమురయ్య (పిట్టల ఎల్లయ్యపల్లి కనగర్తి), గౌస్ మియా (అందుగులపల్లి), గోపతి సదానందం (ఓదెల), కొల్లూరి రాంచంద్రం (కొలనూరు), తిప్పారపు ప్రభాకర్ (గూడెం), సరోత్తం రెడ్డి (పెద్ద బొంకూర్), ఎర్ర మహేందర్ (పెద్దపల్లి) ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణా రావు నూతన పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో రైతులు అరిగోస పడ్డారని, ధాన్యం కోతల పేరుతో రైతుల సొమ్ములు దోచుకున్నారని మండిపడ్డారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో ఎలాంటి కోతలు లేకుండా మద్దతు ధరకు రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేశామని, సన్నవడ్లకు క్వింటాలుకు రూ. 500 /బోనస్ చెల్లిస్తున్నామని అన్నారు. యాసంగిలో కూడా సన్నవడ్లకు రూ. 500/ బోనస్ చెల్లిస్తామని రైతులు ధైర్యంగా ఉండాలని సూచించారు. మరో వారంలో ధాన్యం కొనుగోళ్ళు పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అ న్నయ్య గౌడ్,జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, ఉన్నత శ్రేణి మార్కెట్ కార్యదర్శి పృథ్వీరాజ్,మార్కెట్ చైర్మన్లు ఈర్ల స్వరూప, ప్రకాష్ రావు, తిరుపతి రెడ్డి, విండో చైర్మన్లు నరసింహ రెడ్డి, చింతపండు సంపత్, నాయకులు గోపగాని సారయ్య గౌడ్, నూగిల్ల మల్లయ్య, బండారి రాంమూర్తి, జడల సురేందర్, మస్రత్, బొడ్డుపల్లి శ్రీనివాస్, బూతగడ్డ సంపత్, తదితరులు పాల్గొన్నారు.

# కస్తుర్బా గాంధీ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్సీ కవిత



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ / సారంగాపూర్:** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని కస్తుర్బాగాంధీ పాఠశాలను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ జెడ్పి చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ ఆదివారం సందర్శించారు. పెంచిన డైట్ చార్జీలను కస్తుర్బాపాఠశాలకు వర్తింపజేయకపోవడం బాధాకరమన్నారు. కస్తుర్బాపాఠశాలకు కూడా పెంచిన డైట్ చార్జీలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 472 కస్తుర్బాపాఠశాలలు ఉన్నాయని, విద్యార్థులందరికి పౌష్టికాహారం అందించాలన్నారు. సర్వ శిక్ష అభియాన్ కింద పాఠశాలలో పని చేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేస్తామని గతంలో రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, ఈ ఉపాధ్యాయులందరిని కూడా రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ మొదలుపెట్టిన గురుకుల పాఠశాలల లక్ష్యాన్ని దెబ్బతీయకూడదని అన్నారు. విద్యార్థులకు ఆహారం అందించే విషయంలో ప్రభుత్వం రాజీ పడకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు తేలు రాజు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సాగి సత్యంరావు, నాయకులు ఎండబెట్ల ప్రసాద్, బాదినేని వెంకటేష్, అత్తినేని నరేస్, సాంబారి గంగాధర్, జగన్, అరవింద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గజమాలతో ఘన స్వాగతం పలికిన బిఆర్ఎస్ శ్రేణులు

**జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లాలో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆదివారం రోజున పర్యటించారు. జగిత్యాల మండలంలోని ధరూర్ గ్రామ బైపాస్ వద్ద ఎమ్మెల్సీ కవితకు గజమాలతో ఘన స్వాగతం పలికిన బీఆర్ఎస్ శ్రేణులు. పెద్దసంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తరలివచ్చారు. ధరూర్ గ్రామంలోని బైపాస్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ కవిత పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళలతో కలిసి కవిత బతుకమ్మ ఆడారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ జగిత్యాల అంటేనే బిఆర్ఎస్ అడ్డా అని మీ అందర్నీ చూస్తే తెలిసిపోతుందని అన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణ తల్లిని, బతుకమ్మను దూరం చేస్తున్నారని ఆమె మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్, జగిత్యాల జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ దావా వసంత సురేష్, జగిత్యాల జిల్లా, మండల, గ్రామల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్‌లో పక్కా సమాచారం మేరకు ఒక కిలో 655 గ్రాముల నిషేధిత గంజాయిని పోలీసులు పట్టుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బీహార్ రాష్ట్రానికి చెందిన సుపాల్ మండలం, సూర్జాపూర్ గ్రామానికి చెందిన నీరజ్ కుమార్ (19) కరీంనగర్‌లోని అశోక్ నగర్‌లో నివాసం ఉంటూ కూలీ పనిచేసుకుని జీవిస్తున్నాడు. ఇతని ఇద్దరు అన్నలు, తల్లిదండ్రులు సూర్జాపూర్‌లోనే ఉంటూ కూలీ పనిచేసుకుంటున్నారు. గత ఎనిమిది నెలల క్రితం కరీంనగర్‌కు కూలీ పనిచేసుకుని డబ్బులు సంపాదించడానికి వచ్చాడు. ఐదె నెలల క్రితం తిరిగి స్వగ్రామం సూర్జాపూర్ వెళ్లిపోయి అక్కడ చాలా మంది నిషేధిత గంజాయిని అమ్ముతుండగా ఇతరు గంజాయి త్రాగుటకు అలవాటు పడ్డాడు. గంజాయి అమ్మి అధిక లాభం సంపాదించాలని నిర్ణయించుకుని ఇతని స్వగ్రామంలో గంజాయి కొనుక్కుని కరీంనగర్‌లో అమ్మాలని నిర్ణయించుకుని అదే క్రమంలో 15 రోజుల క్రితం రెండు వేల రూపాయలకు రెండు కిలోల గంజాయిని కొనుగోలు చేసుకుని ట్రైన్‌లో కరీంనగర్ తీసుకువచ్చాడు. అప్పటి నుంచి అందులో నుంచి కొంత గంజాయిని ఇతను త్రాగటానికి వాడుకుని మిగిలిన గంజాయిని ఎవరికైనా అమ్మి అధిక లాభం సంపాదించాలనే ఉద్దేశ్యంతో గంజాయిని తీసుకుని ఇతని రూమ్ నుంచి బయలుదేరి బొమ్మ వెంకన్న బిల్డింగ్ వైపు నుంచి కాపు వాడ బైపాస్ వైపు పాలిథిన్ కవర్‌లో తీసుకుని వెళ్తుండగా అక్కడ గౌరిశెట్టి కాంప్లెక్స్‌లో దగ్గరలో పోలీస్ వాహనాన్ని చూసి పారిపోదామని ప్రయత్నించాడు. అతని వద్ద గంజాయితో ఉన్న పాలిథిన్ కవర్ యుక్తంగా పట్టుకుని 1 కేజి 655 గ్రాముల గంజాయిని , ఒప్పో సెల్‌ఫోన్‌ను స్వాధీన పర్చుకున్నారు. అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

# పరీక్ష కేంద్రాల్లో కలెక్టర్ మనుచౌదరి తనిఖీ

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** టిజిపిఎస్సీ గ్రూపు 2 పరీక్ష మొదటి రోజు ప్రశాంతంగా ముగిసాయి. ఆదివారం జరిగిన గ్రూపు పరీక్షలకోసంపట్టణంలో 37 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం అధికార యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టిబందోబస్తును, 144 సెక్షన్ ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రంలోకి రెండుగంటల ముందు నుండి అభ్యర్థులను క్షుణ్ణంగా తనికీ చేసిన తర్వాత కేంద్రంలోకి అనుమతించారు. పరీక్ష కేంద్రం ఆలస్యంగా వచ్చిన పలువురు అభ్యర్థులు వెనుతిరిగారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో టిజిపిఎస్సీ గ్రూపు2 పరీక్ష కోసం మెరిడియన్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ నూతనోన్నత పాఠశాల, బిఎంఆర్ డిగ్రీ, పిజీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను జిల్లా కలెక్టర్ మనుచౌదరి అకస్మీకంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థుల రాస్తున్న పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు రాస్తున్న పరీక్షలను పరిశీలించి పరీక్ష సమయానికి ప్రారంభంకావటానికి ఏవైన సమస్యలు తలెత్తాయా? ఎన్ని గంటలకు పరీక్ష పేపర్లు, పరీక్ష కేంద్రాలకు వచ్చాయి? ఎంతమంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని అడిగి తెలుసుకున్నారు. బయోమెట్రిక్ అటెండన్స్‌ను పరిశీలించి బయోమెట్రిక్ ద్వారా అటేండన్స్ పరిశీలించి బయోమెట్రిక్ అటెండెన్స్ ద్వారా ఏవైన సాంకేతిక సమస్యలు తలెత్తాయా అని పరీక్ష చీఫ్ సూపరింటెండెంట్లు, ఫ్లయింగ్ స్కాడ్‌హరూట్ అధికారులు అడిగి తెలుసుకున్నారు అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్ష రాసేందుకు ఏలాంటి ఇబ్బందులు లేకుండ చూసుకోవాలని ఆదేశించారు.



ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ఉదయం గ్రూపు 2 మొదటి పేపర్‌లో మధ్యాహ్నం రెండవ పేపర్‌లో ప్రశాంతంగా జరిగింది. 37 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 13717 మందికి అభ్యర్థులను కేటాయించగా మొదటి పేపర్‌లో 5106 శాతం, 7005 మంది హాజరుకాగా 6712 మంది గైర్హా.జరైనారు. రెండో పేపర్‌లో 50.70 శాతంతో 6955 హాజరుకాగా, 6762 గైర్హాజరైనారు. సోమవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 3వ పేపర్, మధ్యాహ్నం 3 గంటల నుండి 5.30 గంటల వరకు నాల్గవ పేపర్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం పరీక్షకు 9.30 గంటల లోపు, మధ్యాహ్నం 2.30 గంటల లోపు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు సమాయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. ఆలాగే సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ అనురాధ బందోబస్తును పర్యావేక్షించారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు కలెక్టర్ స్వాగతం



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు సిద్దిపేటలో జిల్లా కలెక్టర్ మనుచౌదరి మర్యాద పూర్వకంగా కలసి పూలమొక్కను అందించి స్వాగతం పలికారు. ఆదివారం స్థానిక టూరిజం మినర్వ హోటల్‌కు వచ్చిన సందర్భంగా జిల్లా కలెక్టర్ మనుచౌదరి మర్యాద పూర్వకంగా కలసి పూలమొక్కను అందచేశారు. జిల్లాలో ఒక వివాహ విందులో పాల్గొనటానికి వచ్చిన సందర్భంగా కలెక్టర్ కలసి స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో ఎసిపి మధు తదితరులు హాజరైనారు.

# ఘనంగా మల్లన్న స్వామి జాతర

**ప్రజాపక్షం /గొల్లపల్లి :** సల్లంగా చూడు దొంగ మల్లన్న స్వామి అంటూ భక్తుల శరణు ఘోషలతో ఆలయ పరిసర ప్రదేశాలు ప్రతిధ్వనించాయి. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని మల్లన్న పేట గ్రామంలో జరుగుతున్న శ్రీ మల్లికార్జున స్వామి (దొంగ మల్లన్న) జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా రెండవ బుధవారం జాతర అశేష భక్తజనంతో జాతర పరిసర ప్రదేశాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. అర్చకులు రాజేందర్ శర్మ స్వామివారిని ప్రత్యేక పుష్పాలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఉపవాస దీక్షలతో మల్లన్న స్వామికి ప్రీతిపాత్రమైన బెల్లం పానకంతో వండిన బోనాలను నెత్తిన ఎత్తుకొని, బంతిపూల హారంను మెడలో ధరించి ఆలయం వద్దకు ఊరేగింపుగా తరలివచ్చారు. దర్శన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గొల్లపల్లి ఎస్సై చిర్ర సతీష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఆదివారం సుమారు 25 వేల మంది దర్శనం చేసుకున్నారు. టికెట్ల ద్వారా ఆదాయం 96,030 రూ. సమకూరినట్లు ఆలయ ఈవో విక్రమ్ గౌడ్, ఆలయ ఫౌండర్ ట్రస్టీ కొండూరి శాంతయ్య తెలిపారు.

# కనుకుల మాజీ సర్పంచ్ నారాయణ రెడ్డి మృతి



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండలం కనుకుల గ్రామం మాజీ సర్పంచ్ కసిరెడ్డి నారాయణరెడ్డి గుండెపోటుతో మరణించారు. నారాయణ రెడ్డి కనుకుల గ్రామ సర్పంచిగా 1976 సంవత్సరం నుండి 1986 సంవత్సరం వరకు పది సంవత్సరాలు రెండు పర్యాయాలుగా గ్రామానికి చాలా సేవలందించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని స్వర్గలో క ప్రాప్తి పొందాలని కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

## నేడు 'ప్రజావాణి' రద్దు

ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ గ్రూప్–2 పరీక్షల నేపథ్యంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అధికారులు, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ గ్రూప్ 2 పరీక్షల విధులలో ఉన్నందున ఎవరు అందుబాటులో ఉండరని , ప్రజలు దీనిని గమనించి సోమవారం ప్రజావాణి దరఖాస్తులతో కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని కలెక్టర్ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

## ఆల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్‌కు అనూహ్య స్పందన



ప్రజాపక్షం/బైంసా : శ్రీనివాస రామానుజన్ సేవలు చాలా విశిష్టమైనవని చేసిన కృషి చాలా చారిత్రాత్మకమైనదని,మరవలేనిదని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు.బైంసా పట్టణంలోని అల్ఫోర్స్ పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ స్మారకార్థం నిర్వహించినటువంటి అల్ఫోర్స్ మ్యాథ్ ఒలంపియాడ్ టెస్ట్ 2024 నిర్వహణలో భాగంగా బైంసా డివిజన్ పరిధిలోని వివిధ పాఠశాలలకు చెందిన 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు 400 మంది వరకు ఈ పరీక్షల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యా సంస్థల చైర్మెన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రామానుజన్ చిన్నతనం నుండే గణితశాస్త్రంపట్ల శ్రద్ధ చూపెడుతూ గణిత శాస్త్రంలో అనేక విషయాలను కనుగొని శాస్త్రానికి నూతన అధ్యాయాన్ని రచించారని వారి సేవలను కొనియాడారు. ప్రతి విద్యార్థి రామానుజన్ వలే కృషిచేసి వారి మార్గాన్ని అనుసరించి గణితంలో అద్భుతాలు సృష్టించడమే లక్ష్యంగా ముందుకు సాగి ఆదర్శంగా నిలవాలని చెప్పారు. ఈ నెల 22వ తేదిన అతిథుల చేతుల మీదుగా మొదటి మూడు స్థానాల్లో చేతుల మీదుగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## బాపూజీ వచనాలయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనదే




ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : బాపూజీ వచనాలయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సిపిఐ, సిపిఐ(ఎం) జిల్లా నాయకులు రమేష్‌బాబు, నాయకులు ఓమయ్య అన్నారు. ప్రెస్‌క్లబ్ బాపూజీ వచనాలయ పరిరక్షణ సమితి కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. సమావేశానికి బాపూజీ వచనాలయ పరిరక్షణ సమితి కన్వీనర్ కోనేరు సాయికుమార్ అధ్యక్షతన నిర్వహించి మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో జిల్లా కేంద్రం నడి ఒడ్డున ఉందని, వచనాలయాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అన్నారు. మా పార్టీ తరపున వచనాలయ పరిరక్షణ సమితికి పూర్తి సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## ఆలిండియా ర్యాంకు సాధించిన ప్రేమ్‌కుమార్‌కు సన్మానం



ప్రజాపక్షం/బాన్సువాడ : బాన్సువాడ మండలంలోని మొగలాన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని దుంకుడు మోరి తండాకు చెందిన సభావత్ ప్రేమ్‌కుమార్ ఇటీవల విడుదలైన ఆలిండియా ఎకనామిక్స్ సర్వీస్ అధికారిగా ఎంపికైనందుకు ఆదివారం ఉద్యోగులు ఆయనను శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. గ్రామీణ స్థాయి నుండి ఐఈఎస్ అధికారిగా ఎంపికవ్వడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సుంఖ్యానాయక్, శ్రీరామ్, రాజు, హరిలాల్, రాజు, సంగ్య తదితరులు పాల్గొన్నారు.

## వరలక్ష్మికి 'బెస్ట్‌లైవ్ ఇయర్' అవార్డు



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : జిల్లా కేంద్రానికి చెందిన కవయిత్రి, ప్రముఖ చిత్రకారిణి (డోంకేశ్వర్ మంలం తొండాకూర్ ప్రాథమిక పాఠశాల ప్రభుత్వ ఉపాధ్యాయురాలు) సిహెచ్.వరక్ష్మికి బెస్ట్ ఫైవ్ ఆఫ్ ద ఇయర్ అవార్డు వరించింది. కలం స్నేహం, సంగీత సాహిత్య సామాజిక సేవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీమాన్ గోపాల్ ఆచార్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బెస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డులో ఈ సంవత్సరంలో చిత్రస్నేహం సమూహంలో 300కు పైగా చిత్రాలు వేసి బెస్ట్ ఫైవ్ ఆఫ్ ద ఇయర్ అవార్డును ముఖ్యఅతిథి వెంకటాచారి ఫిలీం ప్రోడ్యూసర్ చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో అతిథులు ప్యానల్ సభ్యులు కవులు కవయిత్రులు చిత్రకారులు పాల్గొన్నారు.

## హామీలను అమలు చేయాల్సిందే..

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ఎన్నికల హామీలను అమలు చేయాలని టియుసిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న డిమాండ్ చేశారు. ఆదివారం నిర్మల్ జిల్లా కేంద్రంలో శాస్త్రీయ నగర్ భగత్‌సింగ్ భవన్లో జిల్లా అధ్యక్షుడు ఎం.బక్కన్న అధ్యక్షతన టియుసిఐ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో టియుసిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న మాట్లాడుతూ రాష్ట్రంలో 73 షెడ్యూల్ పరిశ్రమల జీవోలను సవరించి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు,5 జీవోలను ప్రకటించి ఫైనల్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేయకపోవడం దారుణమైన విషయమని అన్నారు. అ ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్స్,క్లీనర్స్ వేతనాలను నెలకు 26 రూపాయలు పెంచాలని,2019 మోటార్ వాహనాల చట్టాన్ని రద్దు చేయాలని,డిమాండ్ చేశారు. బీడీ పరిశ్రమలు పనిచేస్తున్న అన్ని కేటగిరీల కార్మికులందరికీ చేయూత పథకం ద్వారా నాలుగు వేల రూపాయలు జీవన భృతి అమలు చేయాలని కోరారు కార్యక్రమంలో జిల్లా జాయింట్ కార్యదర్శి ఎస్.గంగన్న జిల్లా కమిటీ నాయకులు, కే.లక్ష్మి. రేష్మ, గంగామణి, ఎస్.లక్ష్మి , లత, భీమవ్వ. కిషన్, లక్ష్మ ణ్, వర్మ.రమేష్ పాల్గొన్నారు.

# స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పూర్తిస్థాయి బందోబస్తు

ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే





ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ : గ్రూప్–2 ప్రశ్న పత్రాలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద పూర్తి స్థాయి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ భవన సముదాయంలో గ్రూప్–2 ప్రశ్నాపత్రాలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను జిల్లా అదనపు కలెక్టర్, పరీక్షల నోడల్ అధికారి దీపక్ తివారితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్–2 పరీక్ష కొరకు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ప్రశ్నాపత్రాలు, ఓఎంఆర్ సీట్లను కేటాయించిన పరీక్ష కేంద్రాలకు పటిష్టమైన బందోబస్తు మధ్య తరలించామని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పరీక్షలు సజావుగా జరిగే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పరీక్షలు పూర్తి అయిన వెంటనే ఓఎంఆర్ సీట్లను తిరిగి బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి భద్రపరచాలని, స్ట్రాంగ్‌రూమ్ వద్ద బందోబస్తు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య పర్యవేక్షకులు, పరిశీలకులు, శాఖ అధికారులు, రూట్ అధికారులు పాల్గొన్నారు.

### గ్రూప్– 218 పరీక్ష కేంద్రాలు

జిల్లాలో గ్రూప్–2 పరీక్ష మొదటి రోజు ప్రశాంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్–2 పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్షల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అనంతరం ఆదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాన్ని సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, ఆసిఫాబాద్ డిఎస్‌పి కరుణాకర్, పరీక్షా కేంద్రం పర్యవేక్షకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# గ్రూప్–2కు మెజార్టీ అభ్యర్థులు గైర్హాజరు

మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్2 పరీక్షలు మెదక్ జిల్లా వ్యాప్తంగా కట్టుదిట్టమైన ఏర్పాట్ల భద్రత నడుమ ఆదివారం ప్రారంభం అయ్యాయి. మొదటి రోజు పరీక్షలు ఎలాంటి అవాంతరాలు లేకుండా సాఫీగా సాగాయి. గ్రూప్ 2 పరీక్షకు జిల్లాలో మొత్తం 5,855 అభ్యర్థులకు 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మెదక్ లో 11, నర్సాపూర్ 03, తూప్రాన్ పట్టణంలో 02 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రూప్ 2 రాసే అభ్యర్థులల్లో మెజార్టీ అభ్యర్థులు పరీక్షలకు గైర్హాజరు అయ్యారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అన్నది గమనించి పలు సూచనలు చేశారు. కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఆదివారం ఉదయం సెషన్ లో జరిగిన పరీక్షకు జిల్లాలో మొత్తం 5,855 మంది అభ్యర్థులకు గాను, 2,868 మంది హాజరు కాగా, 2,987 మంది గైర్హాజరు అయ్యారని, 5,855 అభ్యర్థులకు గాను, మధ్యాహ్నం సెషన్ లో 2859 పరీక్ష హాజరు కాగా, 2,996 మంది గైర్హాజరు అయ్యారని వివరించారు. ఆది, సోమవారాలలో ఉదయం, మధ్యాహ్నం చొప్పున మొత్తం నాలుగు సెషన్లలో జరిగే గ్రూప్2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు యంత్రాంగం గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## సిరి హాస్పిటల్ ఆరోగ్య శిబిరం



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా అన్ని రకాల టెస్ట్‌లు చేసుకోవాలని సిరి హాస్పిటల్ డాక్టర లింగారెడ్డి అన్నారు. ఆదివారం మోర్తాడ్ మండలంలోని పాలెం గ్రామంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ను సిరి హాస్పిటల్ ఆర్మూర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో వైద్యులు సిరి హాస్పిటల్ డాక్టర్ లింగారెడ్డి, డాక్టర శిరీష, డాక్టర్ అజయ్‌రెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సునీల్, డాక్టర్ ఈశ్వంత్, డాక్టర్ సౌమ్య రోజులకు 400 మంది రోగులకు షుగర్, ఈసీజీ, కొలస్ట్రాల్, బీఎండి పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లింగారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏదైనా చేయగలుగుతారన్నారు. ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకున్నప్పుడే ముందస్తు రోగాన్ని గుర్తించవచ్చని రోగాన్ని గుర్తించినప్పుడే వైద్యం సకాలంలో అందుతుందన్నారు. మా హాస్పిటల్ ద్వారా ప్రతి సంవత్సరం గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహించటం జరుగుతుందని వారికి ఉచితంగా మందులు అందిస్తున్నామని తెలిపారు.

## ఉపాధి ఉద్యోగాలకు హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : ఉపాధి ఉద్యోగాలకు హోటల్ మేనేజ్‌మెంట్ సువర్ణావకాశం అని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని గంగస్థాన్ పేస్ 1 లో యువి హోటల్ మేనేజ్‌మెంట్ ఆఫ్ కాలేజీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అమెరికా, చైనా ప్రత్యేక స్థానం కల్పిస్తారని అందుకే అక్కడ హోటళ్లకు ఆదరణ ఎక్కువగా ఉంటుందన్నారు. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు పూర్తి చేసిన వారు విదేశాలతో పాటు మన దేశంలో కూడా స్వతహాగా హోటళ్లను నెలకొల్పి భోజన ప్రియులను ఆకర్షిస్తున్నారన్నారు. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు ఉంటే కేవలం రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లాంటి పెద్దపెద్ద నగరాలకే పరిమితమే ఉండేదని ప్రస్తుతం నిజామాబాద్‌తో పాటు జిల్లాలకు విస్తరించిందన్నారు. ఇక్కడున్న నిరుద్యోగులకు హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులను అందివ్వడానికి నిర్వాహకులు ముందుకు రావటం అభినందనీయమన్నారు. యువి కాలేజీ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ నిర్వాహకుడు సుజన్‌కుమార్ నిజామాబాద్‌లో ప్రారంభించటం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో హోటల్ మేనేజ్‌మెంట్ ఆఫ్ కాలేజీ రంగంలో మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర సహకార సంస్థ చైర్మన్ మోహన్‌రెడ్డి, నగేష్‌రెడ్డి, దాదన్నగారి విఠల్‌రావ, యువి హోటల్ మేనేజ్‌మెంట్ ఆఫ్ కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.



# కట్టుదిట్టమైన భద్రత మధ్య...





గ్రూప్-2 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్2 పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఆదివారం ప్రారంభం అయ్యాయి.జిల్లా కేంద్రంలోని దీక్ష, వశిష్ఠ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదివారం తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అన్నది గమనించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. కమిషన్ మార్గదర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఆదివారం ఉదయం సెషన్ లో జరిగిన పరీక్షకు జిల్లాలో మొత్తం 8,080 మంది అభ్యర్థులకు గాను, 4,146 మంది హాజరు కాగా 3,934 మంది గైర్హాజరు అయ్యారని వివరించారు.ఆది,సోమవారాలలో ఉదయం, మధ్యాహ్నం చొప్పున మొత్తం నాలుగు సెషన్లలో జరిగే గ్రూప్2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు. పరిశీలనలో రీజినల్ కోఆర్డినేటర్ పీజీ రెడ్డి, పర్యవేక్షణ అధికారులు శ్రీనివాస్, గోపాల్, రవికుమార్, తహసీల్దార్లు రాజు, సంతోష్,తదితరులు పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్ :** జిల్లాలో గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఆదివారం జిల్లా కేంద్రంలో గ్రూప్ 2 పరీక్షల నిర్వహణ కోసం 18 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రూప్ 2 పరీక్షల కోసం పేపర్ 1కు 4393 మంది దరఖాస్తు చేసుకోగా 55.88 శాతంతో 2455 మంది హాజరు కాగా, 1938 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. అదే విధంగా పేపర్ 2కు 4393 మంది దరఖాస్తు చేసుకోగా 55.54 శాతంతో 2440 మంది హాజరు కాగా, 1953 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగ ఆపలు పరీక్ష కేంద్రాలలో అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు, పోలీసులు అభ్యర్థులను పరీక్ష హాల్లోకి పంపలేదు. పరీక్షకేంద్రాల వద్ద ఎటువంటి సంఘటనలు జరగరకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం పేపర్ 3, పేపర్ 4 పరీక్షలు జరగనున్నాయి.

**నిజామాబాద్ ప్రతినిధి :** రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్2 పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు నిర్వహిస్తున్న తీరును నిశితంగా పరిశీలించారు. నిబంధనలు పక్కాగా పాటిస్తున్నారా లేదా అన్నది గమనించి పలు సూచనలు చేశారు. కమీషన్ మార్గదర్శకాలను పాటిస్తూ సాఫీగా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఆదివారం ఉదయం సెషన్‌లో జరిగిన జిల్లాలో మొత్తం 19855 మంది అభ్యర్థులకు గాను 9070 మంది హాజరు కాగా, 10785 మంది గైర్హాజరయ్యారని వివరించారు. ఆది, సోమవారాలలో ఉదయం, మధ్యాహ్నం చొప్పున మొత్తం నాలుగు సెషన్లలో జరిగే గ్రూప్ 2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బంధీగా జరిగేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ వెల్లడించారు.

# విద్యాలయ అభివృద్ధికి సహకారం

నవోదయ పూర్వ విద్యార్థుల వెల్లడి



ప్రజాపక్షం/గజ్వేల్ : ఉమ్మడి మెదక్ జిల్లా వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేందర్ అధ్యక్షతన పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు రామకృష్ణ, విద్యాలయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్, వైస్ ప్రిన్సిపల్ అంచురి రమేష్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమయింది. పూర్వ విద్యార్థులు గత స్మృతులను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ప్రస్తుత పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడైన రామకృష్ణ మాట్లాడుతూ ఇప్పటి వరకు సంంఘ అందించిన సేవలను గుర్తు చేశారు. నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ దాసి రాజేందర్ మాట్లాడుతూ అపూర్వమైన పూర్వ విద్యార్థుల సమావేశం అద్భుతంగా నిర్వహించినట్లు చెప్పారు. విద్యాలయ అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం ఉంటుందన్నారు. విద్యాలయంలో ఓపెన్ ఆడిటోరియం నిర్మించే యోచనలో ఉన్నామని, దానికి పూర్వ విద్యార్థుల సహకారం అవసరం అవుతుందన్నారు. పూర్వ విద్యార్థులు అందించిన 400 కుర్చీలు బహుకరించగా, మరో 100 పుస్తకాలను అందించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను నవోదయ సిబ్బంది జ్ఞాపికలతో సన్మానించారు. నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించి ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా పూర్వ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు అందజేశారు.12వ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన యాదగిరి, పదవ తరగతిలో మేఘన వైష్ణవీలకు నగదు బహుమతులు అందజేశారు. పూర్వ విద్యార్థులకు కొవ్వొత్తుల వెలుగులతో వీడ్కోలు పలికారు. పూర్వ విద్యార్థులకు, విద్యాలయ సిబ్బందికి నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ దాసి రాజేందర్ ధన్యవాదాలు తెలిపారు.

# మానసిక ప్రశాంతతకు క్రీడలు

ఎమ్మెల్యే సూర్యనారాయణ గుప్త

ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ : విశ్రాంత ఉద్యోగులకు క్రీడా పోటీలు మానసిక ప్రశాంతతను కలిగిస్తాయని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. ఆదివారం ఇందూరు నందిని ఖలీల్‌వాడిలోని విశ్రాంతి ఉద్యోగుల భవనంలో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల క్రీడా పోటీలను నిర్వహించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో విశ్రాంత ఉద్యోగుల పాత్ర కీలకమైందన్నారు. విశ్రాంత ఉద్యోగుల క్రీడా పోటీలతో మానసిక ప్రశాంతతో పాటు ఒకరినొకరు ఆరోగ్య పరిస్థితులపై అవగాహన కల్పిస్తూ ఉత్సాహవంతమైన జీవితాన్ని గడుపుటకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా అధ్యక్షులు మామిడాల రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భోజాగౌడ్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీ నారాయణ, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.



# 'ఆత్మ'కు రుణాలు

చోళా ఫైనాన్స్ సంస్థ ఉద్యోగి భారీ మోసం
మృతిచెందిన వ్యక్తుల పేరున రూ.6 కోట్ల గృహ రుణాలు
ఆందోళనలో బాధిత కుటుంబసభ్యులు

ప్రజాపక్షం/ చెన్నూర్ టౌన్ : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని చోళా ఫైనాన్స్ సంస్థ ఉద్యోగి మృతిచెందిన వారి పేరున దాదాపు ఆరు కోట్ల రూపాయల గృహ రుణాలు తీసుకొని పరారైన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి రాగా స్థానికంగా చర్చనీయాంశం అయింది. చెన్నూరు మండలంలోని కత్తరశాల, కిష్టంపేట గ్రామాలలోని పలువురు మృతులతో పాటు పలువురు వ్యక్తుల పేరున కత్తరశాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చోళా ఫైనాన్స్ సంస్థలో బాధితులకు, బాధితుల కుటుంబ సభ్యులకు సమాచారం లేకుండానే గృహ రుణాలు తీసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇటీవలే ఆ ఫైనాన్స్ సంస్థ సిబ్బంది కిష్టంపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంటికి వెళ్లి ఆయన పేరున ఉన్న 25 లక్షల రూపాయలకు సంబంధించిన నెలవారి వాయిదా చెల్లించాలని కోరగా, రుణం పొందిన వ్యక్తి గతంలోనే మరణించాడు. కానీ ఆయన పేరున ఎలాంటి రుణాలు లేవని బాధిత కుటుంబ సభ్యులు తెలిపి, ఆరా తీయగా కత్తరశాల ఉద్యోగి దాదాపు 15 మంది పేరున తీసుకున్న ఆరు కోట్ల అక్రమ రుణాల వ్యవహారం బయటపడింది. ఇదేంటని సదరు ఉద్యోగిని బాధితులు, బాధితకుటుంబ సభ్యులు నిలదీయగా, ఎవరి డబ్బులు వారికి చెల్లిస్తానని నమ్మబలికి నాలుగు రోజులుగా అజ్ఞాతంలోకి వెళ్లగా, రుణాల భారం తమ పైకి ఎక్కడ వస్తుందేమోనంటూ బాధితులు, బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. రుణ గ్రహీతకు మాత్రమే తన రుణం వివరాలు తెలపాలని నిబంధనలు సంస్థలో ఉన్నప్పటికి, రుణం మంజూరు చేసే క్రమంలో రుణ గ్రహీతను చూడకుండానే సంస్థ రుణం మంజూరు చేయడం శోచనీయం. బినామీ పేర్లతో రుణాలు తీసుకొని కోట్లాది రూపాయల మోసం చేసినప్పటికి, చోళా ఫైనాన్స్ సంస్థ యాజమాన్యం ఇప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అక్రమ రుణాల వ్యవహారంలో ఇంకా ఎవరెవరి హస్తాలు ఉన్నాయో అనే అనుమానాలకు దారి తీస్తున్నాయి.



### మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : సిఐ రవీందర్



మోసాలకు పాల్పడే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రుణాలు ఇప్పిస్తామని చెప్పి డాక్యుమెంట్లు అడిగితే ఎవరికి ఇవ్వవద్దు. అమాయకులకు ఆసరాగా చేసుకొని అనేక మోసాలకు పాల్పడుతున్నారు. తప్పుడు పద్ధతిలో రుణాలు తీసుకొని మోసం చేసిన వ్యవహారం గురించి ఎలాంటి ఫిర్యాదు మాకు అందలేదు. బాధితులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం.

## క్రీడ

9 ఏళ్ల తర్వాత..!

# చరిత్ర సృష్టించిన ఆస్ట్రేలియా..

టెస్ట్ క్రికెట్‌లో ఆస్ట్రేలియా చరిత్ర సృష్టించింది. 9 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత సొంతగడ్డపై భారత్‌తో 400 ప్లస్ స్కోర్‌ను నమోదు చేసింది. ఐదు టెస్ట్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా బ్రిస్బేన్‌లోని గబ్బా మైదానం వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్‌లో ఆసీస్ ఈ ఫీట్ సాధించింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్.. ట్రావిస్ హెడ్ (160 బంతుల్లో 18 ఫోర్లతో 152), స్టీవ్ స్మిత్(190 బంతుల్లో 12 ఫోర్లతో 101) శతకాలతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి 101 ఓవర్లలో 7 వికెట్లకు 405 పరుగుల భారీ స్కోర్ చేసింది. క్రీజులో అలెక్స్ క్యారీ(45 బ్యాటింగ్), మిచెల్ స్టార్క్ ఉన్నారు.



### 9 ఏళ్ల తర్వాత..

2015 తర్వాత టెస్ట్‌ల్లో సొంతగడ్డపై భారత్‌తో ఆసీస్ 405 పరుగుల భారీ స్కోర్ చేయడం ఇదే తొలిసారి. ఆసీస్ చివరిసారిగా 2015లో సిడ్నీ వేదికగా జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో 572/7 స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. ఆ తర్వాత ఆసీస్ గడ్డపై భారత్ 11 మ్యాచ్‌లు, 3 సిరీస్‌లు ఆడినా.. ఆతిథ్య జట్టు 400 ప్లస్ పరుగులు చేయలేకపోయింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిన ఆసీస్ బ్యాటింగ్‌కు దిగగా.. తొలి రోజు ఆటకు వర్షం అంతరాయం కలిగించింది. దాంతో 28/0 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన ఆసీస్.. స్మిత్, ట్రావిస్ హెడ్ అసాధారణ బ్యాటింగ్‌తో భారీ స్కోర్ అందించారు. ఫస్ట్ సెషన్‌లో బుమ్రా చెలరేగి ఉస్మాన్ ఖవాజా(21), నాథన్ మెక్స్వీనీ(9), మార్నస్ లబుషేన్(12)లను ఔట్ చేసినా స్మిత్, ట్రావిస్ హెడ్ ఆచితూచి ఆడారు. దాంతో ఆసీస్ 104/3 ఓవర్‌నైట్ స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. రెండో సెషన్‌లో ఈ ఇద్దరూ పూర్తి ఆధిపత్యం చెలాయించడంతో భారత బౌలర్లు తేలిపోయారు. 71 బంతుల్లో ట్రావిస్ హెడ్ హాఫ్ సెంచరీ సాధించగా.. స్మిత్ 128 బంతుల్లో అర్థశతకం పూర్తి చేసుకున్నాడు. హాఫ్ సెంచరీ అనంతరం దూకుడుగా బ్యాటింగ్ చేసిన హెడ్ 115 బంతుల్లో శతకం సాధించడంతో ఆసీస్234/3 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. మూడో సెషన్‌లోనూ ఈ ఇద్దరి జోరు కొనసాగింది. 112 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ట్రావిస్ హెడ్ ఇచ్చిన సునాయస క్యాచ్‌ను రోహిత్ నేలపాలు చేశాడు. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకున్న ట్రావిస్ హెడ్ దూకుడుగా ఆడాడు. మరోవైపు స్మిత్ 185 బంతుల్లో శతకాన్ని సాధించగా.. ట్రావిస్ హెడ్ 157 బంతుల్లో 150 పరుగులు పూర్తి చేశాడు.

### బుమ్రా ఒంటరి పోరాటం..

భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచిన ఈ జోడీని బుమ్రా విడదీసాడు. స్మిత్‌ను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చిన బుమ్రా.. నాలుగో వికెట్‌కు నమోదైన 241 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరదించాడు. తన మరుసటి ఓవర్‌లో మిచెల్ మార్ష్(5), ట్రావిస్ హెడ్‌లను పెవిలియన్ చేర్చిన బుమ్రా ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. ఆచితూచి ఆడుతున్న ప్యాట్ కమిన్స్‌ను సిరాజ్ పెవిలియన్ చేర్చగా.. క్రీజులోకి వచ్చిన మిచెల్ స్టార్క్‌తో కలిసి అలెక్స్ క్యారీ మరో వికెట్ పడకుండా జాగ్రత్తపడ్డాడు.



# ముగిసిన డబ్ల్యుపిఎల్ 2024 మెగా వేలం



ఉమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) 2024 మెగా వేలం ముగిసింది. ఐదు ఫ్రాంచైజీల్లోని 19 స్థానాల కోసం బెంగళూరు వేదికగా ఆదివారం జరిగిన ఈ మినీ వేలంలో 120 మంది పోటీపడ్డారు. ఈ వేలంలో భారత అనామక ప్లేయర్లు సిమ్రాన్ బేస్, 16 ఏళ్ల జి కమలిని రికార్డ్ ధర పలికారు. మహారాష్ట్రకు చెందిన మిడిలార్డర్ బ్యాటర్ సిమ్రాన్ బేస్‌ను రూ. 1.90 కోట్ల భారీ ధరకు గుజరాత్ జెయింట్స్ కొనుగోలు చేయగా.. తమిళనాడు వికెట్ కీపర్ జి కమలిని ముంబై ఇండియన్స్ రూ. 1.60 కోట్లకు దక్కించుకుంది. వెస్టిండీస్ ఆల్‌రౌండర్ డియాండ్రా డాటిన్‌ను రూ. 1.75 కోట్లకు గుజరాత్ జెయింట్స్ దక్కించుకోగా.. భారత స్టార్ స్పిన్నర్ పూనమ్ యాదవ్ అన్‌సోల్డ్ నిలిచింది. రూ. 30 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన ఆమెను ఫ్రాంచైజీలు పట్టించుకోలేదు. ఇంగ్లాండ్ కెప్టెన్ హీథర్ నైట్‌ను కూడా ఫ్రాంచైజీలు పట్టించుకోలేదు. రూ. 50 లక్షల కనీస ధరకు కొనుగోలు చేసేందుకు కూడా జట్లు ఆసక్తి చూపలేదు

# పులుల సంచారంతో ప్రజల్లో భయాందోళనలు

### రఘునాథపాలెం గుట్టల్లో, పినపాక నియోజకవర్గంలో పులి సంచారం?





**ప్రజాపక్షం/కరకగూడెం :** భద్రాద్రి కొత్తగూడెం గూడెం జిల్లాలో నాలుగైదు రోజుల నుండి పులులు సంచరిస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆదివారం రఘునాథపాలెం గుట్టల్లో పెద్దపులి అరుపులు గాండ్రింపులు రావడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చిన స్థానిక ప్రజలు, ఇటీవల కరకగూడెం, పినపాక, మండలంలోని అటవీ ప్రాంతంలో పశువుల కాపరులు పశులను కాస్తుండగా అవి బెదరడంతో ఏమిటా అని పశువుల కాపరులు పెద్దపులిని చూసి అధికారులకు సమాచారం అందించారు. మరుసటి రోజు పినపాక మండలంలో అప్పటి నుండి నియోజకవర్గంలో అదిగో పులి.. ఇదిగో తోక.. అన్నట్లు పరిస్థితి మారింది. ఏజెన్సీ ప్రాంతంలో అటవీ ప్రాంతానికి వెళ్లాలంటే భయం భయంగా పరిస్థితి మారింది. అదే విధంగా గత సంవత్సరం కరకగూడెం, అల్లపల్లి, పినపాక మండలంలో సంచరిస్తున్న పెద్దపులి ఓ పశువును వేటాడి హతమార్చింది. అదే సమయంలో బూర్గంపాడు మండలంలోని సారపాక, ఇరవెండి, నాగినేనిప్రోలు, కృష్ణసాగర్ అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచరించినట్లు స్థానికులు గుర్తించిన విషయం విధితమే. అప్పట్లో సామాజిక మాధ్యమాల ద్వారా వెలుగులోకి రావడంతో అటవీ శాఖ అధికారులు పెద్దపులి సంచరించిన ప్రాంతాలలో విచారించి పెద్దపులి సంచరించినట్లు నిర్ధారించారు. అదే నేపథ్యంలో అశ్వాపురం మండలం తుమ్మలచెరువు గ్రామ సమీపంలో గల సాయగుంపు గుట్ట వద్ద పెద్దపులి సంచరిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. తుమ్మచెరువు గ్రామానికి చెందిన మడకం గురవయ్యకు చెందిన ఆవుల సాయ గుంపు గుట్ట వద్దకు మేతకు వెళ్లగా దానిని వేటాడి పెద్దపులి హతమార్చినట్లు స్థానికులు ఆ సమయంలో చెప్పారు. అయితే ని యోజక వర్గంవ్యాప్తంగా పెద్ద పులులు సంచరిస్తున్నాయా లేదా అసలు ఎన్ని పెద్ద పులులు ఉన్నాయని అటవీశాఖ అధికారులు బయటపెట్టాల్సి ఉంది. అయి వరి కోతల సమయం కావడంతో పెద్దపులుల సంచారంతో ఏజెన్సీ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. పులుల సంచారం పై అటవీశాఖ అధికారులు ప్రత్యేక దృష్టిసారించి పులుల సంచారంపై ముందస్తు సమాచారాన్ని ప్రజలకు అందించాలని, ప్రజలు పులుల దాడికి గురి కాకుండా చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

## కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక క్రానిక్ కిడ్నీ డిసీజ్ క్లినిక్ ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతదేశంలో కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తుల సంఖ్య రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో హైటెక్ సిటీలోని యశోద హాస్పిటల్‌లో దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధిగ్రస్తుల కోసం క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సికెడి) క్లినిక్‌ను ప్రారంభించింది. ఆదివారం జగద్గురువు శివరాత్రి దేశికేంద్ర మహాస్వామీతో కలిసి యశోద హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్, గోరుకంటి రవీందర్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులు జస్టిస్ ఆర్.దేవదాస్ (కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి), పార్లమెంటు సభ్యురాలు రేణుకా చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ గోరుకంటి రవీందర్ రావు మాట్లాడుతూ భారతదేశంలో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధుల భారం పెరుగుతోందని, ప్రతిఏటా దాదాపు 5 లక్షల మంది కొత్త కిడ్నీ రోగులు డయాలసిస్ దశకు చేరుకుంటున్నారని తెలిపారు. యశోద హాస్పిటల్స్‌హైటెక్ సిటీ, సీనియర్ నెఫ్రాలజిస్ట్, కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ స్పెషలిస్ట్ డాక్టర్. రాజశేఖర చక్రవర్తి, మాట్లాడుతూ.. క్రానిక్ కిడ్నీ డిసీజ్‌ప్రమాదంలో ఉన్న వారందరూ ఈ క్లినిక్‌లో తమ పేరు నమోదు చేసుకోవ చ్చు. సీనియర్ నెఫ్రాలజిస్ట్ కన్సల్టేషన్‌తో సహా ప్రోటోకలైజ్డ్ కేర్, డైటీషియన్ అత్యాధునిక పరికరాలు, మందుల ను ఉపయోగించి సికెడి నిర్వహణకు సలహా ఇస్తారని తెలిపారు.



# జోరుగా 'జీరో' కాటన్ దందా

(మొదటి పేజీ తరువాయి)

తరలించలేక అనివార్యంగా పక్కనే ఉన్న ప్రైవేట్ వ్యాపారులకు అడిగిన ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి కల్పిస్తున్నారు. ఇంత జరుగుతున్న మార్కెట్ అధికారులు పట్టించుకోకపోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. గ్రామాల్లోనే కల్లాలను నిర్వహిస్తున్న కాంటాలతో పత్తి రైతులు నిలువునా దొపిడీకి గురవుతున్నారు. ఈ వ్యవహారంలో మార్కెట్ అధికారులు చూసిచూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు ఎక్కడా ఇలా కొనుగోళ్లకు పాల్పడుతున్న వారిపై అధికారులు కేసులు పెట్టిన పాపాన పోలేదు. కనీసం జిల్లా వ్యాప్తంగా అక్కడక్కడా అధికారులు తనిఖీలు కూడా చేయడంలేదు. లైసెన్స్ లేకుండా వ్యాపారం..తూకంలో మోసం.. జరుగుతున్నా పట్టించుకున్న వారే లేకుండా పోయారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా వారు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### ధరలో, తూకంలోనూ అడ్డగోలుగా దోపిడీ

ఎలక్ట్రానిక్ కాంటాల వినియోగంలో వ్యాపారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. రిమోట్ జేబులో పెట్టుకుని రైతులకు తెలియకుండా తెలివిగా ఒక్కొక్క తూకంలో ఐదు నుంచి పది కిలోల తక్కువ చూపించి మోసం చేస్తున్నారు. ఇటు ధరలోను, అటు తూకంలోనూ రైతులకు అడ్డగోలుగా దోపిడీ చేస్తున్నారు. అలాగే కొంత మంది దళారులు వేబ్రిడ్జి కాంటా ద్వారా తూకం చేస్తూ రైతులను మోసం చేస్తూ ప్రైవేట్ ప్యాపారులకు పత్తి తీసుకువచ్చే వాహనాలకు కమీషన్ చూసుకుని రైతులకు ధరను తగ్గిస్తున్నారు. ఒక సారి ఇంటి నుంచి వాహనంలో తెచ్చిన పత్తిని మళ్లీ తీసుకోపోవాలంటే కిరాయి మీద పడి రవాణా ఖర్చు తడిసి మోపుడు అవుతుంది. దీంతో పత్తి నల్లగా మారిందనే సాకుతోప్రైవేట్ వ్యాపారులు కింటాకు రూ. వేయ్యి నుంచి రూ.రెండు వేలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.

### నిద్రమత్తులో మార్కెట్ అధికారులు..

జిల్లా వ్యాప్తాంగా పలుపాంత్రాలల్లో కల్లాలలో చిల్లర కాంటాలు నిర్వహిస్తూ పత్తి రైతులను నిలువు దొపిడీ చేస్తున్నారు. ఎటువంటి లైసెన్స్ లేకుండా, నిబంధనలకు విరుద్దంగా సరుకులు కొనుగోలు చేస్తూ వ్యాపారులు రూ.లక్షల్లో గడిస్తున్నారు. ఇంత జరుగుతున్న రాష్ట్రంలోనే అతిపెద్ద మార్కెట్ వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ అధికారులు అక్రమార్కులపై ఒక్క కేసు కూడా పెట్టకపోవడం వారి నిర్లక్ష్యానికి అద్దం పడుతుంది. స్వయంగా మార్కెట్ అధికారే ఇప్పటి వరకు ఒక కేసు కూడా నమోదు కాలేదని చెప్పడం గమనార్హం. ఇప్పటికైనా రైతులను మోసం చేస్తూ మార్కెట్ ఆదాయానికి గండికొడుతున్న చిల్లర కాంటాలు నిర్వహిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



## పాన్ ఇండియా ఫిల్మ్ 'ఘాటి'

క్వీన్ అనుష్క శెట్టి, క్రియేటివ్ డైరెక్టర క్వీన్ అనుష్క శెట్టి, క్రియేటివ్ డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి, యువి క్రియేషన్స్ ప్రెజెట్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్ పాన్ ఇండియా ఫిల్మ్ 'ఘాటి' ఏప్రిల్ 18, 2025న వరల్ వైడ్ రిలీజ్ క్వీన్ అనుష్క శెట్టి, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించిన మోస్ట్ అవైటెడ్ మూవీ 'ఘాటి' గ్లింప్స్ లో ఇంటెన్స్ వైలెంట్ క్యారెక్టర్ లో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇది పాన్‌ఇండియా సంచలనం బాహుబలి తర్వాత, అనుష్క నుంచి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మరో పాన్‌ఇండియా మూవీ. యువి క్రియేషన్స్ సమర్పణలో రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మిస్తున్నారు. వేదం బ్లాక్బస్టర్ విజయం తర్వాత అనుష్క,క్రిష్ల కలయికలో వస్తున్న రెండవ చిత్రం ఘాటి, ఇది యువి క్రియేషన్స్తో కలిసి అనుష్క నాల్గవ సినిమా. గ్లింప్స్ తో క్యూరియాసిటీని క్రియేట్ చేసిన తర్వాత, మేకర్స్ ఇప్పుడు విడుదల తేదీని అనౌన్స్ చేశారు ఏప్రిల్ 18న ఈ చిత్రం వరల్ వైడ్ రిలీజ్ కానుంది. సమ్మర్ రిలీజ్ కి పర్ఫెక్ట్ టైం. ఈ అనౌన్స్మెంట్ క్రిష్, అనుష్క, ఫిల్మ్ మేకర్స్ తో కూడిన ఫన్ వీడియో ద్వారా వచ్చింది. పాన్‌ఇండియా మూవీ కోసం సమ్మర్ రిలీజ్ సరైన సీజన్.

## రీల్



## మహేష్ సరసన ప్రియాంక చోప్రా?

దర్శకధీరుడు రాజమౌళి మహేష్ బాబు సినిమా ఎప్పుడు స్టార్ట్ అవుతుంది ? అంటూ మహేష్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పైగా ఈ ప్రాజెక్ట్‌ను హాలీవుడ్ స్థాయిలో నిర్మించబోతున్నారు. ఇదిలా ఉంటే.. ఈ ప్రాజెక్ట్ గురించి రోజుకో రూమర్ చక్కర్లు కొడుతూనే ఉంది. ముఖ్యంగా ఈ సినిమాలో నటించే హీరోయిన్ ఎవరనే విషయం పై ఇప్పటికే చాలా గాసిప్స్ వినిపించాయి. తాజాగా గ్లోబల్ స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రాను మహేష్ సరసన తీసుకోబోతున్నారని టాక్ నడుస్తోంది. అలాగే మరో కథానాయికగా ఓ అందమైన మలేషియా నటిని కూడా ఎంపిక చేస్తారని టాక్. అన్నట్టు ఈ సినిమాలో 'థోర్' ఫేమ్ క్రిస్ హెమ్స్వర్తో పాటు మరికొందరు హాలీవుడ్ నటీమణులు కూడా నటిస్తారని వార్తలు వచ్చాయి. అయితే, ఈ వార్తల పై ఇప్పటివరకు టీం అఫీషియల్ గా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఏది ఏమైనా పాన్ ఇండియా మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఈ సినిమా కోసం చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా దక్షిణాఫ్రికా నవలా రచయిత విల్బర్ స్మిత్ రాసిన పుస్తకాల ఆధారంగా ఈ సినిమా స్క్రిప్ట్‌ను రాశారు. కాబట్టి, ఈ సినిమా ఓ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా ఉండబోతుంది.

## చరణ్ సినిమాలో బాలీవుడ్ నటి?



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఓ భారీ చిత్రం రాబోతుంది. ఈ సినిమా షూటింగ్ రీసెంట్గా మైసూర్ నగరంలో స్టార్ట్ అయింది. ప్రస్తుత షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతుంది. కాగా తాజాగా ఈ సినిమాలో బాలీవుడ్ సీనియర్ హీరోయిన్ కాజోల్ కూడా నటించబోతుందని.. ఆ పాత్ర నెగటివ్ రోల్ అని రూమర్స్ వినిపిస్తున్నాయి. మరి ఈ వార్తలో ఎంతవరకు నిజం ఉందో తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చేవరకు ఆగాలి. ఇక ఈ సినిమాలో రామ్ చరణ్ డ్యూయెల్ రోల్ లో కనిపించబోతున్నారట. కాగా ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన హీరోయిన్ గా జాన్వీకపూర్ నటించబోతుంది. ఇక ఈ చిత్రానికి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా మైత్రి మూవీ మేకర్స్ తో కలిసి నిర్మాత వెంకట సతీష్ కిలారు ఈ సినిమాకి నిర్మాణం వహిస్తున్నారు. ఈ సినిమా పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి.

## గొప్ప సంగీత విద్వాంసుడు పద్మశ్రీ యెళ్ల

### వెంకటేశ్వరరావు ప్లాటినం జూబ్లీ వేడుకల్లో మంత్రి జూపల్లి

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** మారుమూల పల్లెటూరు నుంచి పద్మశ్రీ వరకూ ఎదిగిన గొప్ప సంగీత విద్వాంసుడు డాక్టర్ యెళ్ల వెంకటేశ్వరరావు అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కొనియాడారు. అదేవిధంగా మృదంగ వాయిద్యానికి అంతర్జాతీయ ఖ్యాతిని తీసుకొచ్చారన్నారు. సంగీతరంగానికి 75 ఏండ్లుగా చేసిన విశిష్ట సేవలకుగానూ ఆయన శిష్యబృందం జూబ్లీ వేడుకలు ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించింది. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ తెలంగాణ నుంచి సంగీతంలో పద్మశ్రీ అందుకొన్న తొలి వ్యక్తి యెళ్ల వెంకటేశ్వరరావు అని ప్రశంసించారు. ఈ సందర్భంగా యెళ్ల వెంకటేశ్వరరావును మంత్రి జూపల్లి, పద్మశ్రీ అవార్డు గ్రహీత నాదసుధార్ణవ డాక్టర్ అన్నవరపు రామస్వామి ఘనంగా సన్మానించారు. అనంతరం స్వర్ణ ఘంటాకంకణ ప్రదానం చేశారు. ముందుగా, యెళ్ల వెంకటేశ్వరరావు వినూత్న కృషి ప్రస్తావిస్తూ డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎపి మాజీ సిఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం, ఆర్థికవేత్త ప్రొఫెసర్ జీవీఆర్ శాస్త్రి, రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, తెలుగు వేదకవి జొన్న విత్తుల రామలింగేశ్వరరావు, టిటిడి అన్నమాచార్య పిడి డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ తదితరులు పాల్గొన్నారు.



## ఎయిర్‌పోర్టు ట్రిప్‌లు బహిష్కరించిన అగ్రిగేటర్ డ్రైవర్‌లు

### టిజిపిడబ్ల్యుయు వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అగ్రి గేటర్ డ్రైవర్‌ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ గిగ్ అండ్ ప్లాట్‌ఫామ్ వర్కర్స్ యూనియన్(టిజిపిడబ్ల్యుయు) వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 34 వేల మంది అగ్రి గేటర్ డ్రైవర్లు ఎయిర్ పోర్టు ట్రిప్‌లను బహిష్కరించారు. ఈ సందర్భంగా షేక్ సలావుద్దీన్ మాట్లాడుతూ డ్రైవర్లు ఎయిర్‌పోర్టు ట్రిప్‌ల ను బహిష్కరించడం అనేది తమ అసహనానికి ని దర్శనమన్నారు. తక్షణంగా ప్రభుత్వం, అగ్రిగేటర్ సంస్థలు ఈ సమస్యను పరిష్కరించకపోతే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఓలా, ఉబ ర్, రాపిడో డ్రైవర్లు పెద్ద ఎత్తున ఆందోళన కొనసాగిస్తున్నారని అన్నారు. గత రెం డు రోజుల్లో 34 వేల మందికి పైగా డ్రైవర్లు ఈ ఉద్యమంలో పాల్గొన్నారని ఆయన చెప్పారు. అగ్రి గేటర్ సంస్థలు డ్రైవర్లకు తక్కువ చార్జీలు చెల్లించడంతో జీవించలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రభుత్వం, రవాణా శాఖకు అనేక పర్యాయాలు విజ్ఞప్తి చేసిన పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే సమానమైన, న్యాయమైన ధర విధానం నిర్ణయించాలన్నారు. అగ్రిగేటర్ సంస్థలు డ్రైవర్‌లతో స మావేశమై వారి సమస్యలు పరిష్కరించాలన్నారు. న్యాయమైన ధరలు అమలయ్యే వరకు ఎయిర్‌పోర్టు ట్రిప్‌ల బహిష్కరణ కొనసాగుతుందన్నారు. డ్రైవర్‌లకు న్యాయమైన హక్కులు అమలు చేస్తున్న ట్రిప్‌ల బహిష్కరణకు ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. గిగ్‌గేటర్ డ్రైవర్‌లకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని షేక్ సలావుద్దీన్ అన్నారు.

# జస్టిస్ శేఖర్‌కుమార్

(మొదటి పేజీ తరువాయి)

సిట్టింగ్ జడ్జి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ చేసిన ప్రసంగానికి సంబంధించిన వార్తాపత్రిక నివేదికలను సుప్రీంకోర్టు పరిగణనలోనికి తీసుకుంది. సమగ్రవివరాలు, వివరాలను హైకోర్టు నుండి కోరింది. విషయం పరిశీలనలో ఉంది' అని ఒక అధికారిక ప్రకటన తెలియజేసింది.ఏర్పాటైన నిబంధనల ప్రకారం, సంబంధిత హైకోర్టు నుండి ఏదైనా వివాదాస్పద అంశంపై సుప్రీంకోర్టు నివేదిక కోరిన న్యాయమూర్తికి ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని అత్యున్నత న్యాయస్థానం కొలీజియం ముందు తన అభిప్రాయం తెలియజేయడానికి అవకాశం ఇవ్వబడుతుంది. సుప్రీంకోర్టు ముందు హాజరుకావాలని అలహాబాద్ హైకోర్టున్యాయమూర్తిని పిలిపించి ఏర్పాటైన నిబంధనల ప్రకారం తన వెర్షన్‌ను తెలియజేయాలని కోరే అవకాశం ఉందని సుప్రీంకోర్టు వర్గాలు తెలిపాయి.డిసెంబరు 8వ తేదీన జరిగి న విశ్వహిందూ పరిషత్ కార్యక్రమంలో జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ 'సామాజిక సామరస్యం', 'లింగసమానత్వం', 'లౌకికవాదాన్ని ప్రోత్సహించడమే' యూనిఫాం సివిల్‌కోడ్ ప్రధాన లక్ష్యం అని ఆయన వ్యాఖ్యానించారు.అలహాబాద్ హైకోర్టులో విహెచ్‌పి లీగల్ సెల్ హైకోర్టు విభాగం ప్రాంతీయ సమావేశంలో జస్టిస్ శేఖర్‌కుమార్ యాదవ్ ప్రసంగించిన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక రోజు తర్వాత న్యాయమూర్తి రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్న వీడియోలు మెజారిటీ ప్రకారం పనిచేసే చట్టంతో సహా సోషల్‌మీడియాలో ప్రసారం చేయబడ్డాయి. అతని నివేదించిన స్టేట్‌మెంట్‌లను ప్రశ్నించిన ప్రతిపక్షనాయకులతో సహా అనేక వర్గాల నుండి తీవ్ర ప్రతిస్పందనలను ప్రేరేపించింది. దానిని 'ద్వేషపూరిత ప్రసం గం' అని నిందించారు.'క్యాంపెయిన్ ఫర్ జ్యుడిషియల్ అకౌంటెబులిటీ అండ్ రిఫార్మ్స్' అనే ఎన్‌జిఒ కన్వీనర్, న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మంగళవారం అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి ప్రవర్తనపై 'ఇన్‌హౌస్ ఎంక్వైరీ' కోరుతూ సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి సంజీవ్‌ఖన్నాకు లేఖ రాశారు. న్యాయమూర్తి జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ న్యాయనైతికతను ఉల్లంఘించారని, నిష్పాక్షికత, లౌకికవాద సంబంధిత రాజ్యాంగ సూత్రాలను ఉల్లంఘించారని ప్రశాంత్ భూషణ్ భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నాకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు న్యాయవ్యవస్థ ను బలహీనపరిచాయని, తటస్థ మధ్యవర్తిత్వ పాత్ర, దాని స్వాతంత్ర్యంపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసిందని ప్రశాంత్‌భూషణ్ అందులో ప్రస్తావించారు.న్యాయవ్యవస్థలో ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి బలమైన సంస్థాగత ప్రతిస్పందన అవసరం అని లేఖలో భూషణ్ పేర్కొన్నారు.'తక్షణమే న్యాయవ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్నిపునరుద్ధరించాలని మేం మీ కార్యాలయాన్ని (భారత ప్రధాన మంత్రి) కార్యాలయాన్ని కోరుతున్నాం. జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ చేసిన న్యాయపరమైన అనుచిత చర్యలపై విచారణ జరిపించేందుకు అంతర్గత కమిటీని ఏర్పాటు చేసి, జస్టిస్ యాదవ్ నుండి అన్ని న్యాయపనిని (జ్యుడీషియల్ వర్క్) ఉపసంహరించుకోవాలని ప్రశాంత్ భూషణ్ కోరారు. ఇదిలాఉంటే డిసెంబరు 8వ తేదీన సిపిఐ (ఎం) నాయకురాలు బృందాకరట్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సిజెఐ)కి ఒక లేఖ రాశారు. జడ్జి ప్రసంగం తన ప్రమాణాన్ని ఉల్లంఘించడమే అవుతోందని, న్యాయస్థానంలో అలాంటి వ్యక్తులకు స్థానం ఉండకూడదు అని పేర్కొంది.ఈ అంశంపై అత్యున్నత న్యాయస్థానం చర్య తీసుకోవాలని బృందాకరట్ కోరారు. కాగా హైకోర్టు న్యాయమూర్తి ప్రకటనలను ఖండిస్తూ బార్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బిఎఐ) ఒక తీర్మాన ం చేసింది.జస్టిస్ శేఖర్ కుమార్ యాదవ్ తన స్టేట్‌మెంట్స్‌ను ఉపసంహరించుకోవాలని, అతని వ్యాఖ్యలకు తగిన క్షమాపణ చెప్పేందుకు న్యాయమూర్తిని పిలిపించాలని కోరింది. భారత ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు సహచర న్యాయమూర్తులు ఈ సమస్యను కఠినంగా, దృఢంగా పరిష్కరించాలని బిఎఐ కోరింది. అడ్మినిస్ట్రేటివ్ ఆఫ్ జస్టిస్‌తో సంబంధంలేని సంస్థలు నిర్వహించే ఈవెంట్‌లను ఏ కోర్టు ప్రాంగణంలోనూ అనుమతించరాదని బార్ అసోసియేషన్ తీర్మానం నొక్కిచెప్పింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com